

Lakshmi Art Printing Works, 8.

శ్రీకృష్ణ జలక్రీడ

భారతి. నవంబరు. 1924.

సంపుటము 1. రక్తాక్షి సంవత్సరము. కార్తిక మాసము. సంచిక 11

ఆంధ్రకవిత్వ చరిత్రము - భాగరాజు నారాయణమూర్తిగారు (VYASAMU) 1

వర్షాగమము - వింజమూరి. రంగాచార్యులుగారు. ఎం.ఏ.బి.ఎల్. (KAUIPA) 14

ఉత్తరలు. గిడుగు వెంకట సీతాపతి గారు. (UYASAMU) 17

నా పాట శ్రీ వురికిపాటి రామనరసింహము జ్యులుగారు.. బి.ఎ. (KAVITA) 26

వసుచరిత్ర విమర్శనము. శుక్లపాటి వెంకట సుబ్బారావు శ్రీగారు. బి.ఎ (VYASAMU) 27

ప్రేమమాహాత్మ్యము. జంధ్యాల శివన్న శాస్త్రిగారు. (KAVITA) 36

భగవద్భక్తి వము - వేటూరి ప్రభాకర శాస్త్రిగారు. (PRAHASANAMU) 37

శ్రీ వేమన నాటకీయ ఇతిల జగము. ఉధకాక్ష సూర్యనారాయణ జయదేవగారు (KAVITA) 43

తురగ పంజరము. ఆ. రంగస్వామి సరస్వతిగారు. బి.ఎ. (UYASAMU) 44

ప్రేమతత్త్వము. మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారు. (KAVITA) 48

స్వప్న స్వర్గ పదేశము - క్షేమేంద్ర విసంపాత కృతికి [illegible].
శ్రీ రాజా వాసిరెడ్డి దుర్గా సదాశివేశ్వర ప్రసాద బహద్దరు గారు. (KAVITA) 147
విమర్శనలు. నా జ్ఞాపకములు. గ్రంథకర్త: శ్రీయుత పురాణం సూరి శాస్త్రి గారు (VYASAMU) 149
[illegible] వెంతురాగ నవ్వు. దేవులపల్లి కృష్ణ శాస్త్రి, బి.ఎ. సాహిత్యసమితి. (KAVITA) 151
[illegible] ఆంధ్ర [illegible]. నాయక [illegible]. (VYASAMU) 152
[illegible] బాలతో [illegible]. [illegible] వెంకటరాయ [illegible] గారు (KAVITA) 152
[illegible] మల్లంపల్లి సోమశేఖర శర్మ గారు. (VYASAMU) 153
[illegible] [illegible] సంకూరి వెంకట సుబ్బారావు గారు. బి.ఎ. సాహిత్యసమితి (KAVITA) 157
158
అంగారక గ్రహము. (VYASAMU)
సాహిత్యోదయ విశేషము. గాంధి మహాత్ముని ఉపవాస దీక్ష (VYASAMU) 160

చెన్నపట్టణము, నవంబరు ౧౯౨౪

సంపుటము ౧. రక్తాక్షి సంవత్సరము కార్తికమాసము సంఖ్య ౧౧.

ఆంధ్రకవిత్వచరిత్రము

భోగరాజు నారాయణమూర్తి గారు

VII

యుగవిభాగము

సాంఘికచరిత్రములును వాఙ్మయచరిత్రములును దేశచరిత్రములోనివిభాగములు. దేశముతో సంబంధించిన రాజ్యాంగ విషయములు మాత్రమేకాక, తత్ప్రజల యాచారవ్యవహారాదులును భాషావిశేషములును సంపూర్ణముగఁ దెలిసికొనినప్పుడుగాని దేశ చరిత్రమును వ్రాయుటకుఁ బ్రయత్నింపరాదు. ప్రయత్నించిన యెడల నది సంపూర్ణమైన చారిత్రక గ్రంథ మనిపించుకొనఁ బడదు. రాయలనాఁటి యాంధ్ర దేశ చరిత్రమును వ్రాయుటకుఁ బూనుకొనినయెడలఁ గేవలమును వాని దిగ్విజయాదిరాజ్యాంగ ప్రసంగములను మాత్రమేకాక, యప్పటి సాంఘిక విషయములును, రాయలభాషాభిమానమును, దత్కాలమునందలి వాఙ్మయ చరిత్రమును గూడ వానితోఁ జేర్చినయెడల నప్పుడు సంపూర్ణమైన దేశచరిత్రముగా నది భావింపఁబడును. ఒకానొక దేశమునందలి వాఙ్మయస్థితినిబట్టి ప్రజలనాగరకతయు నిట్టిదని నిరూపింపవచ్చును. వాఙ్మయము వృద్ధిచెందు

కొలఁది నాగరకతయుఁ బెంపు వహించుచుండును. అందుచే సాంఘికసారస్వతచరిత్రములు దేశచరిత్రములోని విభాగములుగా నెన్నుకొనఁ బడుచున్నవి. ఇట్లు రాజకీయసాంఘికవాఙ్మయములనుముఖ్యమైనమూఁడుభాగములును,అవసరమైన యంతర్విభాగములతోఁ బ్రత్యేకగ్రంథములుగాఁగాని, యేకగ్రంథముగాఁగాని రచింపఁబడినయెడ మొత్తముపై సంపూర్ణమైన దేశచరిత్రమును మనము తెలిసికొనఁగలము. దేశచరిత్రములో నొకభాగమైన రాజ్యాంగచరిత్రమునుమాత్రమే చరిత్రకారులు వ్రాయుచువచ్చిరిగాని, సాంఘికచరిత్రములును, వాఙ్మయచరిత్రములును విపులముగ వ్రాయకుండుటచేత మన కింకను సంపూర్ణమైన యాంధ్రదేశచరిత్రము లభింపలేదని చెప్పవచ్చును.

యుగవిభాగావశ్యకత

చరిత్రకారులు హిందూదేశపురాజ్యాంగచరిత్రమును హిందూయుగమనియు, మహమ్మదీయ యుగమనియు, మహారాష్ట్రయుగమనియు, నాంగ్లేయయుగమనియు, నాలుగంతర్విభాగములుగా భాగించినారు. ఈయుగవిభాగమే యాగ్రంథ మెన్నియో శతాబ్దముల చరిత్రముగాని నిన్న మొన్నటి వృత్తాంతము గాదని చెప్పక చెప్పుచున్నది. ఇట్లే నన్నయ మొదలు నేఁటివరకు నించుమించుగఁ దొమ్మిది శతాబ్దముల కాలపరిమితిగల యాంధ్రకవిత్వచరిత్రమును వ్రాయుచో మనకును యుగవిభాగ మవసరమని తోఁచుచున్నది. మఱియు మీఁదఁ జెప్పిన హిందూ మహమ్మదీయాది యుగవిభాగమునుబట్టి మన దేశ మొక్కొక్క కాలమున నొక్కొక్కజాతివారిచేఁ బరిపాలింపఁబడుచు వచ్చినదని సూక్ష్మముగఁ దెలిసికొనఁగలుగుచున్నాము. ఇట్టి జాతిభేదము లేక నాఁటినుండి నేఁటివఱకును హిందూదేశ మొక్కజాతిప్రభుత్వముక్రిందనే పరిపాలింపఁబడుచు వచ్చియుండినయెడలఁ జరిత్రకారులు తమచారిత్రకగ్రంథవిషయవిభాగమును మఱియొకవిధముగాఁ గావించియుందురు. పదునొకండవ శతాబ్దము మొదలుగ నిరువదియవ శతాబ్దమువఱకును నాఁటి నన్నయకవిత్వమే వ్యాపించుచువచ్చి యుండినయెడల మనకును నియ్యుగవిభాగ మవసరముకాకపోయి యుండును. కాని, యిన్ని శతాబ్దములవఱకు నొకజాతిప్రభుత్వముక్రిందనే పరిపాలింపఁబడుచుండుటయు నొకజాతి కవితారచనయే కావింపఁబడుచుండుటయు నేదేశమునందును సంభవింపనేరదు.

ఒకదేశమునందలి ప్రభుత్వము పెక్కుమార్పులు చెందుచు వచ్చెనని రాజ్యాంగచరిత్రకారుఁడు వ్రాసిపెట్టినప్పుడు, తద్దేశమునందలి వాఙ్మయముసైతము పెక్కుమార్పులు చెందియుండునని కవిత్వచరిత్రకారుఁడు గ్రహింపవలసినదే. ఇంతియేకాక కావ్యరచనయందుఁ గవి తన్నును దనదేశమును దన సంఘమును మఱుగుపరచుట కెప్పుడును బ్రయత్నింపఁడు. అందుచేఁ గావ్యదర్పణమునం దొక్కకవినేకాక, కవికాలమునాఁటి పలువిధములగు నితరవిషయములును మనము తెలిసికొనఁ గలుగుచున్నాము. ప్రభుత్వము

మారినప్పుడు పరిపాలనమునఁ గొంతభేద ముండకపోదు. పరిపాలనము భేదించినప్పుడు ప్రజలయందును గొంత నూతనత్వము గలుగక తప్పదు. ప్రజలలో నూతనత్వ మనుచో వారిలో నొకఁడైన కవియందును నది సంక్రమింపకయుండదు. కవియందుఁ గలిగిన నూతనత్వము వానికావ్యమునందుఁ గానరాకపోదు.

రాజనరేంద్రుని మతము

నన్నయనాఁటి వాఙ్మయముతోఁ దత్పూర్వవాఙ్మయమును సరిపోల్చుటకు విపులమైన యాధారము మనకు లేకపోయినను, రాజరాజు తనపూర్వులవలెఁ దాను జైనమతాభిమానిగాక బ్రాహ్మణమతోద్ధారకుఁ డని యాతఁడు వ్రాయించిన భారతరచనావిధానమును బట్టియే కాక,

"మ. ఇవి యేనున్ సతతంబు నాకును గరం
బిష్టంబు లై యుండుఁబా
యవు భూదేవహితత్వరత............"

అని పలికిన పలుకులవలన మఱింత స్పష్టమగుచున్నది. రాజనరేంద్రుఁడిట్లు భిన్నమతస్థుఁడగుట చేతనే, జైనమతానుకూలముగ నదివరకుఁ గన్నడమున రచింపఁబడిన 'పంపాభారతము' నకుఁ బోటీగా నన్నయచే నాంధ్రమహాభారతమును వేదమతానుకూలముగ వ్రాయించెను. రాజరాజు తండ్రియైన విమలాదిత్యుఁడు జైనమతాభిరతుఁడైనట్లును, "త్రికాలయోగి సిద్ధాంతదేవర" యను జైనగురునకు శిష్యుఁడైనట్లును, పూషవాడ సంస్థానములోనిదగు రామతీర్థక్షేత్రము నందలి 'పాండవులపంచ' యను గుహాలోని శాసనమువలనఁ దెలియుచున్నది. ఈ శాసనమా జైనగురు విరచితమైనదే. ఒక్కవంశమునఁ బుట్టిన ప్రభువులయందే మన కింత మతభేదము గానవచ్చుచుండ, జాతిభేదములు గల ప్రభువులపరిపాలనమునం దిట్టిమార్పులు పెక్కులుండుట యొకవింతగాదు. జైనమతస్థుల వాఙ్మయమేమైన మనకు లభించియుండినయెడల మన మీసమస్య నింతకంటె నెక్కుడుగఁ జర్చింపఁగలిగియుందుము.

ఆంధ్రదేశమును గాకతీయచక్రవర్తులు పరిపాలించుచుండిన కాలములోఁగూడ మన సారస్వతమునఁ గొంత మార్పు గానవచ్చుచున్నది. ఆమార్పు ప్రభువులతో సంబంధించినదియే కాని తద్భిన్నమైనది కాదు. కాకతీయ ప్రభువులు శైవమతస్థులు. ఆయుగమున వృద్ధిగాంచినదియు శైవవాఙ్మయమే. ఇట్టి నిదర్శనములు మఱికొన్నియున్నను, "దేశమునందలి ప్రభుత్వమునకును వాఙ్మయమునకును గల పరస్పరసంబంధ" మనునది ప్రత్యేక విషయము (Subject) గాఁ జర్చింపఁదగినదగుటచే నియ్యుగవిభాగ ప్రకరణమున నింతకన్న మనము ముచ్చటింప నవసరములేదు. ప్రభుత్వము తోడనే వాఙ్మయమునకును గొంతమార్పు గలుగుచుండునని సూచించుటయే మన ప్రస్తుతాంశము.

అజ్ఞాతయుగము

పైని వివరించిన యంశములంబట్టి మన కవిత్వ చరిత్రమునకును యుగవిభాగ మవసరముగాఁ గానవచ్చుచున్నది. అందుచే నన్నయమొదలు నేఁటివఱకుంగల వాఙ్మయము

నంతటిని నేయేయుగముల క్రింద నెట్లు విభాగింపవలసియున్నదో చర్చింపవలయును. ఈచర్చయొనర్చుటకు ముందు విపులమైన యాధారములు లేకపోయినను నన్నయకుఁ బూర్వవాఙ్మయచిహ్నములను గొంతవఱకైనఁ బరిశీలింపక విడుచుట న్యాయముగాదు. పదునొకండవ శతాబ్దమునకుఁ బూర్వపువాఙ్మయము మనకుఁ బ్రత్యక్షముగఁ గానరానందున దాని నజ్ఞాతయుగమని చరిత్రకారులు వాడుచున్నారు. ఈ యజ్ఞాతయుగమునఁ గొంతవఱకైనఁ దెనుఁగు వాఙ్మయ ముండియుండునా? లేదా? ఉండినయెడల దానిస్వరూప మెట్టిది? అట్టి వాఙ్మయమునకుఁ బ్రచారకు లెవ్వరైయుండిరి? అను నీ ప్రశ్నలు 'నన్నయ యాదికవి యగునా కాదా?' యను విద్వద్వివాదములలోఁ గొంతవఱకుఁ జర్చింపఁబడినవి.

ఆఱవ శతాబ్దమునుండియు సత్యాశ్రయుఁడు మొదలగు చాళుక్య ప్రభువు లాంధ్రవాఙ్మయమునకుఁ బ్రోత్సాహకారులై పనిచేసినట్టి నిదర్శనములు గానవచ్చుచున్నవనియు, చాళుక్యచక్రవర్తియగు యుద్ధమల్లుని శాసనమువలనఁగూడ నన్నయకుఁబూర్వము తెనుఁగుకవిత విపులముగ వ్యాపించియుండినట్లు రూఢియగుచున్నదనియు, వాఙ్మయపరిశోధకు లిదివఱకే కనిపెట్టియున్నారు. రాజనరేంద్రుని సమకాలికుఁడగు భోజరాజునకు "ముద్రామాత్య" మను నొక యాంధ్రకావ్యము క్షేమేంద్రకవిచే నంకితముచేయఁబడినట్లుగ నాంధ్రులచరిత్రము చెప్పుచున్నది.

ఇవి యిట్లుండ నీ క్రిందఁ బేర్కొనఁబడిన శాసనమునుబట్టి యజ్ఞాతయుగములోని తెనుఁగుకవితను గుర్తించుటకుఁ గొంతయవకాశము కలుగవచ్చును.

గుంటూరుజిల్లా కూరపాటితాణా మునిగోడు
గ్రామమునందలి శాసనము

"శ్రీకతజనేశ్వరాలయము శ్రీమునిను
ప్రతతీర్థికాలమ|ద్భాతి ప్రతిష్ఠ సేసెమునిగోటి
వదియ్యజిన ప్రతిష్ఠ వి|ఖ్యాతిగనిల్పె గొంకనృప
గట్టెను గైచనుబోయగట్టె జీబూతపురాట్ట
హాస వామభట్టి సమానయశోవిరాజియై.

స్వస్తి సర్వలోకాశ్రయ శ్రీవిష్ణువర్ధన మహారాజుల ప్రవర్ధమాన విజయరాజ్య సంవత్సర బులు ౩౨ గు శ్రాహి, శ్రీమన్మహామండలేశ్వర గొంకయమునుగోటి కతజనేశ్వరాలయంబునకు నిచ్చిన గదుగమడి ...."

సర్వలోకాశ్రయ విష్ణువర్ధనుఁడనుపేరు రాజనరేంద్రునకుఁ బూర్వుఁడైన మొదటి చళుక్యభీమునకుఁ గలదు. అతని శాసనములలో శక సం. 814 అనఁగా క్రీ. శ. 892 వ సంవత్సరములో వ్రాయఁబడిన శాసన మొకటి కలదని 1918 వ సం. మదరాసు ఎపిగ్రాఫీ రిపోర్టులోఁ జెప్పఁబడినది. పై శాసనమునందలి గొంకరాజన కేలికయగు విష్ణువర్ధనుఁ డీవిష్ణువర్ధనుఁడే యైనయెడల నియ్యది నన్నయకుఁ బూర్వము రెండువందల సంవత్సరముల క్రింద వ్రాయఁబడినదియై యుండును. అప్పటికి జైనమత మాంధ్రదేశమున మిక్కిలి ప్రచారములో నుండెను.

చాళుక్య మహారాజులందఱును సర్వలోకాశ్రయ విష్ణువర్ధనులని వ్రాసికొనుచుండినవారేయయ్యు మీఁదిశాసనము జైనశాసనమగుటచేత నందలి సర్వలోకాశ్రయ విష్ణువర్ధనుఁడు రాజరాజునకుఁ బూర్వులలోని యొకసర్వలోకాశ్రయ విష్ణువర్ధనుఁడై యుండి యుండవలయును.

మఱియుఁ జాళుక్యులకుఁ బూర్వము పల్లవులకాలములోఁ † పల్లవరాజైన 'అత్రివర్మ' వ్రాయించిన శాసనమొకటి గుంటూరుజిల్లాలోని గోరంట్లగ్రామములో నున్నది. ఆశాసనములో 'అంతుకూరు' 'తాంటికొండ' అను తెనుఁగుమాటలు కనఁబడుచున్నవి. పల్లవరాజులు ఆఱవశతాబ్దమునాఁటి చాళుక్యప్రభువులకుఁ బూర్వులగుటచే నీశాసనము నాలవశతాబ్దము నాఁటిదియో యైదవశతాబ్దము నాఁటిదియో యైయుండును. ఇందువలన నన్నయ కైదాఱువందలసంవత్సరములకుఁ బూర్వమునందే తెనుఁగు ప్రచారములోనున్నట్లు చెప్పఁగలము

అజ్ఞాతయుగములోని పద్యరచన

ఇది యిట్లుండ మునిగోటిశాసనములోని తెనుఁగుపద్యమునుగూర్చి కొంత విచారింతము. ఆపద్యములో గీరలుగలచోట్ల ఛందోదోషము లున్నవి. వానిని శాసన పరిశోధకానుభవము గలవారే సవరించుట యుత్తమమని యున్నది యున్నట్టులేయిందుఁ జేర్చితిని. ఛందోభంగముగల మొదటిపాదమునందుఁదప్ప, తక్కినమూఁడు పాదములయందును 'త' ప్రాస కానవచ్చుచుండుటచేత నీపద్యములోని ప్రాసనియమమును గూర్చి సంశయింపవలసినపనిలేదు. కాని యతిమాత్రము 1-3 పాదములయందే కానవచ్చుచున్నది. అందులోఁ బద్యారంభము ఛందోదోషముగలదియగుటచేత 1 వ పాదమునందలి యతిని విశ్వసించుటకు వీలులేదు. ఛందోభంగములేని రెండవపాదమునఁగూడ యతి గానరాదు. అందుచే నీపద్యమున యతిని నియమముగాఁ బెట్టుకొనలేదని చెప్పవచ్చును. నన్నయనాఁటుగాని నన్నయకుఁ బూర్వముగాని యతినిర్బంధములేకయే తెనుఁగుపద్యములు రచింపఁబడు నాచారము కలదేమో! యతినియమములేని కన్నడకవిత్వము భారతమునాఁడును భారతమునకుఁ బూర్వమునందును గూడ మిక్కిలి ప్రచారములో నుండుటచేత, తత్సాంప్రదాయ మొకప్పుడు తెనుఁగుకవితకుఁ గలిగినఁ గలిగియుండవచ్చును. కన్నడాంధ్రములు రెండు నత్యంతబాంధవ బంధురములుగదా? ఆంధ్రకవితకు నన్నయవలెఁ గన్నడకవితకుఁ బ్రసిద్ధపురుషుఁడును, నన్నయకు సమకాలికుఁడు నగు 'అభినవపంప' యను కవీశ్వరుని పద్యమొకటి చిత్తగింపుఁడు. సంస్కృతపదాకలితంబగు నొక తెనుఁగుపద్యముతో నీకన్నడపద్య మెంతో భేదమును సహించియుండదు.

'మ. పరమబ్రహ్మశరీరపుష్టి జనతాంతర్దృష్టి కైవ
ల్యబో,ధరమామాత్రికహారయష్టి కవితావల్లీ సుధా
వృష్టి స, ర్వరసోత్పాదనవీనసృష్టి బుధహార్దాకృష్టి
సర్వాంగసౌం,దరవిద్యానటనాటకం నలిగె మత్కా
వ్యస్థలీ రంగదోళ్.'

† Ind. Ant. Vol. 9, Page 103

కావ్యరచనావిధానము లనేకములు కన్నడమునుండి తెనుఁగులోఁ బ్రవేశించియుండ, మన తెనుఁగుకవు లొకప్పుడు కన్నడకవులవలె యతిని నిర్బంధముగాఁ బెట్టుకొనకయే పద్యములు వ్రాయుచుండిరనుటలో నాశ్చర్యముండదు. కాని కన్నడ కవితా ప్రసిద్ధినాఁడు తమిళకైతయును బ్రసిద్ధియందేయుండుట చేత నందలి యతినియమమును నైతమును గొంద ఱవలంబించుచు నుండియుందురు. ఇట్లు యతినియమమును బాటించికొందఱును బాటింపక కొందఱును గవిత్వ మల్లుచువచ్చుచుండ నన్నయరచించిన భారతముతో నియ్యతినియతి సంపూర్ణముగా నాంధ్రకవిత్వమునందు స్థిరపడినదిగాఁ గానవచ్చుచున్నది. మఱియు రాజనరేంద్రుడును రాజనరేంద్రుని తండ్రియుఁ గూడఁ జోళరాజులకు జామాతలు. ఆసందర్భమున రాజరాజనకుఁ జోళులతమిళకవితా విధానములతోఁ బరిచయము గలిగియుండవచ్చును. అందలియతినియమము వానికి నచ్చియుండవచ్చును. నచ్చి నన్నయముఖంబున భారతముగుండ నాంధ్రకవిత్వమునఁ జొచ్చియందు స్థిరపడి యుండవచ్చును.

నన్నయఛందో నియమములు

ఆంధ్రకవిత్వమున నస్థిరముగా సంచరించుచుండిన యీయతి నన్నయకాలమున స్థిరపడుటచే నియ్యతినిర్మాణకర్త నన్నయయే యని కొంద ఱందురు. నన్నయకు సమకాలికుఁడును, వానికి బహుదూరదేశము నందుండినవాఁడు నగు 'వనపతి'యను నొక సామంతప్రభువు కళింగరాజ్యములో నరసన్నపేట తాలూకునందలి దీర్ఘాసి యను గ్రామమున వ్రాయించిన శాసనమునందు, నన్నయఛందోనియమములుగల సీసపద్యము వ్రాయఁబడియున్నది. నన్నయయే యీ యతినిర్మాణకర్తయనుటకు వీలుండదని సూచించుట కాపద్యమిందుఁ బొందుపరుపఁబడినది.

దీర్ఘాసిలోని వనపతిశాసనము. శా. శ. 997-- క్రీ. శ. 1075.

"సీ. శ్రీశకనేండులు భూపతిపై శైల
నందాబ్ధిభవసంఖ్య నొంద, వేంగి,
దేశంబుఁ గిమిడియుఁ గోసల గ్రిడిసింగి
దేశంబు మరి యొడ్డదేశమునఁగ
జనిన భూపాలుర నని నోర్చి చలమర్తి
గండఁడై నెగడిన మండలికుఁడు,
భూసురవంశుండు వాసవనిభభోగి
బణపతి సౌజన్య గుణయుతుండు,
దీర్ఘాసి భగవతిదేవి దేవాలయ
మున ముండటంగడు భువనకరముగ
మండప మెత్తించె భండనవిజయుండు
గండగోపాలుం డఖండవర్తి
దీవియబెట్టెఁ బద్దెనికి నవ్వాలన్
దనమనోవల్లభ వనజనేత్రి
దీవియబెట్టెఁ బద్మావతి యనశశి
క్షోణులుంగల యంతకును ముదమున
గగనభూమి చంద్రభారకరోదకశిఖి
మారుతాత్మమూర్తి మహిమ మధన
యిష్టపూర్తిఫలము లెల్లకాలంబును
మెచ్చులోడఁ దమకు నిచ్చుచుండ."

ఆంధ్రకవిత్వమున 'ప్రసన్నకథా కవితార్థయుక్తి'ని గొందఱును 'అక్షరరమ్యతను' గొందఱును నాదరించుచున్నట్లు,

"సారమతింగవీంద్రులు ప్రసన్నకథాకవితార్థయుక్తిలో నారసి మేలునా నితరు లక్షరరమ్యత నాదరింప..."

అను నన్నయపద్యమువలనఁ దెలియుచున్నది. ఇట్టి సాహిత్యమతభేదములు విమర్శనములును వాఙ్మయము కేవలము శైశవమునందున్నప్పుడు కలుగనేరవు. అందుచే నన్నయనాఁటికే యాంధ్రకవిత్వము మిక్కిలి ప్రచారమునం దుండెననియుఁ దత్పూర్వపు టజ్ఞాతయుగము నిరాంధ్రయుగముగాదనియు నిశ్చితమగుచున్నది.

చారిత్రకాజ్ఞాతయుగము

మన యాంధ్రకవిత్వ చరిత్రమునందు వలెనే హిందూదేశపు రాజ్యాంగచరిత్రమునందుఁగూడ నొకయజ్ఞాతయుగము గానవచ్చుచున్నది. పారంపర్యములైన కథలమూలమునఁగాని లిఖితరూపమునఁగాని యెట్టి నిదర్శనములును లేని యాయజ్ఞాతయుగమునందలి చారిత్రకాంశములను గనిపెట్టుటకై ప్రతిభావంతులైన మన చరిత్రకారులు నేఁటికిని బ్రయత్నించుచున్నారు. ఈవిషయములో వారికిఁ దోడగుచున్న యాధారములు పురాతనపుఁ గట్టడములు మొదలగు శిల్పములు (Architecture)మాత్రమే. లిఖితరూపకములైన యాధారములు లేనప్పుడు దేశమునందలి ప్రజలంగూర్చియు వారి మతముంగూర్చియు రాజ్యాంగ ప్రసంగములం గూర్చియుఁ గొంతవఱకైనఁ దెలియఁగలుగుటకీ శిల్పకళలే మార్గదర్శకములు. అజ్ఞాతయుగమునందలి చారిత్రకాంశసంపాదనకై యీశిల్పకళ లెట్లు సాయపడుచున్నవో యీక్రింది విషయములవలన స్పష్టముకాఁగలదు.

Dr- Fergusson says " In the rails of Buddha Gaya and Bharant, we have a complete picture of Buddhism as it existed during tne great Mouryan dynasty. (B.C. 320-B.C.180) At sanchi and the western caves we have as complete a representation of the form it took from the 2nd century B.C to 3rd century A.D. At Amaravaty and the Gandhara monastaries we learn what modifications had been introduced between our era and the third century and from the Ajanta and the later caves we trace its historv down-ward through its period of decay till it faded away altogether.

During the first half of this thousand years we have no contemporary records expect those written in stone and during the latter we have no books to rely upon; but the architecture with its sculptures and paintings remain and bear the indelible impress of the thoughts, the feelings and the aspirations of those who executed them and 'supply us with a vast amount of exact knowledge on the subject which is not available by any other means now known to us.

*   *   *   *

బౌద్ధజైన చిహ్నములు

హిందూదేశమునందలి యుత్తరభాగములయందువలెనే మనయాంధ్రదేశము నందుఁగూడ బౌద్ధ జైనచిహ్నములు విచ్చలవిడిగాఁ గానవచ్చుచున్నవి. బహుదూరస్థములైనవియే కాక, మన చుట్టుప్రక్కలనున్న, అమరావతి, పీఠికాపురము, బొజ్జనకొండ, రామతీర్థము మొదలగు పెక్కుస్థలములయం దిట్టి శిథిలాలయ చిహ్నములను నేఁటికిని మనము చూచుచున్నారము. *"అందు నమరావతి స్తూపమునందలి యొకచిన్న స్తంభముమీఁదఁ జెక్కఁబడిన కథయొక్క పటమీసంచికలో నీయఁబడినది. స్తంభమునకుఁబైని యొక

*లలితకళలు, కీ. శే. గొ. వే. లక్ష్మణరావుపంతులుగారు ఎం.ఏ., ఆం.ప.సా.దర్శిరోద్ధారి సం॥ వైశా.బ.12 శనివారము,

శాసనమును, దానిక్రింద మకరతోరణమును, దానిక్రింద కమలమును, దానిక్రింద కథయు, దానిక్రింద మరలఁ బద్మమును జెక్కఁబడి యున్నవి. క్రిందిభాగము కొంతపగిలిపోయినది. రెండుకమలముల మధ్యఁ గలకథ యెద్దియని మనము పరీక్షింపఁగా నందలి ప్రతిమల హావభావాదికములవలన నీకథ గోచరించును."

"పైభాగమున నొకరాజు సింహాసనమున నాసీనుఁడై యున్నాఁడు. చారుఁడొకఁడు చేతులుజోడించుకొని యేదియో వార్త చెప్పుచున్నాఁడు. అతని యెదుటిభాగమునందు సైనికులు కోటను సంరక్షణసేయుచున్నట్లున్నారు. అంతకుక్రిందిభాగమున కోటద్వారమునుండి సైనికులు లోపలికి జొరబడుచున్నట్లున్నది. అందు నేనుఁగులు గుఱ్ఱములు పదాతులు గూడనున్నారు. క్రిందనొకఁడు శత్రుఁడు కాఁబోలును సాష్టాంగపడి శరణుజొచ్చినట్లు కానవచ్చుచున్నది. ఈవార్తయే పైని చారుఁడు రాజుతో చెప్పుచుండెగాబోలు. స్తంభముయొక్క క్రిందిభాగము పగులక యున్నయెడల నీకథయొక్క తదుపరివృత్తాంతము మనకు తెలిసియుండును."

"ఇంకొకపటము జూడుడు. ఇదియు నమరావతిలోనిదే. ఈబండపైభాగము కొంతపగిలినది. ఆపగిలిపోయిన వృత్తమునందు ఒకబౌద్ధబోధకుఁడు స్త్రీపురుషులకేదియో బోధించుచున్నట్లును వారందరును భక్తిశ్రద్ధలతో వినుచున్నట్లును వారిపైని దేవగంధర్వులు పూజాద్రవ్యములను గొనివచ్చి యర్పించుచున్నటును గానవచ్చుచున్నది. బోధకునితల లేనందున నీతఁడు బుద్ధుఁడో బోధిసత్త్వుఁడో మరియెవఁడో తెలిసికొనుటకు వీలులేకుండ నున్నది. పైవృత్తమునకును క్రిందికమలమునకును నడుమనున్నపటములు మూడుగళ్లుగా విభజింపబడియున్నవి. మొదటిగదిలో నొక రాజు సింహాసనముమీద గూర్చుండినట్లును, ఒకయువకుడు భూమిమీద నాసనమువేసి కూర్చుండినట్లును, ఒకవీరుడు తనకేమియో చూపి వీరావేశసంభాషణము గావించుచున్నట్లును రాజు ఈసంభాషణము వినుచున్నట్లును జూపబడినది. రెండవగడిలో ఈసంభాషణము యొక్క ఫలము చూపబడినది. రాజొక యేనుఁగునెక్కి తొందరగా శత్రువులమీదికి బోవుచున్నాఁడు. అతనివెంట నిద్దరుస్త్రీలు మాత్రమున్నారు. శస్త్రములుకూడ లేవు. అతనివెంట సైన్యమువచ్చుచున్నది. ఆకాశమునుండి దేవగంధర్వులు పుష్పమాలలు వేయుచున్నారు. మూడవగడిలో వాయువేగమున బరుగిడుచున్న యశ్వములనెక్కి శత్రులు పారిపోవుచున్నట్లు చూపబడినది...
..............................."

మతయుద్ధములు

ఈ గురుతులన్నియు మనదేశ మొకప్పుడు బౌద్ధజైన జనాక్రాంతమై యుండెనని చెప్పుట కవకాశము గలిగించుచున్నవి. అది నుండియు మనదేశస్థులకు మతమునందుఁ బ్రీతియుఁ బట్టుదలయు నెక్కువగదా? రాజకీయయుద్ధములవలెనే మతముతో సంబంధించినయుద్ధములుఁగూడఁ బూర్వము మనదేశమున జరుగుచుండెడివి. బౌద్ధ-జైన-శైవ-

వైష్ణవమతములు విజిగీషతోఁ జెలరేఁగి యాంధ్రదేశమున నగ్రస్థానము వహించుటకై తమలోఁదాము నిరంతరమును గలహించుచుండెను. ఈమతయుద్ధములను దరుచుగా రాజులే నాయకులై నడపించుచుండెడివారు. దేశములో నొక్కొకకాలమున నొక్కొక మతము ప్రజలయొక్కయుఁ బ్రభువులయొక్కయుఁ బ్రోత్సాహమును వహించి ప్రాధాన్యమును బొందుచుండెను. ఈసందర్భమున జైనబౌద్ధమతముల నిర్మూలమును గూర్చి యాంధ్రులచరిత్ర మిట్లు చెప్పుచున్నది.

"బౌద్ధులకును జైనులకును ఘోరకలహము ప్రారంభమై మతచర్చలతిభయంకరములయ్యెను. మహారాజగు విష్ణువర్ధనుఁడు వైష్ణవులపక్షమునఁ జేరినందున జైనులబల ముడిగిపోయినది. రామానుజుఁడు జైనమతాచార్యులను వాదమున గెలిచెనఁట. వైష్ణవపక్షపాతియై విష్ణువర్ధనుఁడు 790 జైనదేవాలయములను నాశనముచేసి, యదివర కాదేవాలయముల పోషణార్థమై దానముచేసిన మడులు మాన్యములు నూడఁబెఱికికొని వైష్ణవదేవాలయముల కైంకర్యాదుల కొసంగెను............................ వైష్ణవమతమవలంబింపని జైన మతాచార్యులనేకులు ఱాతిగానుగలలోఁ బెట్టి చంపఁబడిరి. పద్మగిరిలోఁ దిరుగఁబడిన జైను లనేకులు పైరీతిగనే సంహరింపఁబడిరి. ఈ ఘోరప్రళయమునకు భయపడి జైనమతావలంబకు లనేకులు తప్తముద్రధారణమును గైకొని వైష్ణవులయిరి. ఈవిషయములు స్థలపురాణములలోను వైష్ణవమత గ్రంథములలోను వ్రాయఁబడినవి............"

ఆంధ్రదేశముతో సంబంధించిన యిట్టి మత విషయములును రాజ్యాంగాది సకలవిషయములునుగూడ శిల్పచిహ్నములేకాక యంతకంటె నెక్కుడుగ గ్రంథజాలము సైతము మనకుఁ దోడగుచుండుటచేతఁ బదునొకండవ శతాబ్దమునకుఁ బూర్వముకంటెఁ దరువాత మన కెక్కువగా స్పష్టమగుచున్నవి. పదుమూఁడవ శతాబ్దమున గణపతిదేవుని నాఁడుఁ గూడఁ దిక్కనసోమయాజి కారణమునఁ బలువురు జైనబౌద్ధులు సంహరింపఁబడిరని సోమదేవరాజీయాది గ్రంథములవలనఁ దెలియుచున్నది.

జైనుల యాంధ్రకావ్యరచన

ఇట్లు బౌద్ధులంగూర్చియు జైనులంగూర్చియు ననేకసంగతులు గ్రంథజాలమువలనఁ దెలిసికొనుచు, వాని కుదాహరణములుగా జైనబౌద్ధశిల్పచిహ్నములను బెక్కుస్థలములయందుఁ జూచుచున్నాము. రానురా నీరెండు మతములకును దేశమున నాశనము సంభవించుచువచ్చినను, గొన్నిశతాబ్దములు మాత్రమీబౌద్ధులును జైనులును దమ మతప్రచారమునకై మనయాంధ్రులతో నేకీభవించి సర్వవిధముల వారితోఁ గలసిమెలసి సంచరించుచుండిరని పై నిదర్శనములేకాక యింకను బెక్కు చారిత్రకాంశములు చెప్పుచున్నవి. పెక్కు శతాబ్దములవఱకు నింతటి గాఢమైన సంబంధ మాంధ్రులతో వహించిన యీమతస్థులకు, ఆంధ్రులవాఙ్మయముతోఁగూడ సంబంధ

ముండక తీరదు. అందుచే నియ్యుభయ మత బోధకులునుగూడఁ గన్నడాది భాషలయందువలె నాంధ్రభాషయందును గొన్ని గ్రంథములు రచించియుండవలెను. ఇందుకు దృష్టాంతముగాఁ గంచిలో నొకజైన మతమునందుఁ దెనుఁగు జైన శతక మొకటి కలదని జైనగజెటు అధిపతులైన మ-రా-శ్రీ, సి.యస్. మల్లినాథుగారు చెప్పుచున్నారు.

ఆంధ్రవాఙ్మయమునందు బౌద్ధయుగము, జైనయుగము

ఈ బౌద్ధ జైన మతబోధకులు గావించిన యాంధ్ర గ్రంథరచన యేయుగమునందు విచ్చలవిడిగా జరిగియుండునో యూహించుటయు మన కవసరము. ఇది సుకరమే కాని దుష్కరముగాదు. ఆంధ్ర వాఙ్మయోద్ధారకులలో నగ్రగణ్యుఁడైన రాజరాజు విమలాదిత్యునివలెఁగాక, బ్రాహ్మణ మత ప్రతిష్ఠాపకుండై జైన మతవిసర్జనముగావించుట జైనులకెల్ల గొప్ప ప్రోత్సాహ భంగమనుటలో సందియములేదు. "యథా రాజా తథా ప్రజా" యను న్యాయమునఁ బ్రభువననుసరించి ప్రజలకును నమ్మతమునం దసహ్యాభావము పుట్టియుండకపోదు. కావునఁ బదునొకండవ శతాబ్దమునందే జైనమతపతనమునకై యాంధ్రదేశమున నశుభసూచకము లారంభించెనని చెప్పవచ్చును. ఇయ్యపశకునములు కనుకూలముగ, బండ్రెండవ శతాబ్దమునందు * విష్ణువర్ధనునిచే నొకమారును, పదుమూఁడవశతాబ్దమున గణపతిదేవునిచే నొకమారును లోకభయంకరములైన బౌద్ధజైన సంహారములు రెండు గావింపఁబడినవి. అందు గణపతిదేవ్రుఁడీమతసంహారములో రాక్షసక్రౌర్యము వహించెనని చెప్పెదరు. మొత్తముపైఁ బదుమూఁడవశతాబ్దము రక్తసిక్త గాత్రములైన బౌద్ధజైనమతములకు సాయంకాలమని చెప్పక తప్పదు. ఈకారణములవలన 11-12-13 వ శతాబ్దములలో నీమతములు క్రమక్రముగా నశించినవనియే చెప్పవలసియున్నది. కావున నన్నయకుఁబూర్వపు టజ్ఞాతయుగమునందే మనయాంధ్రదేశమున బౌద్ధులును జైనులునుగూడ గొప్పయున్నతి వహించియుందురు. ఆయుగమునందే వారికి మిక్కిలి యాంధ్ర జనాదరణము కలిగియుండును. మత ప్రచారమునకై వారుగావించిన యాంధ్ర గ్రంథరచనయు నప్పుడే విచ్చలవిడిగా జరిగియుండును. ఈయజ్ఞాతయుగమునందే బౌద్ధయుగమనియు, 'జైనయుగి' మనియు మన యాంధ్ర వాఙ్మయముతో సంబంధించిన రెండుయుగము లుండియుండవలయును.

ఇంక 11 వ శతాబ్దము ప్రారంభముగాఁగల వాఙ్మయము నంతటిని మనమెట్లు యుగవిభాగ మొనర్పవలయునో విచారింతము. భారతయుగము నాఁటి వాఙ్మయ స్థితికిని, ప్రస్తుతయుగము నందలి వాఙ్మయస్థితికినిగల తారతమ్యములను బరిశీలించిన యెడల నీ రెండింటికిని నడుమంగల యుగములలో నాంధ్రకవిత్వ మెన్నినానావిధములైన మార్పులను

* క్రీ. శ. 1106 లో రాజ్యాధిపత్యము వహించిన గాంగవాడి దేశాధీశుఁడగు విశలదేవరాయని కీవిష్ణువర్ధనుఁ డనునది క్రొత్తపేరు.

జెందియుండవలయు నని స్ఫురింపఁగలదు. ప్రస్తుతయుగ మనఁగా 19 వ శతాబ్దమునుండియుఁ బ్రారంభమైన నవీనయుగమని నాయభిప్రాయము. ఈ నవయుగములోని వాఙ్మయము పూర్వయుగములలోని వాఙ్మయమునుండి పెక్కువిధముల భేదించుచున్నది. ఆభేద మొకటిరెంటిలో మాత్రమే కాదు. కావ్యరచనోద్దేశములు, కావ్యరచనావిమర్శలు, కావ్యరచనావిధానములు, కావ్యరచనాస్వాతంత్ర్యములు, కావ్యరచనాసంపాదిత వస్తుసామగ్రులు, (Materials) కావ్యకర్తల జీవనోపాధులు, కావ్యకర్తల సంరక్షకులు, కావ్యకర్తల పాండిత్యవిశేషములు, ఇట్లనేక విషయములయం దనేకవిధములైన మార్పులు గానవచ్చుచున్నవి.

పూర్వయుగములలోని కవులు

పూర్వ యుగములలోని కవులెల్లరుఁ బ్రాయికముగా బ్రాహ్మణులే. కవియన నెట్టివాఁడో నిర్వచించిన యప్పకవి కవి కుండవలసిన యోగ్యతలలో బ్రాహ్మణత్వమే మొదటిదిగాఁ జెప్పినసంగతి మన మిదివఱకుఁ జర్చించితిమి. ఇదమిత్థమని నిశ్చయించుటకు వీలులేక యింకను సంశయాస్పదములై యున్న చేమకూర వేంకటకవ్యాదుల విషయములటుండ, రంగనాథుఁడు, కాచవిభుఁడు, నన్నెచోడుఁడు, రాయలు, భట్టుమూర్తి, కంసాలి రుద్రయ్య, మొల్ల, కోటశివరామయ్య (పెదధూర్జటి శిష్యుఁడు), మల్లారెడ్డి, రామరాజు, రంగప్ప, మట్ల అనంతభూపాలుఁడు, బైచరాజు వేంకటనాథుఁడు, ముద్దుపళని మొదలగు బ్రాహ్మణేతరకవులు కొందఱు మాత్రమే పూర్వయుగములలో లెక్కకుఁ గానవచ్చుచున్నారు. ఈనవయుగమునఁ గవితావిద్య యొకరిసొమ్ముగాక వరణీయులగు సకలవర్ణములవారిచేతను నభ్యసింపఁబడుచున్నది. పూర్వయుగములో బ్రాహ్మణేతర కవిత్వమును బ్రాహ్మణు లధిక్షేపించుచుండిరేమోయని యీ క్రిందిపద్యమువలన నూహింపఁదగియున్నది.

క. "చీపర పాపర తీఁగలఁ
జేపలఁబట్టినట్లు చెప్పిన నీయా
కాపుఁగవిత్వపు మాటలు
బాపనకవివరుని చెవికిఁ బ్రమదంబిడునే?"

ఈనవయుగమున బ్రాహ్మణకవిత్వము బ్రాహ్మణేతర కవిత్వమును సమానముగానే ప్రకాశించుచున్నవి. అమాత్యసేనానాయకాద్యున్నతోద్యోగములతోఁ గొంద ఱును కేవల కావ్యరచనోద్యోగముతోడనే కొందఱును బూర్వయుగములలోని కవులు సాధారణముగా రాజాస్థానములనే యంటియుండిరి. అట్టి యున్నతోద్యోగములు లేకపోవుటయే కాక కవితారచనచేఁ గవులు పోషింపఁబడుచుండిన యాస్థానములు ప్రస్తుతయుగమున లెక్కకు మిక్కిలి తక్కువ. వేములవాడ భీమకవి, శ్రీనాథుఁడు, అడిదము సూరకవి మొదలగు కవులయొక్క చరిత్రములవలనఁ బూర్వయుగములలోని కవులు కొందఱు శాపానుగ్రహసమర్థులనియు నాకారణమున రాజులట్టి కవులయెడ భయభక్తులుగలిగి వారినెల్లప్పుడును సత్కరించుచుండిరనియుఁ దెలియుచున్నది. కాని శాపానుగ్రహసమర్థతయొక్కటే కారణము గాదు. సాధారణముగఁ బూర్వపు

రాజులకుఁ గవితాభిమానము సహజగుణము. అందుచేఁ గవులెల్లరునుగూడ సాధారణముగా రాజులచేఁ బోషింపఁబడుచుండిరి.

కవులు - దారిద్ర్యము

మఱియుఁ బూర్వయుగపు లలోని కవులు దరిద్రులనియు నందుచే నానారాజ సందర్శనము లాచరించుచు జీవించుచుండిరనియు వాడుక; కాని వాఙ్మయమున గణింపఁదగిన కవులలో నట్లు దేశాటనమువలన జీవించిన కవులు మిక్కిలి తక్కువయేమో యని చెప్ప వలసి వచ్చుచున్నది. భీమకవి జీవితచరిత్రాంశములు మన కింకను తెలియవు. అవసానదశయం దొకప్పుడు కొన్నికష్టములు సంభవించినట్లు తోఁచుచున్నను, శ్రీనాథునిజీవితముమాత్రము మొత్తముపై సుఖాస్పదమైన దేకాని దారిద్ర్య పీడితము గాదు. రెడ్డిరాజులచే నాతఁడు పోషింపఁబడిన విధమును రాజాస్థానములయం దాతఁడు చెప్పిన పద్యములను బట్టిచూడ, దేశాటన మొనర్చుటయందలి శ్రీనాథుని యభిప్రాయము దిగ్విజయమేకాని యుదరపోషణముగాదని స్ఫురింపఁగలదు. శ్రీనాథుని వలెనే యడిదము సూరకవి సైతమును దన జీవితములోఁ గొంతకాలమును నానారాజ సందర్శనములతోఁ గడపెను. సూరకవి విజయరామ గజపతీంద్రుని యాస్థానకవి. ఆతఁడు సందర్శించిన రాజులు బొబ్బిలిరంగారాయఁడు, పర్లాకిమిడి నారాయణదేవుఁడు మొదలగు వారు. వారిలోఁ గొందఱు విజయరామ గజపతికి శత్రువులు; కొందఱు మిత్రులు. అట్టి రాజుల నీతఁడు సందర్శించుటకుఁ గారణము తన ప్రభువుతో సంబంధించిన రాజకీయ వ్యవహారమేదైనఁ గావలసియుండును గాని కేవలము 'భిక్షాం దేహి' యని యాచించుట గాదని నాయూహ. అదియునుగాక సూరకవి కొంతభూవసతియుం గలవాఁడు. తన కనకాభిషేకమునాఁడు "స్నానముచేసిననీరు పానము సేయ" నని వేలకొలఁది బంగారునాణెములను బరిత్యజించిన మహోదారచిత్తుఁడు. ఆత్మగౌరవమునకై యొక్కొక్కప్పుడు తన ప్రభువునుసైతమును నిర్లక్ష్యభావమునఁ జూచుచుండువాఁడు. అట్టి సూరకవి నట్టిదరిద్రుఁడనియుఁ బొట్టకూటికొఱకే రాజుల సందర్శించుచుండెననియుఁ జెప్పుట న్యాయముగాదు.

నవీనయుగకవులు - కావ్యరచన

ఇంక నీనవయుగములోని కవులన్నచో శాపానుగ్రహసమర్థులని చెప్పుటకు నిదర్శనములులేవు. కవితాభిమానులై, వచ్చినకవులను సత్కరించురాజులును మిక్కిలితక్కువ. అందుచే గవులదేశాటనములు నానారాజ సందర్శనములు నీయుగమున నంతగాఁ గానరావు. కొందఱుకవులు స్వతంత్రకావ్యరచన యొనర్చినను బూర్వకవులు సాధారణముగాఁ బ్రభువులనుమెప్పించు కావ్యరచన గావించుచుండిరి. ప్రస్తుతకవులలోఁ బ్రజలను మెప్పించు కావ్యరచన గావింపవలసిన వారగుచున్నారు. ప్రభువు తనయాస్థానమున విద్వజ్జనముల మధ్య నొకానొక కావ్యమును సాంతముగా విని, తత్కృతిపతిత్వ మంగీకరించిన పిమ్మట నయ్యది సుప్రసిద్ధకావ్యముగా నెన్నఁబడుచుఁ గ్రమక్రమముగఁ బ్రచారములోనికి వచ్చు

చుండెను. కాని ముద్రణాది సాధనములు లేని యాకాలములో నెంతటిసుప్రసిద్ధగ్రంథమైనను బ్రస్తుతయుగమునందువలె నంతశీఘ్రముగా దేశమున వ్యాపించుట కవకాశములు చాలకుండెను. భారతరామాయణాది మహాగ్రంథముల సైతము నెవరి ప్రతులను వారు వ్రాసికొనవలసినవా రగుచుండిరి. కాని మన కిప్పుడట్టి చిక్కులు లేవు. అట్టి చిక్కులే కాక యెట్టి చిక్కులును లేవు. ప్రభుమతము ననుసరించి యాతని మెప్పువడయు కావ్యరచన గావింపవలసిన నిబంధనమూ లేదు. రచించిన కావ్యము రంగారోహణమున విద్వజ్జనామోదమును బొందవలయు నగత్య మంతకన్నను లేదు. సాధారణముగఁ బ్రస్తుతకావ్యకర్తలు మంచిచేసికొని యాశ్రయింపవలసిన వా రిరువురుమాత్రమే: వ్రాసినగ్రంథమును నుచితముగాఁగాని తక్కువధరకుఁగాని యచ్చువేసి యిచ్చుట కొకముద్రాయంత్రాధికారి (Printer); ముద్రించినగ్రంథమును బఠనీయగ్రంథముగా నేర్పరచుట కొక పఠనీయగ్రంథనిర్ణయ సభాసభ్యుఁడు (member of the text book committee) ప్రభుసమాదరణములేని యీదినములలో నియ్యిరువురి సాహాయ్యముచేతనే కావ్యకర్తలు కాలక్షేపము చేయవలసినవా రగుచున్నారు. ఇట్లని యీనవయుగాంధ్రకావ్యకర్తలకుఁ గావ్యరచనమున విద్వజ్జనామోద మవసరములేదని నాయభిప్రాయము గాదు. ముద్రితగ్రంథములయందలి యుపోద్ఘాతములలో "మిత్రుల ప్రోత్సాహమువలన నేనీగ్రంథము నింతత్వరగా ముద్రింపవలసి వచ్చిన"దనియు, "కావున విద్వజ్జను లిందలి దోషము లెఱింగించినయెడ రెండవకూర్పునందు దిద్దుకొనెద" ననియు గ్రంథకర్తల విన్నపములు మనము తఱచుగాఁ జూచుచుండుటచేత నట్లు భావించుటకు వీలులేదు.

మఱియొకవిధముగా మనము పరిశీలించిన యెడఁ బూర్వయుగములలోని కవులకంటె నీ నవయుగాంధ్రకవులకుఁ గావ్యరచనయం దెక్కుడు నిరుత్సాహము, కష్టము, మానసికాందోళనము, భయము గలుగుచుండునని చెప్పవలసి వచ్చుచున్నది. సంస్కృతమునుండి యాంధ్రీకృతములుగాక శేషించినకావ్యములో, లేక తమ ప్రభువులు ప్రత్యేకముగాఁ దమకు రచింప నియోగించిన కావ్యములో, పురాణమనికాని, ప్రబంధమనికాని, ద్వ్యర్థికావ్యమనికాని పూర్వకవులు తమతమ యుగములనాఁటి రచనాసాంప్రదాయముల ననుసరించి నిశ్శంకగా రచించుచుండిరి. ఈనవయుగమునఁ గవులకావ్యరచన కట్టి రాజమార్గ మొకటి యేర్పడియుండలేదు. పూర్వసాంప్రదాయము పూర్తిగఁ బోవకుండుటయు, నాంగ్లభాషా సహవాసంబున నూతనసాంప్రదాయ మొకటి బయలుదేరుటయుఁ దటస్థించుటచేత నీసాంప్రదాయ ద్వంద్వము రోగులను వైద్యద్వంద్వమువలెఁ గవుల నెంతయు బాధించుచున్నది. అందుచే రచనోత్సాహముగల కవి, కావ్యనిర్మాణమునకుఁ గడంగుటకు ముందుగ నీరెండుసాంప్రదాయములలో నెద్దాని ననుసరింపవలయునో యని కొంత మానసికాందోళనము

నొందుచుండును. ఒకపురాణమో, ప్రబంధమో, లేక, నాటకమో, ప్రహసనమో, నవలయో, ఎయ్యది రచించినయెడల నెక్కుడుగఁ బ్రజ లామోదింతురో, ఎట్టిరచన మెచ్చినఁ బఠనీయగ్రంథముగా నిర్ణయింపఁబడునో యని రాజాదరణములేక కేవలము ప్రజాదరణముపైనే బ్రదుకుచుండిన యీ నవయుగాంధ్రకవి వితర్కించుట యొక వింతగాదు.

సామాన్యకవులు - వారికావ్యములు

ఇది యిట్లుండ సీనవలలు, నాటకములు, ప్రహసనములు, గావ్యములుగాఁ బరిగణింపఁబడునా యనియు వానిని రచించినవారును గవులనఁబడుదురాయనియుఁ గొందఱు పరిహసింతురు. గీర్వాణకవులెల్లరును గాళిదాసులుకారు. ఆంగ్లేయకవులెల్లరును షేక్స్పియరులుకారు. అట్లే యాంధ్రకవులెల్లరును నన్నపార్యులు కాఁజాలరు. ఏభాషయందలి కవిత్వచరిత్రమును మనము పరిశీలించినను సాధారణముగ నొక్కొక్క యుగమునం దొక్కొక్క మహాకవి కవులకెల్లరకును మార్గదర్శియై ప్రబలుచుండును. ఆయాయుగములయందలి తదితర సామాన్యకవులను వారి కావ్యములను గవులనియుఁ గావ్యములనియు గణింపకున్నయెడల, నింక మహాకవులనియు మహాకావ్యములనియు నిర్ణయింపవలసిన యవసరమే యుండదు. అందుచే సామాన్యకవులును సామాన్యకావ్యములును మహాకవులకును మహాకావ్యములకును గీర్తిసాధనములగుకతన, మనకవిత్వచరిత్రమునం దట్టికవులను గావ్యములను గూడఁ బ్రసంగించుట యవసరమని నావిన్నపము.

* వర్షాగమము

పింజమూరి రంగాచార్యులు గారు, ఎం. ఏ., బి. యల్.

జలబిందువులతోడి జలధరంబుల గుంపు, పొగఁగొందు మదపుటేనుఁగులు గాఁగ
ఢళుఢళుక్కున నింగిఁ దాటించు మెఱపులు, రమణీయమైన టెక్కెములు గాఁగ
అవని గ్రక్కదలెడు నశని ఘోషంబులు, తోరంపు విజయదుందుభులు గాఁగ
చెలువొందు తొలకరి చిటుపొటచినుకులు, నాచార లాజ చయంబు గాఁగ
రమ్యకాంతులతో మహారాజువలెను, వచ్చెఁ బ్రియురాల! చూడు మిప్పట్టునందు
కామిజనముల పాలిటి నోముపంట, అతులరమ్యంబు నూత్నవర్షాగమంబు. ౧

గీ. వల్లకల్వల కాంతి నందముగఁ గొన్ని, కరము నున్నకాటుకవోలె మెఱసికొన్ని,
నిండుచూలాలి గుబ్బపాలిండ్ల మిసిమిఁ గొన్ని, యాకాశమెల్ల మొగుళ్లగములె!. ౨

* ఆంధ్రఋతుసంహారమునుండి.

గీ. కొసరు చాతకపక్షుల కోర్కెపంట, లధికవర్ణనములు మనోజ్ఞారవములు
తోయభారావనతములైన తోయదములు, మింటఁ జరియించుచుండెడి మెల్లమెల్ల. ౩

చ. పిడుగుల మార్దలధ్వనులు పిక్కటిలన్ పలుదిక్కులందుఁ జం
చలలను వారిగాఁ గలుగు శక్రధనుష్మద వర్షధారలన్
బలితపు టంపకోలలను బాగుగఁ గూర్చి వియోగి మండలిన్
గలఁచి యలంచు నిర్భయులఁ గంధరముల్ ధృతిమంథరమ్ములై. ౪

చ. వలిగిన యబ్జిదూరజము నాడెముఁ జూపెడి గడ్డిమొల్కలన్
దలమగు కందళీదళవితానపు రంగుల నింద్రగోపక
మ్ములను పికేతరాచ్ఛమణి భూషణభూషితదేహవల్లియై
లలన వలెం జెలంగెడి నిలాతల మబ్దసమాగమంబునన్. ౫

ఆ. నెమలిగమి మనోజ్ఞనిస్వనంబుల తోడ, మమతఁ జేయు చుంబనముల తోడ
పరవశంబులైన పరిరంభణములతోఁ, బురులు విప్పి యాడ మొదలుకొనియె. ౬

చ. పొలయు ప్రవాహవేగమున క్రుంగ్గతిలంబడఁ బార్శ్వవృక్షముల్
కలుష జలప్రపూరితములై రసముబ్బఁగ జాతవిభ్రమం
బులయి మహారయంబునను బోవుచు నుండు సముద్రగాములై
ఖలమునఁ గాంతుఁజేరు నభిసారిక లట్లు నదీచయం బిటన్. ౭

తే. హరిణశాబంబు లించుక గొఱికి విడువ, మిలమిలల నాడు పచ్చిక మొలకలొప్పఁ
జివురులను పౌరు గాలిపెడి చెట్లకండ, మురుని వైంధ్యవనములు చేతము హరించు. ౮

తే. ఊరుములను మెఱుపుల లేళ్లు కరము బెదరి, యింతులకు కన్నులను లోలదృష్టు లొప్ప
నిసుక నెలవు లవని నెల్ల రాయడులఁ జెదరి, చూచువారల హృదయముల్ చూఱగొల్పు. ౯

తే. కాఱుగ్రమ్మిన ఘనఘనాఘనము లేచి, యంధకారమ్ము లెల్లెడ నలమికొనిన
మెఱయు మెఱుపులచే మార్గ మెఱిఁగికొనుచు, కేళి ప్రియులకై యభిసారి కాళి తిరుగు. ౧౦

ఆ. ఊరుము నంబుదములు మెఱపెడి మెఱుపులు, తారజాలమట్టి తమినిగూర్ప
దెప్ప చేసియున్న ధవుల మిగిగొఁగి, వింత రోలమార్తు రింతు లిపుడు. ౧౧

తే. కమలఁ దోరఁగాడి కన్నీటికాల్వ పల్లవముల హసియించు బింబాధరములఁ దరుపఁ
బూతలును భూషణంబులుఁ బూలు మాని, ప్రోషితాంగనలు నిరాశఁ బొగులుచుంద్రు. ౧౨

తే. పురువులు రజంబు తృణములు వెరసి పాండు,రంబుగాఁ బాము వోలె వక్రగతిఁ బాతి
బెదరు కప్పల హృదయముల్ కదుటఁబడఁగఁ, బోవు క్రొన్నీరు నిమ్నాభిముఖము గాఁగ. ౧౩

తే. శేష లెడిలిన తామర ప్రోక విడిచి, జుమ్మనుచు మ్రోయు తుమ్మెదద్రిమ్మరీ ద్రుమ
ఆడెడు నెమిళ్ల గమి పెంచి యంపురగముల, వ్రాలుఁ కెంగల్వవిరులను భ్రాంతితోడ. ౧౪

చ. మదగజయూథ మట్టెడ సమంచవభాంబుద నిస్వనంబులన్
మద మడరం జెలంగి పలుమాఱును ఘీంకృతులం బొనర్చుచున్
బొదలు నవోత్పలప్రభల పొల్పును దెల్పఁగ పాలపాళిఁ దు
మ్మెదగమి మూఁగ దానజలమేదురకర్ణగడు నింపునింపెడున్. ౧౫

తే. పాదల సితోత్పలాభ్రాత్ర చయము వ్రేల, నెల్లెడల వెల్లిగొని పెలరేఁగ్లఁ జాలు
నెమలి తండంబు చెలరేఁగి నృత్యమాడఁ, బర్వతము లొప్పెఁ గన్నుల పండువుగను. ౧౬

సీ. అతులకదంబసర్జార్జునకేతకీ, సాలశాఖికల నుయ్యాల లూఁగి
ఘుమ్ముఘుమ్మని తావిఁ గ్రుమ్మరింపఁగఁ జాలు, కుసుమవాసన లెల్లఁ గొల్లలాడి

కాదంబినీ మాలికాశీక రాంబువుల్, తమవు సోఁకఁగ జల్లఁదనము గాంచి
పాలయు నుత్తరవారిపోతముల్ మెల్లఁగా, వీచు చల్లను పల్లవింపఁజేయ,
పిఱుఁదు లంబెడు కురులతోఁ, దుఱుముపిరుల-తావితో, సీధుగంధ వక్త్రముల తోడ,
బిగువుఁ జాలిండ్ల వటియించు పేర్లతోడ, వెలఁదు లందురు పొంగు లుర్విఁ లూర. ౧౭

తే. ఇంద్రధనువులు చంచల లింపారన్, తోయభారావనతములైన తోయదములు
అమరు మెలనూళ్ల మణికుండలముల మెఱయు, రమణులను బాంథజనుల చేతము హరింత్రు. ౧౮

తే. కేసరములు కదంబముల్ గేదఁగులును, విరిసరులఁ గూర్చి శిరములఁ దుఱుముకొనుచు
కకుభకుసుమమంజరులు తమ కర్ణపాళిఁ, దొడవులుగ నిచ్చదీర నింతులు ధరింత్రు. ౧౯

తే. అగురు కలిపిన చందనం బలఁది మేన, పూవుఁదొడవుల తలకట్టు తావులీన
సబ్బహూవ విని గురుగృహంబు విడిచి, పడకటిలు చేరుచున్నారు పడఁతు లిపుడు. ౨౦

మ. జలభారానమితమ్ములై కువల యశ్యామంబులై యున్నతం
బులునై శక్రధనుర్విభూషితములై వ్యూహంబులై మందమం
దలసచ్ఛీతల వాయు చంచలములై సవ్యాబ్దముల్ మన్మథా
విలకాంతా హృదయాపహారు లగుచున్ వెల్గొందు నందమ్ముగన్. ౨౧

శా. పూవుల్ పూచి కదంబవృక్షములు సమ్మోదమ్ము సూచింపఁగా
ప్రావృణ్మత్త చాలితంబగు తరవ్రాతంబుచే నాడుచున్
దావుల్ క్రేవలఁ జల్లు గేదఁగుల చిర్నవ్వుల్ విసాళింప నా
హా! వర్షర్తు వనాంతశోభ లివె సౌఖ్యానందముల్ జాబెడున్. ౨౨

తే. మాలతులతోడి పొగడల మాలఁ దుఱిమి, అడవి మొల్ల మొగ్గల నిచ్చి నట్టి కడిమి
పూలఁ గర్ణపూరంబులు పొసఁగఁజేసి, కాంతలుఁ గాంతుపలె వర్షకాలమొప్ప. ౨౩

చ. కులుకుమిటారి గబ్బి చనుగుబ్బల ముత్తెపుఁ బేరులొప్ప, నిం
పులు దులకించు పీనకటిభూముల దువ్వలువల్ రహింపఁగా
లలితవళీవిభంగ తరళంబులు మధ్యము లంబునేచనన్
బులకల మొల్క లందనరఁ బొల్తురు పొల్తుక లియ్యెడన్ గడున్. ౨౪

ఉ. చల్లని నీటిబిందువుల సంగతిఁ జల్లఁదనంబు దాల్చి, సం
ఫుల్లసుమావతంబులగు భూరుహకాండములన్ గదల్చుచున్
మల్లడిగొన్న పుష్పాడి దుమారము తావులు కొల్లలాడి, సేఁ
దెల్లెడఁ బిల్లగాడ్పులు హరించెడుఁ బ్రోషితచిత్తవృత్తముల్. ౨౫

ఉ. తోయ భరావతంబులుగఁ దూఁగుచునుండినవేళ నాశ్రయం
బై యలరెం గదా మనకు; నాఁడు గ్రీష్మదవానలంబుచేఁ
గాయము మాడి తూల జలకం బిడ యుక్త మటంచు నెంచి సౌ
ఖ్యాయత లీలఁ జాలఁ జెలువారెడి వింధ్యముపై నవాబ్దముల్. ౨౬

చ. అతుల గుణాభిరామము, సుమాంగుల చిత్తసరోజహారి, శ్రీ
జిత తరువల్లికావళికి నెయ్య ప్రబంధువు, సర్వజంతు సం
తతికిని ప్రాణభూతము, నితాంత మనోహర ప్రావృడాగమం
బరులగతిన్ హితంబులను బాళియముల్ ఫలియింపఁజేయుతన్. ౨౭

అక్కరలు

గిడుగు వెంకటసీతాపతి గారు

II

సూర్య:—క్రిందటిసారి మనము విమర్శించిన దానినిబట్టి వజ్ఝల చినసీతారామస్వామిశాస్త్రిలవారు నన్నయ మధ్యాక్కరలకు చెప్పిన లక్షణమందు అతివ్యాప్తి దోషము ఎట్లు దొర్లినదో స్పష్టమైనది. ఏపద్యము చూచినా అందులో అక్కరలకు వారుచెప్పిన గణములు వరుసగా కనబడుతూ ఉన్నవి. కనుక, వారు చెప్పిన లక్షణము అంగీకరించుటకు వీలులేదు. ఇకను తక్కిన విషయములు పరిశీలింతాము.

నేను:—అనంతుని ఛందోదర్పణమునకు నేనువ్రాసిన ఉపోద్ఘాతమందలి వాక్యములు కొన్ని వారు విమర్శించి ఆక్షేపించినారు. వాటికి నేను చెప్పే సమాధానము విందురుగాని. విజయనగరం మహారాజా వారికాలేజీ మ్యాగజీనులో 80 వ పుటయందు వారు నాఅభిప్రాయములను విమర్శిస్తూ వ్రాసిన వాక్యములను గురుతుపెట్టినాను. ఇదుగో, చదవండి.

సూర్య:—చదువుతున్నాను; వినండి:—"నన్నయాక్కరలలో లాక్షణికులు చెప్పిన గణములసంఖ్య సరిపడును గాని గణముల వరుస సరిపడదని వ్రాయుచున్నారు."

నేను:—ఆగండి. ఈవాక్యము నే నెక్కడా వ్రాయనేలేదు. తర్వాత చదవండి.

సూర్య:—"అట్లే యీ మధ్యాక్కరలలోఁగూడా కవికి స్వాతంత్ర్య ముండె నేమో?"

నేను: ఆగండి 'అట్లే' అంటే ఏమో మీకర్థమైనదా? కాలేదు. చూచినారా? ఇంత అసందర్భముగా నేను వ్రాసిఉందునా? నేనువ్రాసినదేదో సరిగా ఎత్తివ్రాయక నేనువ్రాయని వాక్యము వ్రాసినట్లుగా (") అనేగుర్తులు కూడా పెట్టిచూపించుటచేత ఇక్కడ అర్థము పొందినదికాదు. తర్వాతి వాక్యములు చదవండి.

సూర్య:—"నన్నయ పాటించిన యతిస్థలమునకుఁ బూర్వము రెండు ఇంద్రగణములు నొక సూర్యగణము మఱియొక యింద్రగణము ఉండవలెనని గదా అనుకొంటున్నాము. ఆసూర్యగణము మూఁడవచోటనే కాక మఱియొక స్థలమందైనా వుండవచ్చునని నన్నయయభిప్రాయమేమో చూడండి అనియు నిట్లు వ్రాసివారివద్దనున్న యొకానొక యముద్రితప్రతినుండి స్వమతోపయోగములగు కొన్నియక్కరల చరణములను వెదకితీసి యుదాహరించినారు." వీరు అరసున్నలు శకటరేఫములు వాడినారే.

నేను:—నేను వ్రాసినవాక్యములు సరిగా ఎత్తివ్రాయక నేను పాటించని అరసున్నలు, శకటరేఫములు, ఆదేశములు ఉంచి శాస్త్రిలవారు నాభాష కొంత సంస్కరించినారు. దానికేమి. మనము విమర్శించవలసిన విషయము వేరు.

గణములవరుసను గురించి లాక్షణికు లందరూ చెప్పిన సామాన్యలక్షణము నే నంగీకరించకపోలేదు. గణముల గురించిన్ని గణములవరుస గురించిన్ని లాక్షణికు లందరూ చెప్పిన సామాన్యలక్షణమునకు, సరిపడిన చరణములు నన్నయ మధ్యాక్కరలలో అనేకముగా ఉన్నవి. వాటిగురించి తగవే లేదు. ఆసామాన్యలక్షణమునకు లొంగని చరణముల గురించే, ఇప్పుడింతగా వాదప్రతివాదములు జరగవలసి వచ్చినది. పూర్వ లాక్షణిక మతమునకు విరుద్ధముగా ఉన్న పాఠములు చాలా వ్రాతప్రతులలో కనబడుతూ ఉన్నప్పుడు, అవి నన్నయభాషకు విరుద్ధము కావని మనకు తోచినయెడల వాటికి లక్షణాం

తరకల్పన చేయవలసి ఉంటుంది. కనుక, నేను చెప్పిన దేమంటే, మహాక్కరలో పాదాదినుండవలసిన సూర్య గణము రెండవగణముగా నైనా నాలవగణముగా నైనా ఉండవచ్చునన్న వికల్పము కలదుగదా; అట్లే ఈమధ్యాక్కరలో కూడా కవికి స్వాతంత్ర్య ముండెనేమో. ఇదీ నేను వ్రాసినది. అయితే, ఇప్పుడు సీతారామస్వామి శాస్త్రిలవారు చూపించిన వాక్యములను బట్టి యథేష్టముగా ఉండవచ్చునని నేను చెప్పిన విశేషలక్షణమే సామాన్యలక్షణముగా నేను గ్రహించినట్లు చదివేవారికి అర్థమవుతున్నది.

నావద్దనున్న అచ్చుప్రతినుండి స్వమతోపయోగములగు కొన్నియక్కరల చరణములను వెదకి తీసి యుదాహరించినానని శాస్త్రిలవారు వ్రాసినారు! నేను చూచిననాలుగైదువ్రాతప్రతులలోను, అచ్చుపడ్డప్రతుల యందు కొన్నిటిలోను, ఆపాఠములు కనిపించుచుండుట చేత అవి నన్నయపాఠములే అయిఉండుననుట తప్పు కాదని నేను స్పష్టముగా వ్రాసిఉన్నానుగదా; శాస్త్రిల వారు ఈ వాక్యములు సరిగాచూడలేదో! చూచినా, నామాటలయందు విశ్వాసములేక నావద్దను తాటాకు ప్రతులు ఉండవని తలచినారో!

ఈ 80 వ పుటలోనే శాస్త్రిలవారుచేసిన ఆక్షేపణము మరియొకటున్నది. ఇంతాక చదివినదానికి ఆవల నున్న పేరాలో గుర్తుపెట్టినవాక్యములు చదవండి.

సూర్య:—"ముద్రణకర్త లప్పకవీయమునుబట్టి సవరించు తలంపుగలవారైయునను వీరి కుపచరించిన యీయాయలం స్థలములలో ప్రమాదవశమున గిడలిపడి సవరణము లను జేయుటలోఁ బొరపడి యుందురని నానమ్మకము. అట్టివానినే ప్రమాణముగాఁజేసికొని లక్షణాంతరకల్పనము చేయఁగడంగుట సాహసమని నా యభిప్రాయము".

నేను:— ఆగండి; ఇందులో సాహసముచూపినవారు ఎవరో మీకే స్పష్టమవుతుంది. అచ్చుప్రతిలోనే కాక, నేను చూచిన నాలుగైదు వ్రాతప్రతులలోను కూడా ఆపాఠములు నాకు కనబడినవని నేను స్పష్టముగా వ్రాసిఉండగా, వీటిని తాము గ్రహించుటకు ఇష్టపడక, సీతారామస్వామిశాస్త్రిలవారు ఎట్లు ఊహించినారో చూచినారా? అప్పకవీయమునుబట్టి సవరించు తలంపుగలవారైన, ముద్రణకర్తలు అప్పక వీయమందలి లక్షణమునకు విరుద్ధముగా దిద్ది సవరించి ఉండరుగదా! అయితే, ఈపాఠములెందుండి వచ్చినవి? వ్రాతప్రతులనుండి వచ్చినవే కావలెను. అవిదిద్దుటకు వీలులేక పోవుటచేత వాటిని దిద్దకుండా ముద్రణకర్తలు అచ్చువేయించి ఉండవలెను; లేదా, దిద్దుటకు వీలు పడినా, అవి తాము గ్రహించిన లక్షణమునకు సరిగా ఉన్నదీ లేనిదీ చూచుకోకుండా ప్రమత్తులయి వ్రాత ప్రతులలోని పాఠములు అచ్చువేయించి ఉండవలెను. ఏదెట్లయినా, ఆపాఠములు కొన్నివ్రాతప్రతులలో ఉన్నవి; నేను చూచినాను. అవి నన్నయ వాగ్వ్యవహారమునకు విరుద్ధముగా లేవని మనకు తోచినప్పుడు వాటిని సప్రమాణముగా గ్రహించి వాటికి లక్షణము కల్పించడమే సాహసమో, ఎవరూచెప్పని గణములు సూర్యేంద్రచంద్రగణములుగా గ్రహించి, ఏవనవము నకైనా సరిపడుతూఉన్న గణలక్షణము నన్నయ మధ్యాక్కర పాదములకు సరిపడినవని చెప్పడమే సాహసమో మీరే ఆలోచించి చెప్పండి. ఇకను, తర్వాతి వాక్యము చదవండి.

సూర్య:—"మఱియు మీరు స్వపక్షోపయోగము లనుకొన్న యీచరణము లితర తాళపత్రగ్రంథములలోను, నితర ముద్రణములలోను మీరుదహరించిన రీతినుండక యప్పకవీయాది ప్రసిద్ధలక్షణమునకే లొంగి యున్నవి."

నేను:—అటువంటి పాఠములు దొరికినయెడల నాకు చాలా సంతోషమే. పూర్వులు గ్రహించిన లక్షణమునకున్ను నన్నయ వాగ్వ్యవహారమునకున్ను అనుగుణమైన పాఠములు కనబడినప్పుడు ఇంక కావలసిన దేమి? అప్పుడు నేను చెప్పిన విశేషలక్షణము పరిత్యజించవలసినదే; సీతారామస్వామిశాస్త్రిలవారుకూడా తాము అనవసరముగాను, నిరాధారముగాను తెచ్చిపెట్టిన గణలక్షణము విడిచిపెట్టకోవలసినదే. అప్పకవ్యాదిలాక్షణికులు చెప్పిన లక్షణమే సరియైనలక్షణమని అంగీకరించవలసినదేకదా! అయితే, మనదురదృష్టముచేత, పూర్వలాక్షణికులు

చెప్పినలక్షణమునకు అనుగుణముగా నన్నయమధ్యాక్కరల చరణములన్నిటికీ సరియైనపాఠములు వ్రాతప్రతులలోగాని అచ్చుప్రతులలోగాని నాకిదివరకు దొరకలేదు. ఇకను దానితర్వాత నేను గుర్తుపెట్టిన వాక్యము చదవండి.

సూర్య:—"అట్లు సవరించుటకును గొన్నియెడల వీలు పడనందున నవి తాముచూపిన లక్షణమునకుఁ గుదుర లేదనికూడ నంగీకరించియున్నారు."

నేను:—రామ! రామ! నే నేదీ తీరికూర్చుండి సవరించలేదండీ. అసలి శాస్త్రులవారేకాని నేను తలపెట్టుకో లేదండీ. నేనంగీకరించి ఇచ్చినపాఠములు వ్రాతప్రతులలో నాకు కనబడినవి. లాక్షణికులుచెప్పిన సామాన్యలక్షణమునకు గాని, నేను చెప్పిన విశేషలక్షణమునకుగాని సరిపడిన పాఠములు కనబడుతూ ఉండగా లక్షణ సమన్వయముకాని పాఠము లున్నవని నే నెట్లు అంగీకరించి ఉందును?

సూర్య:—"సంగరకులహానికరుఁ డయిధారుణీనాథ నీ సుతుండు" అని ఉన్నదిగదా; ఇది ఎట్లు మీరుచెప్పిన లక్షణమునకుగాని, సామాన్యలక్షణమునకుగాని లొంగిఉన్నది?

నేను:— దీనిగురించి ఛందోదర్పణోపోద్ఘాతమందు నేను వ్రాయకపోలేదు. 'కరుఁడై' అని కొన్ని వ్రాతప్రతులలో ఉన్నది. అప్పుడు కన్నడ లక్షణమును అనుసరించి, అది సూర్యగణ మవుతుంది. నన్నయ కన్నడ లక్షణమును అనుకరించి ఉండుట అసంభవముకాదు. కనుక, ఈపాదమునకు ఈవిధముగా లక్షణముకుదురి ఉన్నదని వ్రాసినాను.

సూర్య:—అయితే, పాదాన కొక్కొక్క లక్షణము చెప్పినయెడల వ్యవస్థ ఏదీ?

నేను:—వేరువేరుగా విషయ విమర్శనముచేసినాము, గనుక, వివిధలక్షణములును నేను చెప్పినట్లు కనబడుతూఉన్నది.

సూర్య:—అయితే, మీరు చెప్పదలచినదంతా పొందుపరచి నన్నయ మధ్యాక్కరలకు మీరు నిరూపించిన లక్షణము స్పష్టముగా తెలియజేయండి.

నేను:—నన్నయమధ్యాక్కరలలో ప్రతిచరణమందున్న రెండింద్రగణములు, ఒకసూర్యగణము రెండింద్రగణములు ఒకసూర్యగణము ఉంటవి. మూడవగణముగా ఉండవలసిన సూర్యగణము రెండవగణముగానైనా నాల్గవగణముగానైనా ఉండవచ్చును. సూర్యగణములు కన్నడమర్యాదననుసరించి హగణ నగణ సగణ గగములు. మధ్యాక్కరలలోవచ్చే ఇంద్రగణములుమాత్రము తెలుగులాక్షణికులందరూ అంగీకరించిన నల, నగ, సల, భ, ర, తలే కాని మగణ సగములు కావు. (కన్నడదొరె అక్కరలో 6 మాత్రలు గల ఈమగణ, సగములు రావు). యతిస్థలము నాలుగు గణములయిన తర్వాత. ప్రాసనియమము వృత్తము లందున్నట్లే.

ఈలక్షణమునకు సరిపడిఉన్న నన్నయ మధ్యాక్కరచరణములు వ్రాతప్రతులలో నాకు కనబడినవి. కనబడలేదని ఒక్కచరణము గురించి అయినా నేను వ్రాసి ఉండలేదు.

'పదుగురుఁ' పదుంద్రుఁడు పాఠాంతరముగా కొందరు ఇచ్చినవారని వ్రాసినాను గాని, అది నేను దిద్ది సవరించినానని వ్రాయలేదు. అది కొన్ని వ్రాత ప్రతులలో కూడా ఉన్నది. "పాళేముల్" అనేపాఠము కూడా కొన్ని వ్రాతప్రతులలో ఉన్నదేకాని నేను దిద్ది సవరించిన పాఠముకాదు.

సూర్య:—"పదుంద్రు" అనేపాఠము మీ రంగీకరించక పోవుటకు కారణమేమి?

నేను:—ప్రబలమైన కారణములు ఉన్నవి. ఆగణమునకు తెలుగు జాతులలోగాని కన్నడ పద్యాలలోగాని ప్రవేశములేదు. ఇటువంటివే వగణ యగణములున్నూ. వీటిలో లఘువుతర్వాత గురువు వచ్చుటచేత ఈగణములనడక విలోమముగా ఉంటుంది. దీనినిగురించి కిట్టెలు దొరగారు వ్రాసినది చూడండి: "Observe that none of the feet under No. 273 (అనగా బ్రహ్మవిష్ణు రుద్రగణ ప్రస్తారము) begins with an Iambus (14) such a foot being foreign to true Canarese mitras" (పుట 98 నాగవర్మ ఛందస్సు)

లక్ష్యములలో పాఠభేదములున్నప్పుడు. లక్షణము నిరూపించడము కష్టము, గనుక, నన్నయ వాగ్వ్యవహారమునకు విరుద్ధముగా లేవని మనకుతోచినపాఠములే ఎదుటనుంచుకోవలెను. సాధ్యమైనంతవరకు పూర్వలాక్షణిక మతమునకు అనుగుణముగా ఉండే సంభావ్య లక్షణము ఏది సరిపోవునో చూచుకోవలెను.

సూర్య:—సంభావ్యలక్షణమేదో ఏలాగు తెలుసుకోగలము? పూర్వలాక్షణికులు మధ్యాక్కరకు చెప్పిన లక్షణమునకు భిన్నముగా రెండువిషయములు చెప్పినారు. అవి సంభావ్యములేనా?

నేను:—అక్కరలు కన్నడమువారివద్దనుండి మన తెలుగువారు తెచ్చిఉండడమే నిజమైనప్పుడు, గణముల విషయములో సైతము, కన్నడలక్షణమును నన్నయ అనుకరించిఉండడము అసంభవము కాదుగదా? మహాక్కరలో మొదటనుండవలసిన సూర్యగణము రెండవ గణముగానైనా, నాల్గవగణముగానైనా ఉండుటకు అవకాశమున్నట్లే, మధ్యాక్కరలోకూడా మూడవ గణముగా ఉండవలసిన సూర్యగణము రెండవగణముగానో నాల్గవగణముగానో ఉండుటకు అవకాశముండడము అసంభవము కాదుగదా?

సూర్య:—అసంభవము కాదు. మీరుచెప్పిన లక్షణము సంభావ్యమైనదే. అయితే, కన్నడలక్షణమును అనుసరించి సూర్యగణములు సగణ నగణములు కూడా కావచ్చునని అంగీకరిస్తేనేకాని లక్షణసమన్వితములు కాని పాదములు ఎన్నికనబడినవి?

నేను:—ఒక్కటే "సంకరుకులహానికరుఁడై ధారుణీనాథ నీసుతుఁడు" అనే పాదము మాత్రమే.

సూర్య:—ఈ ఒక్కపాదముకోసము ఈకన్నడలక్షణము తెచ్చిపెట్టవలెనా? "సంకరుకులహాని కరుఁడు ధారుణీనాథనీసుతుఁడు" అనేపాఠము ఒకఅచ్చుప్రతిలో ఉన్నదట. ఈ పాఠము చక్కగా ఉన్నదే కదా?

నేను:—చక్కని పాఠమే. అనందముద్రణములో లేదు, గాని వావిళ్లవారి ముద్రణమందున్నది. వ్రాతప్రతులలో నాకిదివరకు కనబడలేదు; కనబడితే సంతోషింతును. లక్షణమునకు సరిపెట్టవలెనన్న ఉద్దేశముతో దిద్దినారంటే నే నంగీకరించలేను. అందుచేతనే వ్రాతప్రతులు ఇంకా చాలా చూస్తేనేకాని ఇదమిత్థం అని చెప్పలేకున్నాను. యథాస్థితి తెలుసుకోగోరే వారుచేయవలసిన పని ఇదేకదా! అయితే శాస్త్రిలవారు ఈవిషయము గురించి వ్రాసినది చూడండి. "'ఇదమిత్థమని చెప్పలేము' అని వ్రాసియున్నారు; కాన వారుచెప్పిన లక్షణము సరికాదని వేఱుగచెప్ప నక్కరలేదు" ఇట్లు శాస్త్రిలవారు వ్రాయుటకు న్యాయమేనా?

సూర్య:—బాగున్నది! శాస్త్రిలవారే తమ వ్యాసమందు మొట్టమొదటి పేరాలో రెండవవాక్యము "ప్రాచీన మధ్యాక్కరల లక్షణ మిదమిత్థమ్మని నిర్ణయించుటకు వలను పడకున్నది" అని వ్రాసినారు. కాన, వారు చేసిన సిద్ధాంతము సరికాదని మనమూ అనవచ్చును.

నేను:—దానికేమి; వారుచేసిన ఆక్షేపణములలో విచిత్రమైనదొకటి చూడండి. ముద్రణప్రమాదముల నాధారముగా తీసుకొని నేను వారినీ జయంతి రామయ్య పంతులుగారినీ నిరసించినానట! శాస్త్రిలవారు ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రికలో "శాసనగ్రహీత గణములను ప్రస్తారమునఁ జూపెదను" అనివ్రాసి దానిక్రిందను ఇనగణములేవో ఇంద్రగణములేవో వరుసగా చూపించినారు. అందులో '|U||' కనబడలేదు. ఈ విషయము నాఛందోదర్పణోపోద్ఘాతమందు విమర్శిస్తూ (పుట అడుగున చూడండి) "వారి మతమున '|U||' కూడా ఇంద్రగణములలో ఉండవలెను. పు. 88 లో ఉన్న ప్రస్తారపట్టికలో లేదు. వ్రాయ మరచినారో, అచ్చుతప్పో;" అనివ్రాసినాను. ఇందుకు శాస్త్రిలవారికి కోపంవచ్చింది. "ముద్రణప్రమాదమున |U|| అనునది పడనంతమాత్రమున "దానిని వ్రాయమరచిరో! అచ్చుతప్పో!" అని వికల్పించుట గూడఁ బ్రస్తారము నెఱింగిన సీతాపతిరావుగారివంటి విమర్శకులకు న్యాయముగాదు" అని వ్రాసినారు!

సూర్య:— బాగున్నది! ప్రస్తారము నెఱింగినవారు గనుకనే ఆ గణము పట్టికలో లేకపోవడము మీరు తెలుసుకోగలిగినారు. శాస్త్రిలవారికి ప్రస్తారక్రమము తెలియకపోవుటచేత అది పట్టికలో చేరలేదన్న

సూచన మీవ్రాతలో లేదే. 'వ్రాయమరచినారో' అంటే తప్పేమి? వారికిమాత్రము మరపురాదా? అచ్చుతప్పు అని వారే ఒప్పుకొన్నారు. కనుక, మీరు వికల్పించినవాటిలో ఏదో ఒకటి నిజముకాక పోలేదు.

అయితే, వారుచేసిన మరియొక ఆక్షేపణమునకు మీరు సమాధానము చెప్పవలసి ఉన్నది. "IUU-ఇట్టి పంచమాత్రాకగణము ఇనగణస్థానమందున, IUUU- ఇట్టి సప్తమాత్రాకగణ మింద్రగణ స్థానమందును శైశాసనములో వెచ్చుటను గనపడలేదు." అని యిట్లు నేను స్పష్టముగా వ్రాసియుండగా వానినిగూడ నిసేంద్రగణములలోనికి నేను దెచ్చిపెట్టితినని వ్రాయుటకు సీతాపతిరావుగారెట్లు సాహసించిరో తెలియకున్నది" అని శాస్త్రిలవారు వ్రాసినదానికి మీరుచెప్పేసమాధానమేమి?

నేను:—శాసనగృహీతగణములని చెప్పి, ఇనగణముల క్రిందను, యగణమున్ను, ఇంద్రగణముల క్రిందను యగణమును తామెందుకు చేర్చినారో సీతారామస్వామిశాస్త్రిలవారు మొట్టమొదట సమాధానము చెప్పవలసి ఉన్నది. వీటిని వారు పట్టికలో చేర్చినప్పుడు, ఇవి శాసనమందు లేకపోయినా, శాసనగృహీత గణములనై ఖరీదుకట్టి ఈయగణయగణములుకూడా చేర్చుకోవచ్చునన్న ఉద్దేశములో వారుకనబరచినారనుకొన్నాను. ఇట్లుఅనుకోవచ్చుననుటకు శాస్త్రిలవారి వాక్యములే ప్రమాణము. "శాసనకవి తానుపయోగించినవే యిసేంద్రగణములని చెప్పలేదే, మఱియు నెల్ల యిసేంద్రగణములను బ్రయోగింపవలెనని యుండలేదే" అని 91వ పుటలో వారు వ్రాసినారు, చూడండి.

మరియొకవిషయము, లోగడ పరిషత్పత్రికలో "అవసరజ్ఞుండైన వేదవ్యాసు .." అనేపద్యము తాము చూపిన శాసనగృహీతగణలక్షణమునకు లొంగియున్నదని వారు వ్రాసినారు. అందులో మూడవపాదము ఎట్లు లొంగినది? అన్నాను. అందులో అచ్చుతప్పున్నదట. దానిని ఆధారముగాజేసుకొని అదిసమన్వితమేకాలేదని నేను వ్రాసినానట. అచ్చుతప్పున్నదని తెలుసుకొనుటకు నాకు వీలులేకపోయినది.

సూర్య:—ఏదీ ఆవరణము?

నేను:—"తపసియన్నవపాడవు నల్లని దీర్ఘతనువు(ను) జూచి" (120 తాటాకు). ఇది పరిషత్పత్రికలో కనబరచినపాఠము. ఇదే వారుచెప్పినలక్షణమునకు లొంగలేదని ఛందోదర్పణోపోద్ఘాతమందు నేను వ్రాసినది. ఇందులో ఏదో అచ్చుతప్పున్నదట.

సూర్య:—ఈపాదము ఈవ్యాసములోకూడా కనబరచినట్లున్నదే. ఇందులో ఎట్లున్నది?

నేను:—శాస్త్రిలవారు ఇందులో మూడుచోట్ల ఉదాహరించినారు. ఒక్కొక్కచోట ఒక్కొక్కవిధముగా ఉన్నది. పుట. 83 లో "తపసియున్నవపాడవును నల్లనిదీర్ఘతనువునుజూచి" (120 తాటాకు.)

సూర్య:—ఇందులో 'యన్నవు' అనుటకు 'యున్నవ' అని ఉన్నది. లేఖకప్రమాదమో ముద్రణప్రమాదమో కావలెను.

నేను:—పుట. 95లో "తపసియన్నవపాడవును నల్లని దీర్ఘతనవునుజూచి" (120 తాటాకు.)

సూర్య:—ఇందులో "యన్నవు" అనుటకు 'యన్నవ' అనిన్ని 'తనువును' అనుటకు 'తనవును' అనిన్ని ఉన్నది. ఈమూడున్ను 120 తాటాకులోనివే అయితే, ఒక్కలాగునే ఉండవలెనుగదా; ఇట్లు భిన్నముగా ఉండుటకు కారణమేమి?

నేను:—ముద్రణప్రమాదమే కావలెను. ఆతాటాకులో ఎట్లున్నదో స్పష్టముగా చెప్పలేను. పుట. 96 లో శాస్త్రిలవారు "దీనికినాసవరణము" అనిఇచ్చిన పాఠము:—"తపసియున్నవుపాడవును నల్లని దీర్ఘతనువునుజూచి" అనిఉన్నది. వీటిలో గణలక్షణమునకు సంబంధించినంతవరకు 'పాడవును' అనుటకు 'పాడవు' అని ముద్రణప్రమాదమున పడినట్లు ఇప్పుడు బోధపడినది.

సూర్య:—సరే; ఇప్పుడుబోధపడినది. పరిషత్పత్రికలో ఇచ్చిన ఆఒక్కపాఠమునుబట్టి ఈముద్రణప్రమాదము మీరుకాదు బ్రహ్మైనా తెలుసుకోలేడు "పాడును" అనిఉంటే అచ్చుతప్పున్నదని తెలుసుకోగలము గాని, ఇదిఎట్లు తెలుసుకోగలము? అయితే, "పాడవు"

అనిఉన్నా శాస్త్రిలవారిమతమున ఈచరణము ఛందో బద్ధముగానే ఉన్నదే; చూడండి:—

"తపసియున్న వుసాడ। వు నల్లనిదీర్ఘ । తనువును జూచి." అనికాని,

"తపసి య న్నవుసాడ।వు నల్లని దీర్ఘ।తనువును జూచి" అనికాని, గణవిభజనముచేయవచ్చునే.

నేను:—ఇప్పుడెట్లున్నా కుదురుతుంది. ఆనాటికి నగణము సూర్యగణమున్ను, జగణ మింద్రగణమున్ను కావచ్చునన్న అభిప్రాయము వారికి కుదిరినట్టు తోచదు.

ఇకను, 97వపుటలో చివరనున్న పేరా చదవండి.

సూర్య:—"వెనుకనుదాహరించినట్టి నావ్రాసినపరిషత్ప త్రికలోని పద్యములోనియచ్చుపొరపాటుల నాధారముగాఁజేసికొని యిదిసమన్వితమేకా లేదనియు, నొక వందయేండ్లక్రిందటివరకు సీతాటాకులప్రతి నన్నయ కాలపులేఖన పద్ధతులతో నుండవలయుననియు, సీతాపతిరావుగారేమేమోవ్రాసియున్నారు. కాని, యట్టి వ్రాఁత సుసంగతమైయుండనందున విమర్శసహము కాదని విన్నవించుచున్నాను." —అబ్బా! ఎంతకతినంగా వ్రాసినారు.

నేను:—దానికేమి! పెద్దలు. ఇందులో మొదటివిషయము విమర్శించినాముగదా. అచ్చుపొరపాటుఎటువంటిదో నేనుచేసిన ఆక్షేపణమునకు అవకాశమెట్లుండెనో చూచినాముగదా. ఇకనురెండవవిషయము.

సూర్య:—"ఒకవందయేండ్లక్రిందటివరకు సీతాటాకులప్రతి నన్నయకాలపులేఖన పద్ధతులతో నుండవలయు"నని మీరెక్కడవ్రాసినారు.?

నేను:—అదేమో? నేనెప్పుడైనాఅట్లు వ్రాసిఉందునా? వందయేండ్లక్రిందటిప్రతి సుమారు తొమ్మిదివందలయేండ్లక్రిందటి లేఖనపద్ధతులలో ఉండవలెనని నేనెప్పుడైనా అందునా? ఈలేఖన సంప్రదాయమును గురించి నేనువ్రాసినది. ఛందోదర్పణోపోద్ఘాతమందు 58 వ పుటలో గురుతుపెట్టినాను చదవండి.

సూర్య:—"నన్నయ మధ్యాక్కరలకోసము ఒకవిధమైన లేఖన సంప్రదాయమున్ను శాసనాక్కరలకోసము మరియొకవిధమైన సంప్రదాయమున్ను గ్రహించవలెననుటకు తగినఆవశ్యకత కనబడదు. నన్నయవ్రాసిన తాటాకులపుస్తకము మనకుచిక్కదు! కాని శాసన కాలమునకున్ను నన్నయకాలమునకున్ను అట్టే అంతరము లేనందున ఆకాలపులేఖనక్రమము శాసనములోనున్నట్లు ఉండవచ్చునని ఊహించుట తప్పుకాదు.

మీరువ్రాసిన ఈవాక్యములకున్ను సూరువ్రాసినట్లుగావారుచెప్పినదానికిన్ని ఎంతవ్యత్యాసమున్నది!

నేను:—ఇకను శాసనాక్కరలలక్షణము విమర్శింతాము.

సూర్య:—ఇదివరకున్న లేఖనసంప్రదాయమున్ను, ఇదివరకు తెలుగులాక్షణికులు చెప్పినలక్షణమున్ను (యతివిషయముతప్ప) అనుసరించిచూచినయెడల శాసనములోని మధ్యాక్కరలు సిద్ధలక్షణసమన్వితములై ఉన్నవని మీరు వ్రాసినారు. ఇట్లువ్రాయుటకు మీరెట్లు సాహసించినారో తెలియదుఅని సీతారామస్వామి శాస్త్రిలవారు ఆక్షేపించినారు. దానికిమీరుచెప్పే సమాధానమేమి?

నేను:—తెలుగులాక్షణికులుచెప్పిన లక్షణమునకు లొంగి ఉండనిస్థలములు గీతలుగీచి శాస్త్రిలవారు చూపించినారుగదా. వాటిలో ఒకొక్కగీతగీచినవి మొదట చదవండి.

సూర్య:—"బెజవాడం", "భక్తిన్ని", "ధాముద్ర్తిచ్చె", "సుతుండ్రొండ్రు", "గనిమల్లద్రింతె", "నుంగాత్రికేయునకు", "బెడంగును", "రక్షయుంగానుద్దమ", "దానుంగట్టించె", "వొడంబడి".

నేను:—వారుగీతపెట్టడంమరచినారో అచ్చుతప్పోకాని, ఇటువంటిదే మరియొకటి మొదటిపద్యం రెండవపాదమందేఉన్నది:—"మల్లుణ్డునవద్య" వీటి కన్నిటికీ ఒక్కటే సమాధానము. ప్రాచీనశాసనములను చూచినా, ప్రాచీనతాళపత్రగ్రంథములను చూచినా, అరసున్నలుంచి తేల్చవలసినచోట్లను సైతము, నిండుసున్నలో అనునాసికాక్షరములో ఉంచి వ్రాయడము ప్రాచీనలేఖన సంప్రదాయమని బోధపడుతుంది. ఇందుకు నిదర్శనముగా (శక. 1157)—గణపతిదేవుని కాలమందలి ఉపర్పల్లిశాసనమందున్న పద్యమొకటి.

చూడండి. (ఇది హైదరాబాదు ఆర్కియాలాజికల్ సీరీజ్ నం 3 రులో ఉన్నది.)

"దేవాదిదేవుండమిత
స్థావరజంగమములయందు సర్వేశుండుగా
రీవరుండనవరతంబును
నీవుతంగాటయకు దయ నభీష్టఫలంబుల్"

సూర్య:—సరే; అరసున్న లుండవలసినచోట్లగూడా నిండుసున్నలుంచిపూర్వులు వ్రాసేవారన్న విషయము స్పష్టమైనది. ఇకను రెండేసిగీకలుగీచినవి చదువుతాను వినండి.

"అర్థిన్", "గొమరస్వామి", "నారగల్గా", "గాగ మొంగమాడు"—వీటికి మీరు చెప్పేసమాధాన మేమి?

నేను:—"అర్థి"అని ఉన్నా తప్పులేదు. ఇదిపద్యాంతమం దున్నది. పద్యాలుపాడినప్పుడు, చివరనున్న అక్షరము గురువుగా ఉచ్చరించడము సహజము; గనుక శాసనము చెక్కినవాడు "అర్థిన్"అనినిండుగా చెక్కి ఉండవచ్చును. "విశ్వదాభిరామవినురవేమా" అని చివరనున్న 'మా'వర్ణము దీర్ఘాంతముగా వ్రాతప్రతులలో కనబడుతున్నదికాదా? ఇంతకూ "అర్థి"తర్వాతనున్న దినకారపోల్లా? పద్యముపూర్తియైనదని తెలియజేసే నిలుపుగీతా? కొన్నిచోట్ల పాదాంతములందున్నూ పద్యాంతములందున్నూ నిలుపుగీతలు కనబడుతున్నవి. ఇక్కడకూడా ఒకగీతఉండవచ్చును. అదే 'న్'అని చదువుతున్నారుగాబోలు.

సీ॥ కొక్కొరోకో యని కొమరసామి రథంబు
భీ. ౨ అ. (సూ. శబ్దరత్నాకరము)

"గొమరస్వామి"—ఇది "గొమరసామి" అనే ఉండవలెను. "బొర(రె)సామి", "కుప్పుసామి", "కొమరసామి"—ఇవి తద్భవరూపములు గదా; 'స్వామి' అని ఉన్నదానికి పూర్వమందునఉండే లఘ్వక్షరము తేల్చి పలకవలసినదే కాని ఊది పలకరాదు 'తెలుగు వ్యాకరణము' లోని 'గు', 'తలబ్రాలు' లోని 'లు' ఇట్లే తేల్చి పలకవలెనుగదా.

'వడిద్వారము'లోని 'డి'

"నారగల్గా"—దీనికి సమాధానము చెప్పడము కష్టముగానేఉన్నది. ఈపద్యములో చివరనున్న రెండు చరణాలకున్నూ అర్థం స్పష్టంగాలేదు. ఆమటములో ఉండవలసిన వారెవరో ఉండగూడని వారెవరో తెలియదు. నాల్గవచరణమందలి మొదటి అక్షరమేదో? పఫబభవ- వీటిలో ఏదో ఒకటి అయిఉండుననని వడినియమముబట్టి స్పష్టమైనదిగాని, ఏదనుకొన్నా ఆమాటకు అర్థము తెలియదు.

సూర్య:—తక్కిన మాటలకు అర్థమేమైనా 'నారగల్గా' అని స్పష్టముగా సగణగురువుగా ఉన్నది. ఈగణము ఇంద్రగణము కావచ్చునని ఒప్పుకొంటారా?

నేను:—'నారగల్గా' అనేశబ్దము గురించి మాత్రము మనకు స్పష్టంగా తెలిసినదేమిటి? సరే; ఉన్నది ఉన్నట్లుగానే గ్రహించి ఉచ్చరించినయెడల ఇది సగణగురువై ఉండవలెను; గాని దీనిగురించి కొంచెము చెప్పవలసిఉన్నది.

అద్రువ, విద్రిచె, ఎద్రిచె మొదలయినవి నగణములుగా కవులు ప్రయోగించినారు. 'ఎడ్డ,' 'బూడ్ది,' 'మొగడ్చి' అని వ్రాతప్రతులలోను, '[illegible],' 'బూది' 'మొగిచి' అని అచ్చుప్రతులలోను పాఠములు కనబడుతూ ఉన్నవి.

1. చింతంతే హిమ్మికచ్చన.
2. కమటన ఇతంసి జాఓ
జావి హిమ్మి ఏక్షకింథఅన్నేహిం.

ఈ ప్రాకృతార్యలలోని 'హిమ్మి' అనేది 'హిమి' అని ఛందస్సు ననుసరించి చదవవలెనట.

సూర్య:—అవి ఏగ్రంథములోనివి?

నేను:—ఎపిగ్రాఫియా ఇండికా వాల్యూము 8.25 వ వ్యాసములో ధారానగర శాసనమందలి ఆర్యలు కనబరచినారు. ఇదిగో పుస్తకము. పుటలు 245,247 తీసిచూడండి. అందులో ఈ రెండున్నూ కనబడతవి.

చూచినారుగదా ఇకను ఋగ్వేదములో కొన్నిచోట్ల వ్రాసినది వ్రాసినట్లుకాక, కొద్దిగామార్చి ఛందోభంగము కలుగకుండా చదువవలెనన్న విషయము మీకు తెలిసినదే. అందుకు నిదర్శనముగా ఒకటి చూడండి.

నేమన్నః కామమాపృణః గోభిరశ్వైః శతక్రతో
స్తవామత్వాస్వాధ్యః॥ (మం. 1. సూ. 16. ఋ. 9)

ఇది గాయత్రీఛందము; మూడుపాదములు గలది. పాదానకు 8 అక్షరాలుండవలెను. మూడవపాదములో 6 అక్షరాలే ఉన్నవి. అయితే 'స్వాధ్యః' అనే రెండక్షరాలున్న 'సువాధియః' అని నాలుగక్షరాలుగా చదవవలెను గదా. ఈలాగునే మనము ప్రతిదినమూ పఠిస్తూ ఉండే గాయత్రీమంత్రములోని 'వరేణ్యం' అనే మూడక్షరాలున్న 'వరేణియం' అని నాలుగక్షరాలుగా ఉచ్చరించవలెను గదా.

ఇకను, కొన్ని తెలుగు శాసనాలలో వ్రాసినది వ్రాసినట్లుకాక, కొద్దిగామార్చి ఛందోభంగము కలుగకుండా ఎట్లు చదవవలెనో చూడండి.

“పుడమిపాలుంగు నొంచెడ్లపూండి మహేశున కిందు మౌలికిం” ఇది చంపకమాలా చరణము. ఇక్కడ 'నొంచెడ్ల' అన్నది 'నొంచెడల' అని చదవవలెను. మరియొకటి :—

“అరుదగుచుండ నాదిండ్ల అందు ప్రసిద్ధిగశూల పాణికిని” ఇది, “అరుదగుచుండ నాదిండల అందు ప్రసిద్ధిగ శూలపాణికిన్” అని చదవవలెనుగదా.

సూర్య:—ఇవి ఎక్కడి శాసనములు?

నేను:—South Indian Inscriptions. 4. వాల్యూములో పు. 205; నం. 672. చూడండి. అందులోనే పు. 207; నం. 675 చూడండి. ఒక కంద పద్యము ఎట్లువ్రాసినారో.

ధరసిద్ధిచేతదిఖ్యాతి
హరినామ్మనేంద్రుండు బసిగొలార్జ నుండాలిని
శ్రీవచ్ఛ లక్ష్మగోయుండ
గిరివర వజ్రము జగజ్జిగీషుండు వేర్మిని.

ఇందులో 'శ్రీ' అనుటకుమారుగా 'శిరి' అని గాని 'సిరి' అనిగాని చదవవలెనుగదా. ఈ శాసనములోనే మరియొక పద్యచరణము చూడండి:—

“ఆలలితాతపత్రని చయంబునంగాహడ్లునుదయారసాష్టాలిత...” ఇది “ఆలలితాతపత్రని చయంబునుఁ గాహడులుం దయారసాష్టాలిత...” అనిగదా చదవవలెను.

శాసనములలోని వ్రాతలు ఈలాగు ఉంటూఉంటే 'గొరగల్గా కొరుకేద్ద విడిపి బృద్దంబుగొనియుండువారు । ? రిగాక యుబ్బారణాసి ప్రచ్చినపాపంబుగొణ్ణు ।

అన్నచరణములకు అర్థంస్పష్టంకాకుండాఉంటే, ఇక్కడ సగణాగురువుగా కనబడుతూఉన్నగణము ఇంద్రగణముగా కవి ఉద్దేశించినాడో లేదో 'గొరగల్గాలో' 'గ' తేల్చి పలకవలెనో లేదో ఎట్లుచెప్పగలను!

సూర్య:—కావ్యాలంకార చూడామణిలోను, కవిజనాశ్రయములోను త్రిగురు జనితములైన 8 గణము లున్న ఇంద్రగణములన్నారు గదా. అందులో '॥UU' (సగ) అనేగణము ఉన్నదిగదా 'గొరగల్గా' అన్నది సగణాగురువుగా మీరెందుకు అంగీకరించరాదు?

నేను:—'మగణ, సగ'ములు మధ్యాక్కరలలో ఉండవని చెప్పుటకు కొన్ని కారణములున్నవి.

1. కావ్యాలంకారచూడామణిలోను, కవిజనాశ్రయములోను అక్కరలయిదింటికిన్ని లక్ష్యములుగా ఉన్న పద్యాలలో ద్వి, త్రి, చతుర్గురుజనితగణములలో మొదటిరెండేసిగణములకున్న ప్రయోగము ఎక్కడా కనబడలేదు. కనుక, మొదటివి రెండేసిన్ని విడిచిపెట్టవలెనని స్పష్టముగా చెప్పకపోవడము ఆ లక్షణకర్తలు ఉద్దేశించుకొన్నదో పొరపాటో నేను చెప్పజాలను.

2. మనమధ్యాక్కరను పోలిఉన్న కన్నడకొర అక్కరలలో ఉండవలసిన విష్ణుగణములు 4, 5 మాత్రల విష్ణుగణములే (అనగా నల, నగ, సల, భ, ర, తలే) కాని 6 మాత్రల విష్ణుగణములు (అనగా మొదటివి రెండున్న మ, సగములు) కావు.

సూర్య:—సరే; మీరు చెప్పినసమాధానము చక్కగానే ఉన్నది. కాని, కవి ఉద్దేశము స్పష్టముగా తెలుసుకొనుటకు ఇంకా అవకాశమున్నదేమో విచారించవలెను.

ఇకను “గాగవెంగమాడు”- ఇందులో 'గాగవెం' భగణమైతే, 'గమాడు' జగణముకావలెను ఇది సూర్యగణస్థానమందున్నదిగదా. దీనికేమంటారు?

నేను:—ప్రమాదవశమున ఒకరుచేసిన తప్పు తక్కినవారు తగిన విమర్శలేకుండా అనుసరిస్తే విపరీతమైన లక్షణములు పుట్టవచ్చుననుటకు ఇది మంచి నిదర్శనమంటాను. శాసనములో 'గావెంగమాడు' అనే ఉన్నది గాని 'గాగ వెంగమాడు' అని లేదు. 'గాగవెంగమాడు

అని శాసనకారుడు వ్రాయ నుద్దేశించి ఉంటే, 'గాజ్జమెుగమాడు' అని ఉండును. 'పరగజ్జ బెజవాడ' అనియున్నది చూచినారా? అయితే, రామయ్యపంతులుగారు ఇప్పటిలిపిలో ఈశాసనము కనబరచినప్పుడు 'గాగమెుగమాడు' అని పడినది. ఈపొరపాటు వారిదో అచ్చువారిదో తెలియదు. కాని ఈశాసనములోని పంక్తులు పద్యచరణములుగా ఎత్తి వ్రాసినచోట 'గామెుగమాడు' అనేయున్నది. ఇది మనశాస్త్రులవారు చూడలేదో, చూచినా లాక్షణికులు చెప్పిన లక్షణమునకు సరిపడియుండవలెనన్న ఉద్దేశముతో ఇది రామయ్యపంతులవారు దిద్ది సవరించిన పాఠమేకాని శాసనములోనిది కాదని తలచి ఉపేక్షించినారో తెలియదు.

సూర్య:—శాస్త్రులవారు శాసనముప్రతి సరిగా పరిశీలించలేదు, గాబోలు.

సరేకాని, మూడుగీతలుగీచిన వాటిగురించి మీరేమీ సమాధానము చెప్పలేరనుకొంటాను. 'మహంబు' 'వలియంబయ్యెవ్వరల', 'ఫలంబు', 'ప్రత్యక్షంబయున్న', 'మహంబు', 'గ్రమంబున', 'కలశంబిడ్డట్లు'—వీటిలోని నిండుసున్న అరసున్న అగుటకు వీలు లేదుగదా. మాటకు, 'మహంబు' అని జగణముగా ఉన్నది. 'మహము'లని నగణముగా చదవవలెనని చెప్పుటకు ప్రమాణమేమి! మీతండ్రిగారు శాస్త్రులవారికిపంపిన దీర్ఘాసిశాసనమందలి సీసపద్యములో 'దేశంబు'అని తగణముగాను, 'దేశము'అని భగణముగాను రెండువిధములుగాను లిపిఏర్పడియున్నదిగదా; అదిమీరు చూడలేదాఏమి?

నేను:—అది నేనుచూడకపోలేదు, ఆనాటికి విభక్తి 'ము'కారము ఏర్పడినది. అంతకుపూర్వము 'మహము'అని నగణముగా చదువవలసినప్పుడుకూడా 'మహంబు'అనే వ్రాసేవారు. యుద్ధమల్లునిశాసనములో విభక్తి 'ము' వర్ణము ఎక్కడాలేదు. దానికిమారుగా అన్నిచోట్ల 'ంబు' అనేయున్నది. మరిఒకమారు శాసనమంతా చదివి చూడండి.

సూర్య:—అవును. విభక్తి ము వర్ణము కనబడలేదు.

నేను:—అదిఉంటే, శాస్త్రులవారుచెప్పిన విషయము నేనుశిరసావహించవలసినదే.

సూర్య:—అయితే, అదిలేనంతమాత్రాన మీరుచెప్పినది వారు శిరసావహించవలసిన అగత్యంలేదు. లక్ష్యమునుబట్టి ఇప్పుడు క్రొత్తగా గణకల్పనము చేయదలచినారు; కనుక, 'ంబు'కు పూర్వమందున్నది గురువుగానేభావించి శాస్త్రులవారు గణములేర్పరుస్తున్నారు. గణములగురించి వివాదములేని పద్యములో విభక్తి 'ము'కారమునకుమారుగా 'ంబు' ఉన్నశాసనము, శాస్త్రులవారన్నట్లు "అందుటకు దొరకకుటకు వీలగునట్టిస్థలము" ప్రమాణముగా చూపించండి. అంతవరకున్ను మీరుచెప్పినదానికి "సమాధానము ఆలోచించుప్రసక్తి యగపడదు."

నేను:—అలాగేచూపిస్తాను. కీర్తిశేషులయిన కొ. వె. లక్ష్మణరావుపంతులుగారు రెండుసంవత్సరములక్రిందటజరిగిన ఆంధ్రపరిశోధకమహామండలిపంచమవార్షికోత్సవసభలో చదివినఅధ్యక్షోపన్యాసము కీర్తిశేషులయిన చెలికాని లచ్చారావుగారు చిత్రాడలో ప్రకటించినసంచికయందున్నది; చూడండి. అందులో "నన్నయభట్టునకంటె రెండువందలయేండ్లకుఁ బూర్వమును యుద్ధమల్లునికంటెఁ దొంబదియేండ్లకుఁబూర్వమును" రాళ్లమీదచెక్కిన పద్యములను ఎత్తివ్రాసి కనబరచినారు. వాటిలో ఒకటిసీసము. అందులో "కొట్టంబుల్"అన్నది. సీసమునకుచెప్పిన గణములలో మగణములేదు; గనుక. 'కొట్టముల్' అని రగణముగాచదువవలెను.

సూర్య:—శాస్త్రులవారు యుద్ధమల్లునిశాసనముప్రమాణముగాతీసుకొని శాసనగృహీతగణములను ఇనేంద్రగణములుగా గ్రహించినట్లే ఈశాసనము కూడా ఆధారముగా తీసుకొని సీసాదుల విషయములో సైతమూ మగణముకూడా ఇంద్రగణమేను అని అంటే ఏమంటారు?

నేను:—ఇటువంటి సందేహముండబట్టే, "శాస్త్రులవారు క్రొత్తగా తెచ్చిపెట్టిన ఇనేంద్రగణములు సీసములు మొదలయిన తక్కిన తెలుగుపద్యములందు ఉపచరించునా" అని ఛందోదర్పణోపోద్ఘాతమందు వ్రాసినాను. అయితే, సీస గీతాదుల ఇనేంద్రగణములు అప్పకవ్యాది లాక్షణికులు చెప్పినవే అని ఈవ్యాఖ్య

శీనులో వ్రాసినవ్యాసమందు స్పష్టపరచినారు. కనుక, 'కొట్టంబులో' అని శాసనములో ఉన్నా "కొట్టములో" అని చదువవలెనని శాస్త్రిలవారు కూడా అంగీకరింపక తప్పదు.

సూర్య:—మీరు చూపించిన ఈసీసపద్యము ముక్కముక్కలుగా ఉన్నదిగాని పూర్తిగాలేదు.

నేను:—యుద్ధమల్లునిశాసనము మాత్రము పూర్తిగా ఉన్నదా; పోనీండి. లక్ష్మణరావుగారు ఉదాహరించిన రెండవశాసనములోనిసరుపోజపద్యముచూడండి. ఇది నిండుగాఉన్నది.

"కొట్టంబుల్పన్నె(గొని)వేఁగినాఁటి"ఇది "కొట్టముల్ పండ్రెండుఁగొని వేఁగినాఁటి" అని కదా చదువవలెను. ఇక దీనికేమంటారు?

సూర్య:—మరి మారుమాటాడక ప్రాచీనలేఖన సంప్రదాయమునగురించి మీరుచెప్పినవిషయము అంగీకరించవలసినదే.

చాలావేళ అయినది. విషయములన్నీ విమర్శించడమైనదా?

నేను:—ఒక్కవిషయముమాత్రము ఇంకా విమర్శించవలసి ఉన్నది. నాగవర్మద్వార అక్కరకుచెప్పిన పద్యమున్ను దానిపై కిట్టెలుద్వార వ్రాసిన ఇంగ్లీషువాక్యములున్ను, అర్థము శాస్త్రిలవారుచెప్పినారు. వారుచెప్పినఅర్థము విమర్శించవలసిఉన్నది. మరియొకసారి కలుసుకొని విమర్శింతాము.

నా పా ట

భమిడిపాటి రామసోమయాజులు గారు, బి. ఏ.,

గొంతువోయి స్వరమ్ము రవంతయేని
పైకివెలువడకున్నను పాడుచుంటి,
మూగనైనంత మాత్రాన మొరల వినవొ?
వినిన మానిన నేను మాననుర స్వామి!

ఈమహోన్నత పర్వత భూమిలోన
వెలుగెరుంగని లోయలో, శిలలపైన
హోరనుచు బారు సెలయేటి రొద్దునందు,
కాలమెరుగక పాడుకొగలను స్వామి!

అంతమేలేని నాపాటయందు జగము
లీనమైపోవు; నీవును లీనమగుదు
వీశ! రము రాలేద యేమొ! దాని
వినుతు పాటను మాత్రము వీశ స్వామి!

చుక్కలన్నియు నీరయి సూర్యచంద్ర
లోకసముతోడ గరగి నాయందె కలతు
రప్పటికి గూడ నే పాట నాప బోను
పాడుకొనియెద నీయొక్క స్వరమె స్వామి!

మాయతెర జీల్చుకొని దివ్యమార్గమంటి,
ప్రకృతి వన్నెలకావలి భావముగని,
నీహృదయకవాటము దట్టి నిన్ను గలసి
కొనగ, నిత్యము నేబాడు కొందుస్వామి!

వసుచరిత్ర విమర్శనము

యడ్లపాటి వెంకట సుబ్బారావు గారు, బి. యె.,

పదునారవ శతాబ్దిలో వెలువడిన ప్రబంధములలో వసుచరిత్ర యొకటి. దీనికి కృతికర్త రామరాజభూషణుడు. కృతిభర్త తిరుమలరాయలు. కథానాయకుడు వసురాజు. కథానాయిక గిరికాదేవి. వీరిద్దరి వివాహవృత్తాంత మిందలి ప్రధానకథ. గిరికాదేవి జననకారణమైన శుక్తిమతీ కోలాహల సమావేశము ఉపకథ. శృంగారము ప్రధానరసము. కావ్యము శ్లేషసమన్వితము; నారికేళపాకము; మహోత్తమము.

కథాసంక్షేపము

గ్రంథవిమర్శనకు గడంగుటకు పూర్వము కథ క్లుప్తముగా చెప్పుట ఆవశ్యకము. కథావిధానము ప్రధానరసపరిపోషణమునకు బీజము.

వసురాజు చేదిభూపాలుడు. వసంతమాసమున నొక దినమున వనపాలురు రాజుకడ కేతెంచి ఉద్యానవనశోభను వర్ణించిరి. రాజు తత్సౌందర్యావలోకనకుతూహలుడై పరివారముతో ఉద్యానవనమున కేతెంచి పరివారమును బహిరంగణమున నిలిపి నర్మసచివసమేతుడై వనప్రవేశ మొనర్చి వనరామణీయకమును నేత్రపర్వముగ విలోకించుచుండ ఒకమహావృక్షము భూమి కొరగియుంట చూచి కోలాహలపర్వతము జ్ఞప్తికి రాగా నాపర్వత ప్రాంతమునకు వెళ్లెను. అక్కడ నొకశిలావేదికపై ఆసీనుడైయుండ వీణారవ మొకటి వీనుల విందొనర్ప తద్వృత్తాంత మారయ నర్మసచివుని పంపును. సచివుడేగి యొక రమ్యసౌధములో చెలికత్తెలు పరివేష్టింప వీణవాయించుచున్న గిరికను చూచి రాజుకడ కేతెంచి గిరికాసౌందర్యమును వర్ణించును. రాజామెను చూచు కుతుకమున సచివుడు మార్గముచూప సౌధసమీపమున కేతెంచును. సచివుడు మునివేషధారియై సౌధము ప్రవేశించి ఆస్త్రీజనముచే పూజితుడై ఉపవిష్టుడగును. మంజువాణి గిరికాజననప్రకారము మునికి తెలియజేయును. ఈమెను వసురాజే తగినవరుడని ముని చెప్ప వసురాజే విధముగ లభింపగలడని చెలికత్తెలు సందేహము నొందుదురు. అప్పుడు ముని రాజును మంత్రప్రభావమున రప్పింతునని పొదచాటుననుండి కనిపెట్టుచున్న వసురాజు సమయ మదియని వారిసమీపమున కేతెంచును. వారు రాజును ఉచితాసనాసీనునిచేసి గౌరవింతురు. ముని వెళ్లి నిజరూపమున ప్రవేశించును. ఇది గిరికావసురాజుల ప్రథమసమావేశము. కలహంస వచ్చి గిరికను పిలుచుకొనిపోవును. రాజు నర్మసచివునితో వనమున ఆయాచోటుల దిరుగుచు గిరికా ప్రశంసచేయుచు నిజమందిరమునకు బోవును.

గిరిక వసురాజుమీది మోహముచే విరహవేదన పడును. అందుకు తాళజాలక సహకార కోరక గ్రహణమున మేను వాయదలచి వనమున కేతెంచును. చెలికత్తెలామెను వెదకికొనుచువచ్చి నయవాక్యముల దుఃఖోపశమన మొనర్చి వనవిహార మొనర్చి పుష్పాపచయము, జలక్రీడలు మొదలగునవి సలిపి మన్మథపూజ యొనర్తురు. వసురాజుచిత్తవృత్తి నారయ మంజువాణి పురమున కేగును. గిరికాదేవి విరహవేదనవల్ల చంద్రదూషణ మొదలగునవి చేయును. ఇంతలో మంజువాణి యేతెంచి తానువెళ్లిన వృత్తాంతమంతయు వినిపించి రాజామెయందు పరిపూర్ణానురక్తుడై తదేకధ్యానములో నున్నటుల వివరించి రాజిచ్చిన అంగుళీయకమును గిరిక కొసంగును.

వసురాజు నిజగృహమున గిరికామనోహరరూపలావణ్యాదుల స్మరించుచు మోహావిభ్రాంతిలో మునిగియుండును. చెలికాడగు ఇంద్రుడీవిషయమును కనిపెట్టి దేవతాపరివారసమేతుడై కోలాహలునికడ కేతెంచి గిరికను వసురాజున కిచ్చి వివాహము చేయవలసి

నదిగా అడుగును. కోలాహలుం డందులకు సమ్మతింప ఇంద్రు డావిషయమును వసురాజున కెఱింగించి తీసికొని వచ్చును. శుభముహూర్తమున గిరికావసురాజులకు వివాహ మగును. ఇంద్రు డనేక బహుమతులను వసురాజున కొసంగి వీడ్కొనును.

వివాహానంతర మొకదినమున వసురాజు క్రీడామందిరముననుండ చెలికత్తెలప్రోద్బలమున గిరిక వచ్చును. సంభోగవర్ణనతో గ్రంథపరిసమాప్తి యగును.

శుక్తిమతీకోలాహలచరిత్ర

ఉపకథ యగు శుక్తిమతీకోలాహలులచరిత్రకూడ చెప్పుట అవసరము. శుక్తిమతి నది. కోలాహలుడు పర్వతము. కాని వీనిని అచేతనపదార్థములగు నదీపర్వతములుగ నెంచకొనక స్త్రీపురుషులుగానే భావించుదము. శుక్తిమతి నలువకొలువున కేగి తిరిగి వచ్చుచుండ కోలాహలు డెదురుపడును. శుక్తిమతి వినయముతో తొలగిపోవును. కోలాహలున కామెమీద మోహము జనించును. మోహపరవశుడై ఆమెయొద్దకువచ్చి నిజాభిలాషను వెల్లడిచేయును. కాని ఆమె అందుల కియకొనక తన హేయస్వరూపమును కుటిలగమనమును వర్ణించుకొనును. కోలాహలుడు బలాత్కారమున పైబడును. ఆమె వసురాజునుగూర్చి మొరపెట్టుకొనును. ప్రజ లీవిషయమును వసురాజునకు తెలియజేయ వసురాజువచ్చి కోలాహలుని కొనగోట మీటి యోడించును. ఇంద్రుడు ప్రత్యక్షమై వసురాజు శౌర్యమునకు మెచ్చి లక్ష్మీనారాయణ వివాహసమయమున విశ్వకర్మచే నిర్మింపబడి తనకు నారాయణునిచే నీయబడిన విమానమును వసురాజునకు నిచ్చును. కోలాహలు డాప్రాంతముననే యుండును. శుక్తిమతికి గర్భచిహ్నము లేర్పడును. గిరికాదేవి జననమొందును. ఈకథనంతయు మంజువాణి మునివేషముతోనున్న నర్మసచివునకు చెప్పును.

శృంగారరసపరిపోషణము

కవి కావ్యము నొకశృంగారసౌధముగా నిర్మించుకొనెను. ఆసౌధారోహణమునకై ఆఱుసోపానములను నిర్మించుకొనెను. ఆయాఱు సోపానములు ఆరు శృంగార రంగములు. ఒక రంగము మఱియొక్క రంగప్రవేశమును కలుగజేయును. ప్రథమరంగము వసురాజు వనవిహారము; ద్వితీయరంగము గిరికా వసురాజుల సమావేశము; తృతీయరంగము గిరికావిరహావేదన, తచ్ఛాంత్యుపకరణములు; చతుర్థరంగము వసురాజు విరహావేదన, మంజువాణీ దౌత్యము; పంచమరంగము వివాహము; షష్ఠరంగము వివాహానంతరము. ఒక్కొక్క రంగ మేవిధముగ శృంగార రసపరిపోషణమున కనుకూలమో వివరించెదను.

గిరికావసురాజుల ప్రథమసమావేశమునకు వసురాజు వనవిహారము ప్రధానము. శృంగారరసమునకు ఆలంబనవిభావమైన నాయకుడు మధుమాసమున ఆహ్లాద సమయమున రమ్యోద్యానవిహారలోలుడై మానసోల్లాసమున నందువేళ ఆమూర్తప్రదర్శనములు, మలయానిల స్పర్శానందానుభవము, ఉద్దీపనవిభావములై తన్మయత్వము నొందించును. ఈరంగమున కవిచేసిన వర్ణనమంతయు వసురాజు చిత్తాకర్షణశక్తియుతమై ముందు కలుగబోవు శుభమునకు సూచకమై యున్నది.

చ. చలిత లతాంతకాంతియును
చందురు కావిచెరంగు దాటి స
మ్మిళితవయోవిలాసముల
మీటిన విచ్చు ఫలస్తనాగ్రముల్
వెలువడఁగప్పెఁ దత్క్షణము
వెల్లితదోహదధూపధూమకుం
తలములు విప్పి దాడిమల
తాలతాంగి నృపాలుచెంగటన్.

ఈదాడిమలతావర్ణనవ్యాజమున నీ గిరికా వసురాజుల సమావేశమును కవి సూచించెను. ఏతద్దృక్ప్రదర్శనవిలోలుడైయున్న రాజునకు ఒక కిన్నరమిథునము శుభసూచన తెలియజేయుచు కోలాహలపర్వతమున కెగిరిపోవును. అవి యటులు వెళ్లుట చూచిన రాజునకు కోలాహలపర్వతవిహారోత్సుకము కలుగ నచ్చటకు వెళ్లెను. ఇటుల ప్రథమరంగము ద్వితీయరంగమునకు మార్గదర్శక మయ్యెను.

ద్వితీయరంగమున శృంగారరసపరిపోషణ మత్యద్భుతము; కళానైపుణ్యము ప్రశంసనీయము, మనోహరము; నాటకరంగప్రదర్శనతుల్యము. ముఖవిన్యాసముల భావవ్యక్తీకరణము, క్రీడాభినయస్థితిశేషములు

రసవంతముగ ప్రదర్శితములు. మాతంగముని వసురాజును మంత్రప్రభావమున రక్షించెదనన రాజు ప్రత్యక్షమగుట, అక్కడనున్న స్త్రీజనములో కలవరపాటు, అద్భుతరస ప్రదర్శనములు. నాయికానాయకుల వీక్షణపంక్తు లొండొంటితో మిళితమై అన్యోన్యమనోభావాన్వేషణ మొనర్చుట స్వాభావికము. ఈ పట్టున కవి సహజమాధుర్యమును వెదచల్లెను. గిరికాదేవి సహజవ్రీడావీక్షణములు వసురాజు సరసమోహదృష్టుల నెదుర్కొని మరలుట స్వభావసిద్ధము. వసురాజు పరధ్యానమున నుండ మరల ఆ వ్రీడావీక్షణములు ప్రసరించి అతని మనోహర సౌందర్యధన మపహరించుట శృంగారరస పరిణామ వికాసము. గిరికాదేవి లజ్జచే తెరచాటునకుపోయి క్రీగంటిచూపులు ప్రసరింపజేయుట స్వాభావికము. చెలికత్తెల మేలపుపలుకు లిత్యాదులు ఆలంబనవిభావమగు నాయికానాయక శృంగారరసపరిపోషణమునకు ఉద్దీపనవిభావములు. కలహంసతో గిరిక వెళ్లిపోవునప్పుడు కవి చిత్రించిన శృంగారప్రదర్శనము వర్ణనీయము.

చ. కలికియు నాన్నృపాలకునిఁ
  గ్రమ్మఱఁ జూచుచు నేఁగ నేర్పులో,
నలఘుపదాంగదధ్వనికి
  నంచలు మూఁగిన నిల్చి నెయ్యపుం
జెలువల గూడఁ బిల్చుగతిఁ,
  జిల్కలకుఁ బార్వ్వలతొందలంబులకా
ఫలము దెమల్చురీతి, నళి
  పంక్తికి మోము వలంచు, కైవడిన్.

ఈగిరికావసురాజుల సమావేశము తృతీయ చతుర్థ రంగములకు కారణము. వసురాజు మనోహరరూపసందర్శనమున గిరికాహృదయక్షేత్రమున ప్రేమాంకురము మొలకెత్తెను. దానిని వికసింపచేయవలెను. అందుకు తగిన ప్రదేశము వనము. గిరికను కవి వనరంగమున ప్రవేశపెట్టెను. వనరామణీయకము, మందమారుతము, పక్షుల కిలకిలారావములు ప్రేమాంకురమునకు దోహదములై ఆమెను మోహవిభ్రాంతికి లోబరచును. చెలికత్తెలామెకు తాపోపశమనము చేయ ప్రయత్నింతురు కాని, ఆయుపచారములన్నియు మోహాభివృద్ధికే తోడ్పడును. ఆమె దృష్టిని తదేకధ్యానమునుండి మరల్ప జలక్రీడాపుష్పాపచయవ్యాజముల కల్పించి ఆమెకు వసురాజుచింతనమున విశ్రాంతి యొసగెదరు; కాని వెంటనే ఆమె మనోభావము లట్లనే పరుగెత్తుచుండును. వసురాజు చిత్తప్రవృత్తి కనిపెట్టజేసిన మంజువాణిరాకకై ఆందోళనమును జెందిన హృదయముతో ఎదురుచూచుచుండుట ప్రేమదశ పరిపాకమునొందుచున్నది.

కవి యేర్పరచుకొన్న చతుర్థరంగము వసురాజు శయనగృహము. గిరిక వనములో విరహవేదన ననుభవించుచున్న విధమున ఇక్కడ రాజు గిరికాచిత్రఫలకమును వీక్షించుచు మోహపరవశు డగును. అట్టిసమయమున మంజువాణి వచ్చి గిరికామణిహార మొసంగి గిరికానురాగముచే తెలియజేయుట శృంగారపరిణామము సంపూర్ణత్వము దాల్చెనని చెప్పవచ్చును. మంజువాణి గిరికకు రాతియుంగర మొసగుటతో ప్రేమపరిపూర్ణత్వము తాల్చినది. అన్యోన్యానురాగ మొండొరులకు పరిస్ఫుటమైనది. తృతీయ చతుర్థరంగముల సంయోగమునకు కారకురాలు మంజువాణి. ఈరంగద్వయసంయోగము[illegible] కవి శృంగారరసప్రవాహము వెల్లివిరియునట్లు చేసెను.

ఈసంయోగఫలము పంచమరంగమున విశదము. నాయికానాయక వివాహముతో కావ్యోద్దేశము పరిసమాప్తము. శృంగారరసపరిపోషణము సంపూర్ణము. మనోహరము. కవి కావ్యము నంతటిలో విరమించిన నెంతయో బాగుండెడిది. నాయికా నాయకవివాహశుభకార్యవర్ణనతో కవి తృప్తినొందక వారిశోభనమునుకూడ ముట్టడించుట విచారకరము. అట్లు చేసినను వారిమనోభావములను మాత్రము వర్ణించి ఔచిత్యము పాటించిన బాగుండెడిది. కాని కవి తుచ్ఛవర్ణనకు గడంగెను. పాఠకులకు హేయమును (జుగుప్స) కలిగించు శృంగారవర్ణన చేసెను. ఈక్రిందివర్ణన చూడుడు.

సీ. వరపద్మముకరముల్ కరగతంబులు నీకు
  సతి! నీవి యింత చే సడలరాదె
బహుళశతచ్ఛదరాశి భవదీయుంగళంబు
  క్షేత్రాచలం బింత సెరపరాదె
యనఘదివ్యాహారఖని నీదుకెమ్మోవి
  లేమ! ముద్దింత పాలింపరాదె

దాని గంబూరంపుదీవి నీవెంగ వెంక్క-
పలు కింత నాపైనఁ జిలుకరాదె
చక్రవిజయం బొనర్చ నీచన్నుదోయి
కంచుకం బేల యింకఁ జాలించరాదె
నిర్మలామూల్యగుణరత్ననిధికి నీకు
వనజముఖి త్రాస మిదియేల వదలరాదె?

తే. అనుచు నరపతి కెంగేల నచలకన్య
కాత్రపాటచ్చర గూఢాంగకములు దరలె
నొయ్య నాభీకుచాది నిమ్నోన్నతప్ర
దేశములు దద్విగాహేచ్ఛఁ దెలియుకరణి.

మ. తరళాధార మతిప్రవాళకయుగ
స్తం బంచు నభ్యంతర
స్మరుఁడు త్తంభితకంపలోలపటుసం
జ్ఞం బిల్వ బాలాపయో
ధరదుర్గంబు గ్రహించె రాజకరమే
తజ్జాతసంత్రాసవై
ఖరిఁ దె[illegible]ె జఘనస్థలీవరణజా
గ్రద్ఘంటికాఘోషముల్.

ఇది నీచసంభోగవర్ణనము. అసభ్యము. కవిభావ
నాశక్తిమాత్రము మెచ్చుకొనవలసినదే.

నా య కు డు

ఇక నాయకపాత్రవిమర్శనకు గడంగెదను. నాయకుడైన వసురాజు చేదిభూపాలుడు. శౌర్యధైర్య సమన్వితుడు; కోలాహలపర్వతమును కొనగోటమీటిన మహాసత్త్వుడు; ఇంద్రునంతవానిచే మెప్పువడసి విమానము పొందిన శూరశిఖామణి; ఆర్తజనత్రాణపరాయణుడు; సుగుణమణి; సౌందర్యరాశి;రసికుడు. ప్రకృతిసౌందర్యావలోకనాభిలాషి; శృంగారరసప్రియుడు; కవి నాయకుని పాత్రపోషణమున స్వల్పలోపమును గనుపరచెను. శయనగృహమున హంసతూలికాతల్పముపై శయనించి గిరికా చిత్రపటము వీక్షించుచు నాయకుడు విరహ మనుభవించు విధము సమంజసముగ లేదు. ఆరూపలావణ్యముల మెచ్చుకొనుచు తదనుభవమునకు ఉవ్విళు లూరవలసిన నాయకుడు ఏవిధముగ నాయికాదూషణ ప్రారంభించినాడో చూడుడు.

ఉ. ఏమిటికగ్గితే కువల
యేక్షణ! పల్కవిదేటికే వధూ
టీమణి! యేల తాకటికి
డెందము పూనితివే లతాంగి? య
య్యొయ్య మనసారఁ దావకప
యోధరపాళి దృఢాంకపాళి యీ
వే మృదుపాణి! నీకు నొక
యొగ్గను జేయఁగదే తలోదరీ!

చ. అళులకు మోముఁ ద్రిప్పుగతి
నంచల రాఁ జెలిఁబిల్చుకీతి రా
చిలుకకుఁ బండ్లు గోయు క్రియఁ
జిత్రగృహంబునఁ మండి పోవుచుఁ
సాలపుఁన నీవు న స్మరలి
చూడఁ ద్రికుద్ధిగ నేలితంమ నే
నలికితిఁగాని భావజుని
కగ్గము సేయు టెఱుంగఁగోమలీ.

ఆ. గురునిగుణ మురోజగిరులు గాంచినఁగాంచుఁ
గాక నీమనంబు గాంచనేల
కల్లికుటిలవృత్తి తగఁగాక కురులకు
నింత నీదుచెయ్యి లెనయనేల.

ఈవిరహధోరణిలో ఉన్నతాదర్శము లేదు. చేతనాచేతన వివేకము లేదు. కామాంధకారులకు చేతనాచేతనవివేకము లేకుండుట సహజముందురేమో! అట్లని నిరవధికముగ చేయవచ్చునా? అవయవపరిష్వంగాభిలాష ఉత్తమనాయకాదర్శము కాదు. పవిత్రప్రేమాస్వాదనము, తదనుభవమే ఉత్తమనాయకుని ఆదర్శము. నాయిక చెయ్యులలో కుటిలవృత్తికలదని నాయకునిచే దూషింపజేయుట విచారకరము. ఇది శ్లేషవలన వచ్చిన అపర్థకము. ఈవిషయమును శ్లేషవిమర్శనలో వివరించెదను.

నా యి క

నాయిక గిరికాదేవి, రూపవతి; లావణ్యవతి; వ్రీడావతి; రసికురాలు; ఇష్టవస్తునిరీక్షణవ్యాజమున మనోభావవ్యక్తీకరణ మొనర్చిన చతుర; కాని ధీరస్వాంతకాదు. అకారణశోకసంతప్తహృదయ. వసురాజుమీద విరహవేదన సహింపలేక చూతపుష్ప

ప్రాణమున దేహము విసర్జింపదలచినది. చంద్రాతపమున కోర్వలేక ఎటు లేడ్చినదో చూడుడు:

శా. ఆజాబిల్లి వెలుంగు వెల్లికల దా
యఞ్ఞాలేక రాకానిశా
రాజశ్రీసఖమైన మోమునఁ బటా
గ్రంబొత్తి యెల్గెత్తి యా
రాజీవానన యేడ్చెఁ గిన్నరవధూ
రాజన్యకాంభోజికాం
భోజీమేళ విపంచికా, రవసుధా
పూరంబు తోరంబుగాన్.

ఈయేడుపు ఎంతవరకు సమంజసమో తెలుపుటకు మనుచరిత్రలో వరూధిని యేడుపువిధము వివరించుటావశ్యకము. ఆపద్యము గనుడు:

ఉ. పాటున కింతులోర్తురె కృ
పారహితాత్మక! నీవు త్రోవని
చ్చోటఁ భవన్నఖాంకురము
సోఁకఁ గనుంగొనుమంచుఁజూపి యా
ప్పాటలగంధి వేదననెపం బిడి
యేడ్చెఁ గలస్వనంబుతో
మీటిన విచ్చు గుబ్బచను
మిట్టల నశ్రులు చిందునందఁగన్.

ఇక్కడ వరూధిని యేడ్చుటకు దగినకారణమున్నది. నిజమనోరథభగ్నయై ప్రవరునిచే త్రోపువడినది. కోరిక నిష్ఫలముకాగా అవమానము పొందినది. అట్టి సందర్భములో ఎట్టిధీరస్వాంతకైనను ఏడ్పువచ్చుట సహజము; స్వాభావికము. వరూధినియవస్థ దిలకించిన పాఠకులకు అనుకంప జనించును. కాని గిరికశోకము కృత్రిమము. అకారణమనోవ్యథాసంజనితము. తెచ్చికోలు ఏడ్పనిన సమంజసము. ఎలుగెత్తి యేడువవలసినకారణము మృగ్యము. అనురాగవిచ్ఛిత్తి లేదు. ప్రియునిప్రేమాభావసూచనలు లేవు. కోరికలేమి భగ్నములుకాలేదు. అవమానము పొందలేదు. ఇక కారణమేమనిన కామపీడితయై చంద్రాతపమున కోర్వలేకపోవుటయే. ఇది ధీరాలక్షణముకాదు. మనుచరిత్రలో వరూధిని యేడ్చినట్లు పెద్దన వర్ణించెను గనుక రామరాజభూషణుడు కూడ యేడుపును వర్ణించుచు పద్యము వ్రాయవలచెను. గిరిక యేడువవలసినతావు మరెక్కడ తోచలేదు. అందువలన చంద్రాతపమునకు తాళజాలక యేడ్చెనని వర్ణించి ఉత్తమనాయిక కుండవలసినధీరలక్షణమును కవి విస్మరించెను. ఆశోకమును కాంభోజీరాగసమ్మిళితముచేసెను. ఏడుపుకూడా రాగసరళితో స్వరయుక్తముగ నుండునుకాబోలు. వరూధినియేడ్పులో రాగములేదు. స్వాభావికము.

విదూషకుడు

విదూషకుడు కడుసేర్పరి. యజమానునిమనోవృత్తి గుర్తెరింగినవాడు. సమయస్ఫూర్తి కలవాడు. కోలాహలమున వీణారవము వసురాజుచిత్తవృత్తి నేవిధముగ మార్చినదో కనిపెట్టి మునివేషధారియై గిరికావృత్తాంత మరసినసేర్పరి. వారిమధ్య కడుమెలకువతో మెలగి అనుమానమున కేమాత్రము తావిచ్చినవాడు కాడయ్యెను. ఆస్త్రీలుచేయు సంగీతశాస్త్రప్రశంసలో 'యతి' యను అక్షరసామ్యము సాధారముగగొని, వారిమధ్యకువచ్చి చమత్కారముగ మంజువాణిని ప్రశంసించి తనయందు వారికి భక్తికుదురునట్లు చేసికొనెను. వారి నెటుల ప్రశంసలోనికి దింపెనోచూడుడు:

ఉ. మేలు లతాంగి! నీపలుకు
మెచ్చితి నే యతివచ్చుజాడ యే
లీల నెఱింగితమ్మ బహు
ళీకృతిచాతురిమించు నీవిపం
చీలలితారవామృతము
చిత్తముసోఁకినవార లీకరా
ళాలిని జూచి దీవన లొ
సంగక పోవరుసుమ్ము వావుమున్.

తాను వారిని దీవించి శుభము చేకూర్చుటకు వచ్చినట్లు తెలియజేసి తనయందు వారికి పూజ్యభావము కలుగునట్లుచేసెను. చివరరెండుపాదములు వసురాజును మనసులోనుంచికొని పలికినమాటలు. వసురాజు వచ్చిన తరువాత తానువెళ్లి నిజరూపముతో మరల ప్రవేశించుట చాల సమంజసముగ నున్నది. అప్పుడు ఆరెండు పాదములయర్థము ఆస్త్రీలకు వ్యక్తమైనది. వసురాజునకు గిరికయందనురాగమేర్పడి నర్మసచివుని బంపినటుల వారికి వెల్లడియైనది. ఇది ప్రేమబీజమునకు మూలాధారము.

మంజువాణి

ఈమె గిరికచెలికత్తెలలో నుత్తమురాలు. మాయా మునికి గిరికవృత్తాంతము తెలియజేసిన చతురసంభాషిణి.

చ. అనుపమభాగ్యలక్షణసమన్విత
యీరమణీలలామ యీ
మనసిజరాజరాజ్యరమ
మానసవీథిఁ దలంప సింధుసం
దన యచలేంద్రనందన యనం
గననయ్యెడి నీలతాంగి పా
వనకులగోత్రభూమి చెలువా!
చెలువారఁగఁ జెప్పవే యనన్.

అని గిరికను జూపించుచు ముని యడుగ మంజువాణి చాతుర్యము మెరయ నిచ్చిన ప్రత్యుత్తరము గనుడు:

చ. అనుపమభాగ్యలక్షణస
మన్విత యీరమణీలలామ యీ
మనసిజరాజరాజ్యరమ
మానసవీథిఁ దలంప సింధుసం
దన యచలేంద్రనందన య
నం గననయ్యెడి నంచ నిట్లు చే
ర్కొనియును గ్రమ్మఱం దెలియఁ
గోరుట కారిమి పెంపునం గదా.

వసురాజవివేకముతో గిరికాదేవిని చూచుచుండ పకపకనవ్వి యేవిధముగ ప్రౌఢిమమీర ప్రత్యుత్తర మొసగినదో చూడుడు:

శా. మాయాశీలురు చంచలాత్ములనుకం
పాశూన్యులాలైక్యకా
ర్యాయత్తుల్ సమయానుకూలహృదయ
వ్యాపారగోపాయనో
పాయజ్ఞుల్ మగవార లాపయి మహీ
పాలు ర్మహోన్నైభవ
శ్రీయోగాంధులు చెప్పనేల మగవా
రిన్ నమ్మగావచ్చునే

ఈమె కార్యనిర్వాహణమున అత్యంతనిపుణురాలు. గిరికావసురాజులకు తాపోపశమనమును గావించునది.

అనౌచిత్యములు

రెండుమూడుచోటుల అనౌచిత్యములు కనబడుచున్నవి. వసురాజు పనుప విదూషకుడేగి రత్నఖచిత వాతాయనాంతర్భాగమున వీణవాయించుచున్న గిరికను పొద చాటుననుండి చూచి రాజున కావృత్తాంత మెరింగించ వచ్చెను. ఇంతవరకు బాగుగనేయున్నది. అటులువచ్చి తానొకసుందరస్త్రీని చూచివచ్చితినని చెప్పిన నెంత బాగుండెడిది! కాని కవి ఆవిధముగ తృప్తినొంది ఔచిత్యమును బాటింప దలచుకొనలేదు. విదూషకుని వాక్సహాయ మాలంబనముగ గొని గిరికావర్ణన ప్రారంభించెను. ఆవర్ణ[illegible]ఖాపర్యంతము ప్రత్యవయవవర్ణన. విదూషకు డీయవయవవర్ణన మెట్లుచేయగలిగెనా యని సందేహము కలుగకపోదు. ఆమెపాదముల పద్మరేఖలున్నటుల వీనికి దెలియుటెట్లు? ఆమె ఊరుప్రదేశము కటిభాగము జఘనము నాభి ఇవన్నియు నెట్లువర్ణింపగలిగెను? ఇది అసంభవము. మరియొక విశేషము. విదూషకుడేమిటి? రాజుతో ఈవిధముగ వర్ణనచేయుచు చెప్పుట యేమిటి? రాజునకు నర్మసఖుడేయగుగాక. వానికి భార్యకాబోవు యువతినా ఈవిధముగ వర్ణించుట! విదూషకు డావిధముగ వర్ణనపైవర్ణనలు గుప్పించుచుండ రాజు విని ఆనందించుచుండెనా? ఎంత అనౌచిత్యము! వసురాజంతవానికి భార్యకాబోవు గిరికాదేవి, ఉత్తమనాయిక, ఈవిధముగ మానహీనురాలగుట యేనా? ఆమెమానము, లజ్జ, సౌభాగ్యము, ఈవిధముగ తుచ్ఛవర్ణనపాలు చేయుటయేనా? నాయికను ఈవిధముగ దిగంబరగా బహిరంగపరచుటయే కావ్యలక్షణమా? ఇదంతయు వసురాజున కామె సుందరియని దృఢపరచుటకే కదా! అట్టిచో ఆమె చాల చక్కనిదని లావణ్యమును వర్ణించి వసురాజును దోడ్కొనివెళ్లిన నెంతయో యుచితముగనుండెడిది. చక్కదనమును వర్ణించుటకు నఖశిఖాపర్యంతము ప్రత్యవయవవర్ణన మవసరమా! మనుచరిత్రలో వరూధినిని పెద్దన యేవిధముగ ఒక్కపద్యములో వర్ణించినాడో చూడుడు:

మ. అతఁ డవ్వాతపరంపరాపరిమళ
వ్యాపారలీలన్ జనా

నీవిత మిచ్చోటని చేరంబోయి కవిరో
విద్యుల్లతావిగ్రహా
శతపత్రేక్షణా చంచరీకచికురా
చంద్రాస్యా చక్రస్తనీ
నతనాభీ నవలా నొకానొకదుచు
న్నాకీశకోరత్నముల్.

ఇక్కడ కవియే స్వయముగ వర్ణించుచున్నాడు. విదూషకుడు రాజుతో చెప్పుచున్నట్టుల ఇక్కడ వరూధిని సౌందర్యమనుకరించి ఒకరితో మరియొకరు చెప్పుటలేదు. పెద్దన చేతలనలచుకొన్న యెడల నఖశిఖా పర్యంతము వర్ణనచేయుటకు వీలున్నది. కాని అట్లుచేయ లేదు. ఈయొక్కపద్యముతోనే వరూధిని మహాసౌందర్య వతియని స్పష్టపరిచెను. కావలసిన దంతయే. అంతకన్న మిక్కిలి అనవసరము. రామరాజభూషణునిదృష్టి సభ్యత్వాసభ్యత్వవివేచనమీద లేదు. గిరికను వర్ణించ సంకల్పించుకొనెను. ఆసంకల్పములో అక్కడ విదూషకుడు రాజుతో ప్రసంగించుచుండె ననువిషయము విస్మరించెను. కవిదృక్పథమున విదూషకుడుగాని రాజు గాని లేరు. ఒక్కగిరికాస్వరూపమే ప్రత్యక్షమగు చుండెను. తన మనోదృష్టి ఆస్వరూపముమీదనే ఏకధ్యానముతో నిలిపి ఆమెను దిగంబరరూపిణిగాకూడ నూహించి తుచ్ఛవర్ణన చేసెను.

గిరికాదేవిమీద వసురాజున కేమాత్ర మనురాగ మున్నదో కనుగొనివచ్చుటకై మంజువాణి వెళ్లి రాజిచ్చిన అంగుళీయకము తీసికొని తిరిగివచ్చెను. మంజువాణి వచ్చుటకు ఆలస్యమైనదని గిరిక చెలికత్తెలు అత్యంతాతుర ముతో నెదురుచూచుచుండిరి. వృత్తాంత మారయ మహోత్కంఠతో నుండిరి. మంజువాణి దృగ్గోచరము కావడ ముతో ఆతురత హెచ్చుట సహజము. సమాచార మేవిధముగనుండునోయని మనసులో ఆందోళన. ఇట్టి స్థితిలో గిరికయు ఆమె చెలికత్తెలుకూడ నుండిరి. ఎట్టె వేళకు మంజువాణివచ్చినది. రావడముతోనే తనకార్యఫల సంసిద్ధినుగురించి ఒకటిరెండుమాటలలో చెప్పినదా? లేదు. శ్లేషవర్ణనలతో పెద్దకథ మొదలుపెట్టినది. తన ఆకాశ గమనము, దృక్ప్రదర్శనములు, మార్గాయాసమునే విశ్రాంతి గొనుట, పురప్రవేశవిధానము, నగరవర్ణనము, హర్మ్యశిఖల అంచచందములు, కోటలు, అగడ్తలు, బురుజులు, అటునిటు తారాడు విటసముదాయవర్ణనలు, ఇవి యివి యనరేల — లెక్కలేనన్ని చెప్పినది. తాను రాజాంతః పురప్రవేశ మొనర్చినతరువాత యెంతవర్ణన చేసినది? దేవతాస్త్రీల హాస్యప్రసంగములు వర్ణించినది. తరువాత అక్కడనున్న రాజమందిరవర్ణన ప్రారంభించినది. రత్న మణిమయధామశోభశ్యముచే తా నేవిధముగ విభ్రాంతికిలో నైనదియు వర్ణించినది. ఈవర్ణనము లన్నియు దేనికి? ఆ సమయమునగిరికాహృదయము ఈవర్ణనలకొరకు తహతహ లాడుచుండెనా? ఆమె కప్పుడు కావలసినదిఒక్కటేమాట. వసురాజు తనయం దనురక్తుడైయుండె ననువిషయము: కాని, ఆవిషయము ఈవర్ణనలన్నియు పూర్తియైనతరు వాతగాని తెలియదు. రుక్మిణిచే కృష్ణునియొద్దకు పంప బడిన అగ్నిద్యోతనుడు తిరిగివచ్చి తనకొరకై యెదురు చూచుచున్న రుక్మిణికి ప్రథమముననే తెలిపినవృత్తాంత మెంత యుచితముగా నున్నది! తనమార్గాయాసవర్ణనలు, ద్వారకానగరవర్ణనలు, కృష్ణమందిరవర్ణనలు, కృష్ణుని వర్ణనలు మొదలగువానితో రుక్మిణి హృదయాందోళనము ను హెచ్చుచేయలేదు. అప్పుడు రుక్మిణికి కావలసినవి అవి కావు. కృష్ణుడువచ్చెనా! లేదా! అను సందేహనివృత్తియే. ఆ సందేహనివృత్తికొరకే పోతనమహాకవి "మెచ్చె" "వచ్చె" అను రమ్యమై హృదయతాపనివారణ శక్తి యుతములగు రెండు దివ్యపదములను ప్రయోగించెను. మొదటిపదముతో హృదయము కుదుటబడెను. రెండవ దానితో మహానందమొందెను. ఆపద్యమునే ఉదాహ రించిన అందుగల సారస్యము తెలియును. చూడుడు:

ఉ. మెచ్చె భవద్గుణోన్నతి
కమేయధనావళు లిచ్చె నాకు దా
వచ్చె సుదర్శనాయుధుడు
వాడె సురాసురులెల్ల నడ్డమై
వచ్చిననైన రాక్షసవివా
హమునం గొనిపోవు నిన్ను నీ
సచ్చరితంబు భాగ్యమును
సర్వము నేడు ఫలించె గన్యకా!

గిరికాదేవి వర్ణనచేయుతలంపున ఏవిధముగ అసభ్యమార్గమున పడిరోనో ఇక్కడకూడ కవి అదేమార్గ

మాలంబించెను. కవిసృష్టిలో గిరికకాని ఆమెచెలికత్తెలు కాని మంజువాణికాని లేరు. తా నేరంగమున నున్నది కూడ విస్మరించెను. ఇక కవి దృక్పథమున నున్నవి మంజువాణి ఆకాశగమనము, వసురాజునగరము, ఆతని అంతఃపురము; ఆ వర్ణనలన్నియు పూర్తియైనతరువాతగాని ప్రస్తుతరంగము స్మరణకురాలేదు. అప్పుడు రాజుయొక్క అనురాగమును బయటపెట్టెను. మంజువాణి ప్రథమముననే గిరికమీద రాజునకున్న అనురాగమును తెలియజెప్పి ఆపైన వినోదార్థముగ పైవిషయములన్నియు వర్ణించిన నెంతయో బాగుండెడిది. అప్పుడటులు వర్ణించుటకూడ ఔచిత్యముగ నుండెడిది. పోనీ వసురాజిచ్చిన అంగుళీయకముమూలముననైన ప్రథమమున గిరికకు వసురాజానురాగము స్ఫురింపజేసినదేమోయన అటులకూడ కనబడుట లేదు. వచ్చుటతోడనే మంజువాణి అంగుళీయకమును గిరికయెదుట పెట్టినట్లుమాత్రము కవి చెప్పెను. అంగుళీయకమువసురాజుదని పాఠకులకును మంజువాణికినిమాత్రము తెలియునుగాని గిరికకుగాని ఆమెచెలికత్తెకుగాని తెలియదు. మంజువాణి తనవృత్తాంతమంతయు ముగించిన పిదప అంగుళీయకమును దీసి గిరికచేతి కిచ్చినటులున్నది. అప్పుడు దానిమీదనున్న వసునామము చూచి గిరిక సంభ్రమ మొందెను. అంతవరకు దానిని గిరిక చూచినట్లే లేదు.

వసురాజు కోలాహలుని గోటమీటి అవమానపరిచెను. తనకు పాదాక్రాంతునిగా జేసికొనెను. ఈవిషయము మరలమరల కావ్యమును ప్రశంసచేయుట అనుచితముగ కనబడుచున్నది. కోలాహలుడు రాజునకు మామగారు కాబోవుచున్నాడు. అట్టిసమయములోగూడ ఈ బిరుదును వసురాజునకు వాడుట సమంజసముగా లేదు. గిరిక గంగకు మొక్కి "చరణాక్రాంతమితాచలేశ్వరుని" చేపట్టుమని దీవించినది. "చరణాక్రాంతమితాచలేంద్రుడైన" వసురాజునకు నీకుమార్తె నీయుమని ఇంద్రుడు కోలాహలుని అడిగెను. ఈరెండుచోటులను శ్లేష ననుసరించి పాదాక్రాంతులైనశత్రురాజులుగలవసురాజని యర్థము. చేసికొని తృప్తివహించుదమనుకొన్న మహేంద్రుడు మరల కోలాహలునితో నేమనుచున్నాడో చూడుడు: "చేదిక్ష్మావరపాదకంజకృతిఖండీభావముల్ రెండు నీక్షోదం భాగ్యగగలై నీకేలయ" 'గోరుమట్టుపై కొట్టిపోటును నట్లు పరిభవానలసంతప్తుడైనవానికి దత్కారణవిషయ ప్రశంస మరలమరల చేయుట భావ్యముకాదు. బాంధవ్య సందర్భమున ఇది విస్మరింపవలసినవిషయము. వసురాజునకు కోలాహలుడు పూజ్యుడు కాబోవుతరుణమున ఈవిషయప్రశంసచేయుట అనుచితము. గిరిక మనసు ఎంతనొచ్చుకొనునో కవి కనిపెట్టలేదు. తనజనకుని అవమానమునకును సంతాపమునకును కారణభూతుడైన వసురాజునా తానుచేపట్టబోవుట! అందులో దన్ను ఆశీర్వదించువారు 'నీతండ్రిని అవమానపరిచినవానిని వివాహమాడు'మని దీవించుచుండ ఇంతకంటె హృదయవిదారణము పాప మాగిరికకేమియుండును? గిరికకీవిషయమే తెలియకుండజేసిన నెంతయో బాగుండెడిది. అటులుకాక తత్సంబంధమైన బిరుదావళితో వసురాజును పెండ్లికొడుకుగా నిర్ణయించుట చాలఅనుచితముగ నున్నది.

శ్లేషవిమర్శ

వసుచరిత్ర శ్లేషకావ్యము. కావ్యమంతయు శ్లేషగా రచియింపవలయునని ప్రతిజ్ఞపూని వ్రాసినట్లు కనబడుచున్నది. అందువలన అవసరానవసరములుగాని ఉచితానుచితములుగాని కవి పాటింపలేదు. ఒకచోటమాత్రము శ్లేష అవసరమై మనోహరముగ నున్నది. విదూషకుడు మునివేషధారియై గిరికావృత్తాంతమరయుసందర్భమున తనవృత్తాంతమును శ్లేషతో వివరించెను. ప్రతివిషయము సూర్యపరముగాను రాజుపరముగాను అన్వయించునట్లు తనచరిత్రము అసత్యప్రమాదమునకు లోనుగాకుండునట్లు చేసెను. విదూషకుడు అసత్యప్రలాపియను నభిప్రాయము పాఠకులకు కలుగకుండునట్లును గిరికమొదలైనవారి కతడు నిజమైన ఋషియేయని నమ్మకము జనించునట్లును శ్లేషసాహాయ్యమున కవి ఈఘట్టమును రమ్యముగ పోషించెను. కావ్యమున మిగిలిన శ్లేషయంతయు అనవసరము. కొన్నిచోట్ల అనుచితము. ఈశ్లేషమాహాత్మ్యమువలన కవిసృష్టిలో గిరికాదేవి ఒకప్పుడు కొండగాను ఒకప్పుడు నదిగాను ఒకప్పుడు అరణ్యముగాను ఒకప్పుడు రాష్ట్రముగాను వివిధరూపములుగ మారిపోయినది. శ్లేషకొరకై కుక్షిమతిని కుటిలగామినిగాను హేయస్వరూపిణినిగాను వర్ణించవలసివచ్చినది,

గిరికాదేవిని సైతము కుటిలవృత్తికలదానినిగా వర్ణించ వలసివచ్చెను. వసురాజువిరహవేదనలో గిరికాచిత్రఫలకమును వీక్షించుచు ఏమనుచున్నాడో చూడుడు:

ఆ. కురులనిగుణ మరో జగిరులు గాంచినఁగాంచుఁ
గాక నీమనంబు గాంచ నేల?
తల్లికుటిలవృత్తి తగుఁగాక కులులకు
నింత నీదుచెయ్వు లెనయ నేల?

గిరికతల్లి శుక్తిమతి కుటిలగామినిగనుక — అనగా వంకరటింకరగ ప్రవహించునది గనుక — అదిసామ్యముగ గొని గిరికకురులు ఆవిధముగ మెలికలుతిరిగినవని చెప్పుచు ఆకుటిలత్వమును ఆమెప్రవర్తనకు గూడ ఆరోపించెను. కుటిలత్వము నీకురులకుండినమండు గాక నీనుచేష్టలుకూడ అట్టికుటిలత్వము నేల పొందవలయునని వసురాజు తల పోయుట గిరికాదేవిప్రవర్తన కల్మషపూరితమని ధ్వనించుచున్నది. ప్రియురాలు అనర్హప్రవర్తకురాలైన ప్రియుని హృదయ మేవిధముగ పరితాపమునొందునో వసురాజావిధముగ పరితపించుట చాల అనుచితము. కవిశ్లేష వ్యామోహమున నిమగ్నుడై ఈవిషయములను గమనింపకుండుట విచారకరము.

శబ్దవైచిత్ర్యము

కవి శబ్దప్రయోగము ధారాళము. నడక సొంపుగ నుండును. ఒకటిరెండుపద్యము లుదాహరించెదను:

సీ. తలిరుఁ బ్రాయమువాని నలరాజు నలరాజు
నల రాజుఁ దెగడు సోయగమువాని
పసిఁడిచాయలవానిఁ బగడంబు జగడంబు
జగడంబుగలమోవి సొగసువాని
తళుకుఁజెక్కులవానిఁ దులకింపు పలుకింపు
పలుకింపులోలయు నవ్వులుతువాని
చికిలిమాపులవాని సిరిమించుకొరయించు
దొరయించు కాంచనాంబరమువాని
నొంపుగలవాని మకుటకేయూరహార
కటకకుండలచాకచక్యములవాని
నమ్మహీజానిఁ గని లేచి యమితవినయ
సంభ్రమము తోప నిలిచి రక్షాతముఖులు.

సీ. ఈరాలఁబోరాడు హీరాళము జవాది
యీరాలవడుచక్కి సేగవలయు
నాకాన నేకాల మడుఁ దేనియవాన
లాకాన నేర్పున వరుగవలయు
నీవంక నేవంక నెనసినతుహినాంబు
లీవంకఁ బూఁదెప్ప నీఁదవలయు
నామూల ననమూలరామ తమలచయ
లామూలముగఁ దీవ లంటవలయుఁ
అధిప యదిమానికపుఁగోవ యది లతాంత
రజము సారుప యదికప్పురంపుటనఁటి
చప్పరంబులు యదికాంతి సదన మనుచు
వరపతికిఁ జెప్పె నయగుటో నర్మసఖుడు.

క. ఏమందు నేమి సేయుద
మేమందని మంద్రలింత మేమందమెయిం
దేమందయాన వదుగుద
మేమందర మనుచుఁ దరళహృదయాంబుజలై.

కాని ఈపద్యములలో సహజమాధుర్యము లేదు. పదాడంబరము పదములసొందికమాత్రము కలదు. పదములు భావమును మరుగుపరచుచున్నవి. భావము పరిస్ఫుటముగ నున్న ఈపద్యము గనుడు:

శా. ఏమే హేమలతా యటంచుఁ
బనియేమే మాధవీ యంచు నీ
భామామన్మథుచంద మెట్లనుచుఁ జై
త్రుంబాల భూపాలుఁడా
రామక్షోణికిఁ జన్నవాఁడుగాలె ని
ద్రాసౌఖ్యముల్ మానినాఁ
డేమోయంచు వచింప వింటిఁ దమలో
నేకాంత వీలాగతిన్.

ఉత్ప్రేక్షా వర్ణనలు

కవి ఉత్ప్రేక్షాశక్తిఅత్యద్భుతము; నిరవధికము; వర్ణనాతీతము. స్వల్పవిషయములను వర్ణించునప్పుడు సైతము ఎంతయో భావము నుద్దీపింపజేయును. అతీత ప్రతిభావిశేషము ప్రతిపద్యమునను వెల్లడియగుచుండును. ఈ క్రిందిపద్యములు చూడుడు:

మ. అలినీలాలక! కంటె చిల్కఁ భటి
యాలాపలీలాస్థి నిం

పలరం గోరి విపక్వదాడిమఫల
వ్యాలంబి శాఖాఫల
జ్వాలనావాఙ్ముఖమై తపంబుసవరిం
పఁగాఁ సాగె నే లబ్బెడిం
దల్రికిందైన ననూనవాగ్గ్రహణమే
ధాళక్తి బింబాళికిన్.

శా. నానానూనవితానవాసనల నా
నందించుసారంగమే
లానన్నెల్లఁ దటంపు గంధఫలి బ
ల్కాఁకం దపంబంది యో
షానాసాకృతిఁ బూని సర్వసుమన
స్సౌరభ్యసంవాసమై
పూనెం బ్రేక్షణమాలికా మధుకరీ
పుంజంబు నిర్వంకలన్.

ప్రకృతి వర్ణనాసామర్థ్య మీ పద్యములలో చూడుడు:

మ. నటదీశానశిర స్తటత్రుటితర
త్నచ్ఛాయఁ గల్లోలినీ
విటమగ్నంబున బ్రాలె నభ్రమణి త
ద్వేగాభిపాతోన్నమ
త్పటుపాథోలవతార ధార లెగసెన్
దద్బిందుసంధానితో
త్కటసంధ్యానలధూమకందళములై
కన్పట్టెఁ గ్రొంజీఁకటుల్.

మ. అరవిందోదరమూర్తి భానుఁ డపు డా
ష్మాంతంబుగా సంఘచ
త్వరనీజేక్షణుఁడై పయోనిధిఁ జొరన్
సంధ్యాతటిత్పూర్వమై
చెరసెం జీఁకటికార్మొగుల్ జగతిపై
నిబ్బోన్నతాభోగముల్
పఁగావించుచు సర్వతోముఖమహా
సారప్రసారంబులన్.

శా. తారాసస్యము పండెనన్ గగనకే
దారంబునం జంద్రికా
నీరం బారఁగఁ గోసి తద్రుచిఫలా
నీకంబు ప్రాతర్మహా
సీరిగ్రామణి తూరుపెత్తెనవఁ దోఁ
చెం దూర్పునం దెల్ప ద
ద్దూరన్యస్తపలాలరాశిక్రియ నిం
దుం డేఁగె నిస్సారుఁడై.

ప్రేమమహత్త్వము

జంధ్యాల శివన్నశాస్త్రి గారు

ఇద్దరిసి నేను నద్దరి నీవు నడుమ
మనకపార పారావార మెనయుచుండె
నిన్నుఁగలియుట పొంకె నాచిన్నినావ
వదలితిని నాకొకింతయు భయములేదు.

౨. భయపరిధి కుంచితము ప్రేమపరిధి విస్తృ
తము నగుట నద్ది యిందులో నిమిడిపోవు
సూక్ష్మదర్శిని ధరియించి చూచ దృశ్య
వస్తువది వేఱురీతిఁ గన్పడినయట్లు
ప్రేమయను దివ్యదృష్టికి వివిధవస్తు
తతియు స్వర్గీయరూపమ్ము దాల్చుచుండు
విశ్వసందర్శనమ్మున భీతి యడఁగు.

౩. నడచుచున్నది ముందుకు నాదునావ
పెద్దయోడల నేన్ ముంచివేయునట్టి
తరఁగలే నాదునావ భద్రముగఁ ద్రోసి
కొనుచు ముందుకుఁబో ననుక్షణము నేను
దూరమును బాసి నీదరిఁ జేరుచుంటి.

భగవదజ్జుకము

ప్రహసనము

వేటూరి ప్రభాకరశాస్త్రి గారు

[గతసంచిక తరువాయి]

(యమపురుషుఁడు ప్రవేశించి)

యమ—ఓహో!

మ. జ్వర గర్భస్రవ కర్ణశూల పిటక
శ్వాసక్షయాక్షి వ్యథో,
దరగుల్మాది విశేషభీషణరుజా
తంకమ్ముచే, నింక దు,
ర్భరసంక్షోభచయమ్ముచేత, బహుజీ
వవ్రాతముక్షా నేనహో,
ధరణిం బాచితి, నింతలో, యమపుర
ద్వారమ్మునం ద్రోచితిన్.

ఇదిగో! మఱియు నేనింతలో స్వాములవారి యనుజ్ఞను పొందుదును. (వేశ్యను చేరఁబోయి) స్వామీ! వృషలీశరీరమును విడువఁ గోరుచున్నాను.

గణి—అట్లే విడుచుచున్నాను.

యమ—వేశ్యాప్రాణములను యథాస్థానమున కుమార్చి నేనును నాపని మీఁదఁ బోయెదను.

(అట్లుచేసి నిష్క్రమించును)

పరి—శాండిల్యా! శాండిల్యా!

శాండి—ఇదుగో! స్వాములవారు మామూలు స్థితికి వచ్చారు!

గణి—పరభృతికా! పరభృతికా!

చేటి—ఇదుగో! ఇప్పుడు అజ్జుక మామూలు మాదిరిగా పిలుస్తున్నది!

మాత—అమ్మా, వసంతసేనా!

రామి—ఆహా, నా ప్రియురాలు వసంతసేన ఇపుడు తెప్పరిల్లి తేఱుకొన్నది!

(గణిక, రామిలకుఁడు, చేటికలు, తల్లి, వెళ్లుదురు)

శాండి—స్వామీ! ఏమిది!?

పరి—ఈకథ మిక్కిలి పెద్దది. మఠమునకరిగిన వెనుకఁ దెలిపెదను. (దిక్కులుచూచి) అహస్సెల్లఁ గడచినది. ఇప్పుడు:

గీ. అస్తమిలుచుండె రవి యదే యపరదిశను
మూసఁగ్రాఁగిన బంగారుముద్దవోలె;
తత్ప్రభలవెల్గు మేఘబృందములచే, న
భమ్ము కోఁచెడు నగ్నిగర్భమ్మువోలె.

(నిష్క్రమించిరి.)

గీ. జగతి కెల్ల మేలు సమకూరుఁగా, కన్య
హితము భూతగణము వెతకుఁగాక!
తొలఁగిపోవుఁగాక దోషమ్ము లెందును
జనుల కెపుడు సుఖము జరుగుఁగాక!

తోడిమ

భగవదజ్జుక ప్రహసనపుష్పమున పరిమళము గానువారీ తోడిమతో దానిం బరిగ్రహింతురు గాక!

గ్రంథకర్త

భగవదజ్జుకమని పేరుగల యీ ప్రహసనమునకుం గర్తయెవ్వరో గుర్తించుటకు మూల గ్రంథమున నాధారము గానరాదు. కాని దాని వ్యాఖ్యాత (పూర్ణసరస్వతి కావచ్చును. ఈయన మేఘసందేశమాలతీమాధవాదులకును వ్యాఖ్యాత.) మూలగ్రంథకర్త బోధాయనుండని పేర్కొన్నాఁడు. వ్యాఖ్యారంభమున,—

శ్లో. బోధాయనకవిరచితే
విఖ్యాతే భగవదజ్జుకాభిహితే,
అభినేయేఽతిగభీరే
విశదా సభునా కరోమి గ్రంథార్థాన్.

అంతమున,

శ్లో. ఇతి ప్రహసనాభిఖ్యే
పూర్వనాట్య నిబంధనే,
హాస్యగ్రాహిత తత్త్వార్థే
టీకా దిక్తత్త్వదర్శినీ.

శ్లో. యశ్చాసౌ భవభూతి సూక్తి జలధే
రర్థౌఘ యాదోగణ
ప్రత్యో భోత్థితభీతిభంజనకరీం
వ్యాఖ్యాతరీం నిర్మమే;
తేనేయం విషమేతివృత్తగహనే
బౌధాయనీయే పున
ర్నాట్యే గర్భితశాస్త్ర జృంభితే వచో
గంభీరగుంఫే కృతా.

ఒక మూలగ్రంథము ప్రతిలో నిదికలదు:

శ్లో. బోధాయనకవిరచితం
బోధాయతనం విముక్తిశాస్త్రాణామ్;
ప్రహసనరత్నం ప్రత్నం
భవతు ముదే భగవదజ్జుకీయం వః.

వరరుచి పాణిన్యాదు లగు మునులు కొందఱు శాస్త్రకారులేకాక కావ్యకర్తలు గూడ నయియుండిరి. వారినిం బ్రాచీనకవులు కవులనుగా స్తుతించిరి. వారి గ్రంథములనుండి కొన్ని శ్లోకములనుగూడం బ్రాచీనాలంకారికు లలంకారగ్రంథములం దుదాహరించిరి. వారి గ్రంథములును గొన్ని యిప్పుడు దొరకి యున్నవి. బోధాయనమహర్షి కూడ నట్లు కావ్యకర్తయై యుండవచ్చును. మహర్షి యగు బోధాయనుం డిట్టి ప్రహసనము రచించెననుట ప్రత్యయితవ్యము గాదని కొందఱందురు. వరరుచిరచియించిన యుభయాభిసారికను వా రెఱయఁదగుదురు. శ్యామిలకుఁడు పాదతాడితకమం దిట్లు చెప్పినాఁడు:

శ్లో. న ప్రాప్నువంతి యతయో రుదితేన మోక్షం
స్వర్గాయతిం న పరిహాసకథా రుణద్ధి;
తస్మాత్ప్రతీత మనసా హసితవ్యమేవ
వృత్తిం బుధేన ఖలు కౌరుకుచీం(?) విహాయ.

(యతులై యేడ్చుచుం గూర్చున్నందువలన మోక్షమురాదు. పరిహాసకథ స్వర్గలాభమును జెడఁగొట్టదు. ప్రాజ్ఞుఁడు కచకుచాదులపై నభిరుచిని జెందరాదు గాని హసించుచునే యుండవలెను.)

శ్రీ రామానుజులవారు తమ బ్రహ్మసూత్రభాష్యమునకు మూలకల్పమని పేర్కొన్న బ్రహ్మసూత్రవృత్తిని (ఇది యిప్పుడు కానరాదు.) రచించిన బోధాయన మహర్షియు, గృహ్యసూత్రాదికర్తయగు బోధాయనమహర్షియు (ఇద్దఱు నొక్కరగుదురో కారో!) మనకెఱుక కందియున్నారు. విష్ణుపారమ్యమును, ప్రపత్తి ప్రాధాన్యమును, జెప్పు రామానుజమతమునకు మూలాధారమయిన యీ బ్రహ్మసూత్రవృత్తిని రచించిన బోధాయనుఁడీ ప్రహసనకర్తయగు ననుట యొప్పిదముగా నాకుఁదోఁపదు. ఈ ప్రహసనమున "త్వాం పాతు...రుద్రస్య సదర్చితః పాదః" అని నాంది యున్నది; యోగదర్శనమునకుఁ బ్రాముఖ్యము ప్రతిపాదితమయినది; విశిష్టాద్వైత సిద్ధాంత వాసనకూడఁ గానరాదు. కల్పసూత్రకారుఁడుగూడ నీ గ్రంథకారుఁడుగాఁగూడదనియే నా తలఁపు. ఆయన ప్రతిపాదించు శాంతికపౌష్టిక శ్రౌతకర్మ ప్రాధాన్య మిందుఁ గానరాదు.

ప్రాచీనకవులు కొందఱు బోధాయనునిఁ గూడఁ గవిగాఁ బ్రస్తుతించిరి. రఘువీరచరిత మను నాటకమును రచించిన సుకుమారకవి తననాటకప్రస్తావనలోను,

శ్లో. యైర్బోధాయనసూక్తిపుష్పకలికాః
కర్ణావతంసీకృతా
యేషాం బిల్హణసూక్తిమౌక్తికసరాః
కంఠానలంకుర్వతే
మాధుర్యైకభువాం మురారివచసా
మాస్వాదితై స్స్వాదిమా
సంతుష్యంతి త ఏవ నూతనసుధా
వేణీషు వాణీషు నః.

నాసికేతోపాఖ్యానమురచియించిన దగ్గుబల్లి దుగ్గనకవి (శ్రీనాథుని బావమఱఁది) గ్రంథావతరణికలోను,

"సీ. ప్రణుతింతుఁ బన్నగరాజ వాల్మీకి స
త్యవతీతనూజ బోధాయనులను
ప్రార్థింతు దిఙ్నాగ రాజశేఖర కాళి
దాస సౌమిల్లిక భాసకులను."

అని వినుతించిరి. ఈబోధాయనుఁడు బ్రహ్మసూత్రవృత్తికారుఁడును గల్పసూత్రాదికారుఁడునుగాక వేఱొకఁడేనిఁ గావచ్చును.

గ్రంథప్రాచీనత

సర్వజ్ఞ సింగభూపాలుఁడు రసార్ణవసుధాకరమున నీభగవదజ్జుకప్రహసనమును బేర్కొన్నాఁడు.* సర్వజ్ఞ సింగభూపతి పదునాల్గవ శతాబ్దివాఁడుగావున నీగ్రంథమంతకుఁ బ్రాచీనమనుట యొక విశేషముగాదు. క్రీ.శ.600 లో నున్న మహేంద్రవిక్రమవర్మ యను పల్లవరాజు చెక్కించిన మామండూరు శిలాశాసనమున నీభగవదజ్జుకము పేరున్నది. ఆగొప్ప శిలాశాసన మిప్పుడు శిథిలమై యక్కడక్కడ కొంతకొంతమాత్రమే చదువఁదగినదిగా నున్నది. ♦

* శుద్ధం కీర్ణం వైకృతం చ తచ్చ ప్రహసనం త్రిధా; శుద్ధం శ్రోత్రియశాఖాదేర్వేషభాషాది సంయుతమ్. చేటచేటీజనవ్యాప్తం తల్లక్ష్యం తు నిరూప్యతామ్; అనంకకోశప్రముఖం తథా భగవదజ్జుకమ్, కీర్ణం తు సర్వైర్వీథ్యంగై స్సంకీర్ణం ధూర్తసంకులమ్, తస్యోదాహరణం జ్ఞేయం బృహత్సౌభద్రకాదికమ్. యచ్చేదం కాముకాదీనాం వేషభాషాది సంగతైః, షండతాపసవృద్ధాద్యైర్యుతం తద్వైకృతం భవేత్, కలికేలిప్రహసనప్రముఖం తదుదాహృతమ్. ఈశ్లోకము లిటీవల వసంతశేయనగ్రంథమాలలో ముద్రితమయిన నాగరీలిపి గ్రంథమందు చేరలేదు. పూర్వము శ్రీ వేంకటగిరి రాజాగారిచే ముద్రితమైన తెలుఁగులిపి గ్రంథమందుఁ గలవు.

♦ సౌత్ ఇండియన్ ఇన్‌స్క్రిప్షన్సు వాల్యూము IV చూ.

ఈమహేంద్రవిక్రమవర్మ విద్యావిశారదుఁడు. కిరాతార్జునీయకారుఁడగు భారవికవి యాయన యాస్థానమున నుండెను.* ఈరాజు స్వయము మత్తవిలాసమని యొక ప్రహసనమునుగూడ రచియించినాఁడు. అది యీనడుమ దొరకినది. ముద్రితమైనది. శిలాశాసనమున దానిపేరుగూడఁ గలదు. మత్తవిలాసముతోపాటు దీనిఁగూడ నామహేంద్రవిక్రమవర్మయే రచించియుండవచ్చునేమో యని యూహించుటకు, వ్యాఖ్యాత బోధాయన కృతనుట, యితరకవులు బోధాయనుఁ గవినిగాఁ బ్రస్తుతించుట, వేఱొకబోధాయనకవికృతి యెఱుఁగరాకుండుట, కొంత బాధకమయినను, నా రెండు ప్రహసనములందును రచనాసామ్యముండుట కొంతసాధక మగుచున్నది. భగవదజ్జుకము పరిహసించునట్లు మత్తవిలాసముగూడ బౌద్ధమతమును బరిహసించుచున్నది. భగవదజ్జుక మందున్న వాక్యములే కొన్ని మత్తవిలాసమందు నున్నవి కాని మత్తవిలాసము భగవదజ్జుకమంత ప్రౌఢముగా లేదు. ప్రాచీనమగు భగవదజ్జుకమును మహేంద్రవిక్రమవర్మ మత్తవిలాసమం దనుకరించెనేమో! మామండూరు శాసనము స్పష్టముగా గుర్తింపఁదగియుండెనేని యనుమానములకు సహోహములకు నవకాశము లేకుండెడిది.

కర్త బోధాయనుఁడో, మహేంద్రవిక్రమవర్మయో, మఱొకఁడో యెవ్వరయినను, క్రీ. శ. 600 కుఁ దర్వాతివాఁడుమాత్రము కాఁడని మామండూరుశాసన మిప్పుడుగూడఁ జేరత్తి చెప్పుచున్నది.

గ్రంథార్థము

ప్రహసనమనఁగానే పాఠకులు సాధారణముగా మన తెనుఁగుదేశమునఁ బ్రకటితమైయున్న లంబోదర ప్రహసనమును స్మరించి దానివలె నిదికూడఁ దుచ్ఛమును జుగుప్సితమును నగు బండుబూతుపరిహాసముతో నిండియుండునని రోఁతచెందుదు రేమోయని భీతిచెందుచున్నాను. ఇదియట్టిదిగాదు. ఇందుఁ గల హాస్యము విందుగూర్చునది. ఆహాస్యముగూడ నాపాతహృద్యమే కాక యాలోచనామృతమునై యధ్యాత్మతత్త్వబోధక మగుచున్నది. హాస్యచ్ఛలమున నధ్యాత్మతత్త్వమును బోధించుటలోఁ గవి యసాధారణచాతుర్యమును జూపినాఁడు. వ్యాఖ్యాత యీప్రహసనమునఁ బ్రత్యక్షరము యోగదర్శనపరముగా నంతరార్థముఁ జెప్పుచు వ్యాఖ్య రచించినాఁడు. ఆయన చెప్పిన యంతరార్థము తీ రిట్టిది:—

శ్లో. అస్మిన్ నాట్యరసే నిసర్గహసనే
యోగీంద్రశిష్యా శుభా
వాత్మా నా పరజీవభేదకథితా,
వన్యా తథై వాజ్జుకా;
మూలాధారసముద్గతా నసుషిరా
నాడీ సుషుమ్నా, పరే
చేట్యా-చోభయ పార్శ్వగే ససుషిరే
నాడ్యా విడాపింగళే.

శ్లో. అవిద్యా గణికా మాతా మోహో
రామిలకో మతః, వైద్యోహి కల్ప
సంకల్పో కాలస్తు యమ పూరుషః.
ఏవం ప్రేతూపమయం యోగం, యుంజ

* దండిరచిత మగు అవంతిసుందరీకథాసారమునఁ జూడఁదగును. ఈగ్రంథమును శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు ప్రచురించుచున్నారు.

స్న ర్త్తికతాపసః, ప్రత్యంచ మచ్యుతం
సద్య స్సాక్షాత్కృత్య సుఖీ భవేత్.

వ్యంగ్యమయిన యీయంతరార్థముమాట యెట్లున్నను వాచ్యమయిన బాహ్యార్థమందే బహుధర్మము లిందుఁ బ్రతిపాదితము లయినవి: ఫలాభిసంధిలేక చేయుకర్మము బంధకముగామి, అంతరాత్మ కర్మాత్మల (పరమాత్మ జీవాత్మ) విభేదము, భోగాస్థైర్యము, ప్రామాణ్య పరిజ్ఞానము, అధ్యయనావశ్యకత, సంగరాహిత్యము, యోగప్రశంస, స్వధర్మజిజ్ఞాస, పరధర్మజిహాస, మొదలగునవి.

పయిఁ జేర్కొన్నవానికంటె నీ ప్రహసనమున నింకొక పరమప్రయోజనముగలదు. క్రీ. యేడవశతాబ్దికిఁ బూర్వకాలమున భరతఖండమున బౌద్ధమతమునకుఁ బ్రాభవము హెచ్చుగానుండెను. ప్రత్యక్షానుమానములను మాత్రమే ప్రమాణముగానంగీకరించుచుభూతదయనే పరమార్థముగాఁ జెప్పుచునున్న బౌద్ధసిద్ధాంతములు తేటగా లోకమునఁ బాటికెక్కుచుండెను. శబ్దమునుగూడఁ బ్రమాణముగా నంగీకరించి యప్రత్యక్షవిషయముల నందుండి సాధించుచున్న దర్శనమతముల కప్పుడు తల్లువచ్చెను. ఇప్పటి కేఁబదియేండ్లకుముందు క్రీస్తుమతమువారి బోధలు, చర్చలు మొదలగునవి భారతీయుల కెంతవలపుగొలుపునవిగా నుండి యెంతవ్యాప్తి చెందెనో, యాకాలమున బుద్ధమతమువారిబోధలు, స్తూపములు సంఘములుగూడ, నంతవలపు గొలుపునవిగా నుండి యంతవ్యాప్తి చెందెను. బౌద్ధమతమును నిర్మూలించుటకయి యాస్తికులనఁ బరగిన వైదికమతములవా రప్పుడు బహుగ్రంథముల రచించిరి; శబ్దప్రమాణ మంగీకరింపని వారిని నాస్తికులని గర్హించిరి; తర్కములందు దించి యోడించిరి. యేమిచేసినను నెనిమిదవ శతాబ్దిలో శంకరు లుదయించి యద్వైతసిద్ధాంతమును రాద్ధాంతపఱుచునంతదాఁక బౌద్ధమతమునకు నిజముగా బలము కుంగలేదు. బౌద్ధమత ప్రచారమును భంగపఱుచుటకై యాకాలమున నీ ప్రహసనరచన మావశ్యకమయినది. ఇందు శాండిల్యుఁడను శిష్యుఁడు బౌద్ధమతవ్యామోహమునఁబడి చెడినవాఁడు. అప్రత్యక్షముల నాతఁడు నమ్మఁడు; శబ్దప్రమాణమును విశ్వసింపఁడు; వేళకు భోజనముఁ జూచుకొనును; అప్రయోజకమయిన యనుతాపముఁ జూపుచు భూతదయ యని యనుకరుడుగుచున్న వేశ్యనుపచరింపఁ బోవును; తగదన్న యాచార్యునిఁ దెగఁదిట్టును. నిట్లు వెంగలితనము వెల్లడించుచున్న శిష్యునిఁ బరివ్రాజకుఁ డెంతయు శాంతుఁడై చక్కదిద్దెను. ఈ ప్రహసనముఁ బ్రయోగించునప్పుడు చూచినఁగాని లేక చదివినను గాని, బౌద్ధమతమునెడఁ బెడమొగము పెట్టనివా రుండరు. కవి యిందు బౌద్ధమతము నంత నక్కఁగా వెక్కిరించినాఁడు. ఆకాలమున నీ ప్రహసనము బౌద్ధమతవ్యాప్తిని గొంత పడఁగొట్టియు నుండును. ఈ ప్రహసనమందు యోగదర్శనము పరమార్థసాధకముగా నిరూపింపఁబడినది; మహేశ్వరాదులు యోగాచార్యులు స్మరింపఁబడిరి. శంకరాద్వైత మాకాలమునకు జన్మింపనేలేదు. ఇందు "అష్టౌ ప్రకృతయః"— ఇత్యాదిగా సాంఖ్యదర్శనముగా నొక

వాక్యమును, "అదిణ్ణాదాణాదో" ఇత్యాదిగా బౌద్ధపిటక పుస్తకములలోనిదిగా నొకవాక్యమును గానవచ్చుచున్నవి. కపిలముని సాంఖ్యసూత్రములలోఁగాని యీశ్వరకృష్ణుని సాంఖ్యసప్తతిలోఁగాని మొదటివాక్యము కానరాదు. అది యే గ్రంథములోనిదో నేనెఱుఁగఁజాలనయితిని. ఈవాక్యముగల గ్రంథ మేదే నాకాలమునుండి యిప్ప డంతరించెనేమో! రెండవది బౌద్ధపిటక పుస్తకములలోఁ గలదట. "అదత్తాదానా ద్విరమణం శిక్షాపదం, ప్రాణాతిపాతా ద్విరమణం శిక్షాపదం, ముఖావాదా ద్విరమణం శిక్షాపదం, అబ్రహ్మచర్యా ద్విరమణం శిక్షాపదం, అకాలభోజనా ద్విరమణం శిక్షాపదం, అస్మాకం; బుద్ధం, ధర్మం, సంఘం, శరణం గచ్ఛామి." ప్రాకృతమూలమున కిది సంస్కృతచ్ఛాయ. "మాకు పరవిత్తాపహారణమునుండి తప్పుకొనుట యభ్యసింపవలసినది; ప్రాణిహింసనుండి తప్పుకొనుట యభ్యసింపవలసినది; అసత్యోక్తినుండి తప్పుకొనుట యభ్యసింపవలసినది; అబ్రహ్మచర్యమునుండి తప్పుకొనుట యభ్యసింపవలసినది; అకాలభోజనమునుండి తప్పుకొనుట యభ్యసింపవలసినది; నేను బుద్ధదేవుని శరణము చొచ్చెదను; బౌద్ధధర్మమును శరణముచొచ్చెదను; బౌద్ధసంఘమును శరణముచొచ్చెదను." మొదటి యైదింటికిఁ బంచ శిక్షాపదములనీ కడపటి మూఁడింటికి శరణత్రయమని వెరసి యెన్మిదింటికి నార్యాష్టాంగములని బౌద్ధులలో వ్యవహారము.

'రోమాంచో ముఖశోషశ్చ' ఇత్యాదిగా నిం దుదాహృతమయిన శ్లోకము చరకసుశ్రుతాదులలోఁ గలదేమో గుర్తింపఁజాలనయితిని. ఆకాలమునఁగూడ నపండితులు చేతఁగానివైద్యముఁ జేయుచుండుట నిందుఁగల వైద్యహాస్యము తెలుపుచున్నది.

పరివ్రాజకుఁడు వేశ్యాశరీరమునఁ బ్రవేశించి కొంతవింత నడపుచుండఁగా వింతపై వింత యన్నట్లు పరివ్రాజకశరీరమున వేశ్యాప్రాణములను యమపురుషుఁడు ప్రవేశపెట్టెను. తనశరీరమున వేశ్యాప్రాణములకుఁ బ్రవేశముకల్గునని పరివ్రాజకుఁడు ముం దెఱుఁగఁడు. అది జరిగిన తర్వాత వేశ్యాశరీరమందుఁగల పరివ్రాజకుఁడు భాషింపనే లేదు. ఆశ్చర్యముచెంది యాలోచించుచున్నాఁడు. శాండిల్యుఁడును ఆలోచనాంబుధిలో మునిఁగినాఁడు. కవి యిక్కడ కడునేర్పు చూపినాఁడు.

కథాస్థానము

అజ్జుక ప్రశ్నింపఁగాఁ జేటి 'బావ ఇదుగో వస్తున్నానని చెప్పి నగరంలోకే వెళ్లాడు' అన్నది. వ్యాఖ్యాత యిక్కడ నగరమనఁగా 'పాటలీపుత్ర'మని వ్యాఖ్యచేసినాఁడు. అది యుక్తమే. యమపురుషుడు యమలోకము దారిని చేర్కొనుటలో గంగనుండి యుపక్రమించి దక్షిణముగానున్న నదీనగనగరాదులను జెప్పినాఁడు. కావునఁ గథాస్థానము గంగకావల నుండవలసినదేకదా!

తెల్గు చేఁత

ఈ ప్రహసనము ప్రాకృత బహుళము. ప్రాచ్యలిఖితపుస్తకశాలలో విచ్ఛాయముగాఁ దప్పులతో దీనివ్రాఁత ప్రతి యొకటికలదు. దానిఁ జూచి వ్రాసికొని యిట్లో నేను దెలిఁగించితిని.

కాని కొన్నిచోట్లఁ దప్పులు దిద్దఁగుదురనివిగా నుండెను. కథారంభముననే "పరివ్రాజకః-శాండిల్య, శాండిల్య! (పృష్ఠతోఽవలోక్య) నతావ ద్దృశ్యతే; సదృశమస్య తమో వృతస్య" అని యుండవలసిన వాక్యములోని యేకదేశము 'నతావ ద్దృశ్యతే సదృశమస్య తపో వ్రతస్య' అని యుండెను. ఇట్టి చిక్కులింకను జొక్కులుగలవు. కర్త పేరు లేని వ్యాఖ్యానము క్రొత్తగా నపుడు పయిపుస్తకశాలకువచ్చెను. నే నావ్యాఖ్యానము సాహాయ్యమున సర్వసంశయములఁ దీర్చుకొన్నాను. ఆవ్యాఖ్యానమునఁగూడఁ బ్రాకృతవాక్యములకు వ్యాఖ్యయేకలదుగాని సరిగా ఛాయలేదు. అయినను నది సరిగా గుర్తింపఁదగినదిగానే యుండెను. ఇప్పటి తెలుఁగు పలుకుబడి చొప్పున నేనాప్రాకృతము నించుక స్వతంత్రించి విడఁబఱిచి యనువదించితిని. నా తెలుఁగుచేత యెట్లున్నదోకాని మూలగ్రంథము మిక్కిలి హృద్య మయినదని నే ననఁగలను.

శ్రీభారతి పత్రికలో నా తెలుఁగుచేత ప్రకటింపఁబూనిన సమకాలముననే బీహార్ అండ్ ఒరిస్సా జర్నల్‌లో మూలగ్రంథము విచ్ఛాయముగానే ముద్రితమై వెల్వడెను. చూచితినిగాని యది యనేకలోపములతో నసంగతమై యున్నది. గ్రంథభాగములే యందు విడువఁబడినవి. దానిఁ బ్రకటించినవారు వ్యాఖ్యానము నెఱుఁగరు. నే నిప్పుడు సరిపఱచుకొన్న మూలము వారిముద్రణముకంటె నెంతో గుణవంతముగా నున్నది. వారికి దానికర్తనుగూర్చి కాలమునుగూర్చి యేమియు నెఱుఁగరాలేదు. బౌద్ధమత ప్రశంసనుబట్టి ప్రాచీనమయిన దని మాత్రము వారు భావించిరి.

కడుఁజిన్నదగు నీప్రహసన పుష్పమునకుఁ దొడిమ యింక నెక్కుడుగా నుండరాదుగదా!

నీవె నేను నీతోడిదే నిఖిలజగము

అధికార్ల **సూర్యనారాయణ**రావు గారు, బి. ఎ., బి. యల్.,

నిన్ను మోయుట భూమి నాకన్నతల్లి,
నీకు సుఖమిచ్చుపవనుడు నాకు హితుఁడు,
నిన్నుఁబ్రోచుట నాబంధుఁ డీశ్వరుండు,
నీవు ప్రేమించునాహృది ప్రావనంబు,
నిన్ను వలచుట జానకీ! నేను నేను.
నిను సదా కాంచునాకనుల్ నిర్మలములు,
నీవిహితమార్గగామి నాజీవనంబు,
నీవె నేను నీతోడిదే నిఖిలజగము!



తుక్కా — పంచకము

ఆ. రంగస్వామి సరస్వతిగారు, బి. ఏ.,

తుక్కాపంచకముపై నాషాఢమాసపు భారతి 'పుష్పాంజలి' లో విద్వత్కవిశిఖామణులు, నస్మన్మిత్రులును అగు శ్రీమానవల్లి రామకృష్ణకవిగారు వ్రాసిన వ్యాసమును జదివి యానందమొందితిని. ఆవ్యాసమున వారుచూపిన నవీనవిషయముల కాంధ్రలోక మంతయు వారియెడఁ గృతజ్ఞులుగావలసిన దే. అయిన నాపట్టున కవిగా రనిన కొన్ని వాక్యములు కొంతమార్చినగాని ప్రమాణములు కానేరవని వానిగుతించి యిచ్చట కొంత వ్రాయవలసివచ్చినది. ఈసందర్భమున కవిగారి వాక్యము లివి. "కటకాధిపతియగు ప్రతాపరుద్రగజపతి కృష్ణరాయనిచే విజితుఁడై తన కుమారితెయగు తుక్కాదేవి నతని కొసఁగి తత్కోపానలము శమింపఁజేసెనట. విజయియగు రాయలు తుక్కాదేవిని బరిగ్రహించియు నేకారణముచేతనో ఆమెవలన సహచారిణీసుఖం బనుభవింపఁజాలక కంభమునకోటలో నామెను నిరోధించి యుంచెనట. ఆమె చక్కని కవయిత్రియు, ధాత్రియు, కంభస్థలతటాకనిర్మాత్రియు నయ్యెనని "విజయనగర చరిత్రమున కాధారములు" (Sources of Vijayanagar History) అను గ్రంథమునఁ గానవచ్చుచున్నది."..."దీనిని (తుక్కాపంచకమును) తుక్కాదేవికి నంటఁగట్టిన బ్రహ్మశ్రీ సరస్వతిగారెచ్చటనుండి యీసంబంధము సాధించి తెచ్చిరో తెలియఁ గఁజాల." పైవాక్యములనుగూర్చి యభిప్రాయమిచ్చుటకు పూర్వము 'విజయనగర చరిత్రమున కాధారములు' అను గ్రంథమునకును నాకు నున్న సంబంధము కొన్నికారణాంతరములచే మఱుఁగుపడియుండగా వస్తుస్థితి నెఱిఁగి చెల్వరించిన కవిగారికి నే నెంతయుఁ గృతజ్ఞుఁడను.

కవిగారి పైవాక్యములఁ జదువువారందఱికి నే నెచ్చటనో యుండిన దైయను శృంగారపరశ్లోకములఁ దెచ్చి వానికి తుక్కాపంచకమని పేరిడి కృష్ణరాయలకు తుక్కాయను పేరిట గజపతిసుతను భార్యగాఁ గల్పించి యామెను ముడిపెట్టిన ట్లగపడుదు. ఈ యపవాద మెంతవఱకు వాస్తవమో విచారింపఁదగినది. మొట్టమొదట యీ విషయమున గ్రంథపు వాక్యముల నిచ్చట నుదాహరింతును.

The following five verses are ascribed by tradition to Tukka, the daughter of Pratapa rudra Gajapati, the ruler of Orissa, who was given in marriage to Krishna Raya. She is said to have been neglected by her husband and to have led a life of seclusion at Kambam in the Cuddapah District. The big irrigation tank at Kambam is said to have been constructed at her instance. In the verses she bemoans her husband's neglect of her.'

ఈ వాక్యములనుగూర్చియు, కవిగారిఖండనమును గూర్చియు చర్చింపవలసిన విషయములు. 1. ఈ శ్లోకములకు తుక్కాపంచక మను నామము గలదా? 2. తుక్కాపంచకమునకు, గజపతి సుతునకుగల సంబంధ మెట్టిది? ఇది యర్వాచీనకల్పితమా? 3. కృష్ణదేవరాయలకు గజపతి సుతయొక భార్యయుండెనా? 4. అట్టి భార్యయుండిన నామె యీ శ్లోకములనుఁ గూర్చునంత సమర్థురాలు గానోపునా? ఈప్రశ్నలకు క్రమముగా నుత్తరమిచ్చెదను.

(1). ఈశ్లోకములకు తుక్కాపంచకమను నామముగలదా? గురుజాడ శ్రీరామమూర్తిగారి కవిజీవితములలో నీశ్లోకము లేయుదాహరింపఁబడియున్నవి. అచ్చట నీవిధముగా నున్నది. 'తుక్కాపంచరత్నములు, తుక్కానామగజపతి పుత్రీ కృష్ణదేవరాయ పత్నీ' అనియున్నది. పైవ్రాతనుబట్టి యీశ్లోకములకు మొట్టమొదట తుక్కాపంచకమని పేరిడినదియు, దానిని కృష్ణరాయలభార్య కంటగట్టినదియు నేనుగాదనుట స్పష్టము. ఇఁక నిట్లంటగట్టినది గురుజాడ శ్రీరామమూర్తి గారై యుండవచ్చునా? పైకవిజీవితము వాక్యములో నే "కృష్ణదేవరాయపత్నీ" అని యున్నది' అనుటచేత నావాక్యము శ్రీరామమూర్తిగారిది కానట్లును స్పష్టము. గురుజాడ శ్రీరామమూర్తిగారు

తమ గ్రంథములలో నుదాహరించిన గాథలన్నియు గవర్నమెంటు ప్రాచ్యలిఖితపుస్తకశాలయందలి మెకంజీ మొదలగువారు సేకరించిన గ్రంథములలోనివి. వీనిలో ననేకములు చరిత్రము లున్నవి. వీనినుండియే శ్రీరామమూర్తిగారు దీనిని సేకరించియుందురనుట స్పష్టము. కనుక నీ తుక్కాపంచకము సంబంధము మెకంజీదొర నాటికి ప్రసిద్ధమని తెల్లమగును.

ఇదిగాక కృష్ణరాయలు గజపతిసుతను వివాహమాడినందుకు వేఱు ప్రమాణము లున్నవా? కృష్ణరాయలనుగూర్చి వ్రాయబడిన రాయవాచక మనుచరిత్రగ్రంథమునఁ గృష్ణరాయలు గజపతిరాజ్యమును జయించి పొట్నూరు జయస్తంభము నిల్పినవెనుక గజపతి తన సుతను కృష్ణరాయల కిచ్చి వివాహముచేసినట్లు చెప్పఁబడియున్నది. ఈ గ్రంథమునందలి కథయే కొంచెము హెచ్చుతక్కువగా కృష్ణరాయల చరిత్రము కొఱకే వ్రాయఁబడి, విజయనగరచక్రవర్తుల వంశమునఁ బుట్టిన యొకరి కంకితమియ్యఁబడిన కుమారధూర్జటివిరచిత కృష్ణరాయవిజయమునందు నున్నది.

పైరెండు గ్రంథములును కృష్ణరాయల కాలమునకు పిదపఁ బుట్టినవే కదా. కనుక నీవిషయమున నంతగా ప్రమాణములగునా యని కొందఱనవచ్చును. ఇఁకఁ గృష్ణరాయల కాలముననే పుట్టిన గ్రంథములలో నీ విషయమున్నదా? కృష్ణరాయల కాలమునందే పుట్టినదియు, అతని శిరఃప్రధానియగు సాళ్వతిమ్మ దండనాథునకు మేనల్లుడును, గజపతియొద్దనుండి జయించినపిదప కొండవీటి రాజ్యమునకు నధిపతియునైన నాదిండ్ల గోపదండనాథుఁడు రచించిన ప్రబోధచంద్రోదయవ్యాఖ్యానపీఠికయం దీక్రిందిశ్లోకము కనఁబడుచున్నది.

“ప్రతాపరుద్రస్య గజేశ్వరస్య పుత్రీం పవిత్రీకృతభూతధాత్రీమ్ । ప్రత్యగ్రహీ ద్యః ప్రకటప్రతాపో భద్రాం సుభద్రా మివ పాండవేయః॥”

ఈ గ్రంథమున కృష్ణరాయల ప్రతాపమును వర్ణించుచు నతని విజయములలో నొకటినైనను పేరు పెట్టి చెప్పకపోయినను గజపతిప్రతాపరుద్రుని కూఁతుఁ గృష్ణరాయలు పెండ్లాడెననిమాత్రము చెప్పెను. దీనినిఁబట్టి చూడ కృష్ణరాయల యీవివాహము గోపదండనాథుని యభిప్రాయమున నతని దిగ్విజయము లన్నిటికంటెను ప్రతాపసూచకమని యేర్పడును.

కృష్ణరాయలు గజపతికూఁతుఁ బెండ్లాడెననుట కింకొక యాధారముకూడ కలదు. ఈ యాధారముకూడ ప్రబోధచంద్రోదయ వ్యాఖ్యవలెనే రాయలకాలముననే పుట్టినది. కృష్ణరాయల దిగ్విజయముంగూర్చి వ్రాయుచు నాయన యాస్థానమందుండిన కుమారసరస్వతి యను ద్రావిడకవి యీక్రిందిపాట(పద్యము)నొనర్చెను. ఇది 'తమిళ్ నావలర్ చరితై' అను ప్రాచీనద్రావిడసుభాషితావళియందున్నది. దీనిని పైనిచెప్పిన నా 'ఆధారములు' అను గ్రంథమున 155 వ పుటయం దుదాహరించియున్నాను. ఆపద్య మిది.

“కుమారసరస్వతి, ఒడ్డియనై (కృష్ణరాయర్) జెయిత్తపోతు పాడియదు —

కలిఙ్గ మిప్పిద్ద నుదిక్కై విణ్ణోట్టు
మెలిన్దుకటుకన్ను ష్టున విట్టాల్ — మలిన్దుమలర్ప్
పొన్నిట్టమాన కిరుష్ణబూపాలా వృద్ధనుక్కాప్
పిన్నిట్ట వొడ్డియన్ పొర్పైక్

ఈపద్యమునందు వొడ్డియన్ కళింగరాజు యొక్క సుతునకు అతని రాజ్యలక్ష్మికి నైక్యము కల్పింపఁబడి యిద్దఱును కృష్ణరాయలఁ బతిగాఁ బరిగ్రహించినట్లందముగా వర్ణింపఁబడినది.

ఆంధ్రమునందే కృష్ణరాయల నిర్యాణానంతరము గజపతి కర్ణాటరాజ్యముపై దండెత్తిరాగా పెద్దన చెప్పిన 'రాయరావుతగండ...' యను చాటుపద్యము నెఱుఁగనివారును గలరా? అందలి 'ఘనతర నిర్భరగండ పెండేరమిచ్చి, కూఁతు రాయలకును గూర్చినాఁడు' అను పాదమునుబట్టి కృష్ణరాయలు గజపతికూఁతుఁ బెండ్లాడెననుట స్పష్టమేగదా.

ఆంధ్రదేశమునఁ బ్రాఁతకాలమునుండి కృష్ణరాయలకు గజపతికూఁతు రొకభార్యయై యుండెననియు, వివాహానంతర మామెకును కృష్ణరాయలకును నేకారణముచేతనో పొందికలేక యామె వేఱుగా నుండెననియు నొక గాథయున్నది. ఇదియును గాక నందితిమ్మన కృష్ణరాయలకును అతని భార్యయగు గజపతికూఁతురికిని ప్రణయకలహము సంభవింపగా నద్దాని శమింపఁజేయుటకుఁ బారిజాతాపహరణము వ్రాసెననియు నొకయైతిహ్యముగలదు.

ఈయర్థముగలదే యింకొక గాథ కృష్ణరాయలఁగూర్చియే యున్నది. పారిజాతాపహరణము వంటిదే సత్యావధూప్రీణన మను గ్రంథమును రాయలు వ్రాసెనని యాతని యాముక్తమాల్యదయందే యుండలేదా?

ఇంతవట్టు నుదాహృతగ్రంథములవలన గజపతి కూఁతురియొక్క పేరిది యని స్పష్టముగా తేర్పడలేదు. రాయవాచకమున మాత్ర మామె పేరు జగన్మోహిని యని యున్నది. ఇటీవల నొకరు 'ప్రతాపరుద్రస్య......' అన్న నాదిండ్ల గోపన వ్యాఖ్యాన శ్లోకమునందలి 'భద్రాం' అను సుభద్రాశబ్ద విశేషణమును జూచి పొరపడి ప్రతాపరుద్రుని కూఁతురిపేరు 'భద్ర' యగునని వ్రాసిరి. అయిన నాశ్లోకమును జక్కఁగాఁ బరిశీలించిన నందు నామె పేరు లేదనియే స్పష్టమగును.

జగన్మోహిని యను పేరు సాధారణముగ నెవ్వరు నుంచు పేరుగా కన్పడనందునను, గజపతిరాజ్యమైన యుత్కలదేశమునం దట్టి పేరుండుటకు పొసఁగుటచేతను నది వెనుక కల్పితమని యూహ్యము. ఇఁక నామె పే రియ్యదియని మనకుఁ దెలియుట కాధార మేమైన కలదా? ఈ తుక్కాపంచకమునందలి 'తుక్కా' యనునదియే పేరై యుండునా? ఇది యట్లుండుననుటకు కారణములు కొన్ని యున్నవి. ఉత్కలదేశమునందు వరదరాజమ్మవంటి పేరుండుటయ భావ్యము. భద్రయనునదియు నాశ్లోకమున పేరుగా నియ్యపును 'తుక్కా' పదమును పేరుగా గ్రహించుట కాక్షేపణ లేమియుఁ గనఁబడవు. అయిన నాపద మెవరికైన నామముగా నున్నదా? 'తుక్కారామ్' 'తుక్కాజీ' యను నామములు చరిత్రమునందు కొందఱు ప్రసిద్ధుల కుండలేదా? అట్లే తుక్కా యని స్త్రీకి పేరుండుటలో సందేహ మేమి?

ఇఁక తుక్కా యని గజపతి కొక కూఁతురుండి యామె కృష్ణరాయలకు భార్యయైనను ఆమెకును తుక్కాపంచక శ్లోకములకును సంబంధ మెట్టిది? ఈ శ్లోకములకు తుక్కాపంచక మను పేరుండుటచేతనే యవి యామెచేఁ జెప్పఁబడినవని స్పష్టము. ఇంతవఱకును భృంగపంచక మని యుండు గ్రంథమున కిప్పుడే యొకరో 'తుక్కాపంచక' మని క్రొత్తగా నామకరణము చేయలేదనియు స్పష్టమే. అయిన నీరైదుశ్లోకముల నీతుక్కాదేవి వ్రాసియుండునా లేక తత్పూర్వమే ప్రాచీన కవికృతములైనవాని నామె చేర్చియుండునా? ఈ విషయమున సందేహము దీర్చు ప్రమాణము లేమియు లేక 'ఆధారములు' (sources) గ్రంథమును వ్రాయుకాలమున నాసందర్భమున 'The following five verses are ascribed by tradition to Tukka, the daughter of Prataparudra Gaja-pati, who was given in marriage to Krishna raya' అని మాత్రము వ్రాసితిని. ఇందీశ్లోకములు మొట్టమొదట తుక్కాదేవియే వ్రాసెనని లేదు. ఈశ్లోకము లామె వ్రాసినట్లు ప్రవాదమున్నదని మాత్రము గలదు. ఈశ్లోకము లామె వ్రాయకుండినను వేఱువేఱుస్థలములందలివైదుశ్లోకముల నొకటిగాఁ గూర్చి తనభర్తకు తుక్కాదేవి పంపియుండుటచేతనే వీనికిఁ దుక్కాపంచకమని పేరువచ్చియుండరాదా? వల్లభదేవుని సుభాషితావళియందీశ్లోకములైదింటియందును రెండుదాహరింపఁబడుటచే నివి తుక్కాపంచకమున సేకరింపఁబడుట కాక్షేపమేమి? సుభాషితావళి శ్లోకములతో వాని కర్తలపేళ్లు ననేకస్థలములలో నుండలేదా? అట్లే యీరెండు శ్లోకములకు నందు కర్తలపేళ్లున్నవా? అవి యేకకర్తృకములా? భిన్నకర్తృకములా? సందేహమునకందు సమాధానమున్నదా? ఏకకర్తృకములైన రెండవమిగిలిన మూఁడుశ్లోకములను దత్కవికృతములు లేవా? ఈప్రశ్నల కుత్తరమిచ్చుటకుఁ దగిన యాధార మేమియు లేదు. సుభాషితావళియం దిందలి రెండుశ్లోకము లుదాహృతములని గ్రంథము సేకరించినకాలమునఁ దెలియదు. అట్లు తెలిసియుండినఁ దప్పక యుదాహరించియేయుందును. ఇప్పటికొందఱివలె నేదో సిద్ధాంతమును మనస్సునందుంచుకొని యందులకై ప్రాచీనగ్రంథములలో నున్న పాఠములుమార్చుట గాని, లేని పాఠాంతరముల సృష్టించుట గాని 'ఆధారములు' అను గ్రంథముయొక్క యుద్దేశము గాదు. గ్రంథము వెలువడిన కొలఁది మాసములలో నే తిరువాన్కూర్ రాజ్యములో గొప్పయధికారపదమున నుండు నొకవిద్వాంసుఁ డీరెండుశ్లోకములను సుభాషితావళియందున్నవని తెలియపఱచెను. అందుపై వారికి కృతజ్ఞతఁ దెలుపుదు నీగ్రంథము మింకొక పర్యాయము ముద్రించునెడల నీ విషయముఁ జేర్పఁబడునని బదులీయఁబడెను. ముకుళభట్టుగ్రంథమున 'భ్రమరభ్రమతాం' అనుశ్లోక ముదాహరింపఁబడియున్న దని మొట్టమొదట యాంధ్రలోకమునకుఁ దెలియఁబఱచిన కవిగా రెంతయు స్తోత్రార్హులు. అయిన నాపట్టున కాలనిర్ణయమునకై వా

రుదాహరించిన రాజతరంగిణి పద్యములమాత్ర మంతగాఁ బ్రమాణము లగునాయని సందేహము పొడముచున్నది. రాజతరంగిణియందలి యనేకగాథలు ప్రమాణరహితము లనియు, అపసిద్ధాంతములనియుఁ జరిత్రకారు లెఱిఁగినదే కదా. ఆగ్రంథమునందలి శ్రీహర్ష విక్రమాదిత్యులకు వాస్తవమైన "శ్రీహర్ష" విక్రమాదిత్యులకాలమునకుఁ జరిత్రమునకు నెంతదూరమో కవిగారికి తెలియదా? రాజతరంగిణియందలి ప్రవరసేనుఁడు హూణరాజును గాశ్మీరదేశము నేలినవాఁడును గదా. వాస్తవమైన సేతుబంధకర్త ప్రవరసేనుఁడు కవిగారికిఁగూడ దెలిసినట్లు, కుంతలదేశమున వాకాటకరాజును గాళిదాసాదులకు స్నేహితుఁడును గుప్తవంశపు విక్రమార్కునికి దౌహిత్రుఁడునుం గాదా. ఇట్టి విపరీతసిద్ధాంతములు రాజతరంగిణిలో నెన్ని లేవు? కనుక నాగ్రంథము కల్హణుని కాలమునకుఁ,జాలపూర్వచరిత్రమునకుఁ బ్రమాణము కాఁజాలదు.

ఇఁక తుక్కాదేవి యీయైదుశ్లోకములను దానే చెప్పియుండును అనుట కామెకుఁ దగినవిద్య యుంట కాధారమేమైనఁగలదా. ఆమెతండ్రి ప్రతాపరుద్రుఁడు గొప్పరాజై కళింగదేశమునుండి వెడలి యాంధ్రదేశమంతయు జయించి అప్పటి విజయనగరరాజ్యములోఁ జాలవరకాక్రమించి యొకానొకకాలమునఁ దనసైన్యముతోఁ రామేశ్వరమునకు వెళ్లియుండినట్లు ప్రమాణము లగపడుచున్నవి. ఈకళింగరాజు విజయనగర రాజ్యములో నాంధ్రద్రవిడదేశముల నాక్రమించినసంగతి ద్రావిడదేశములోని శాసనములలో విశదముగను. అం దీ కళింగరాజు జయించినవిషయము 'ఓడ్డియన్ కలాపమ్' అని శాసనములలో నుదాహరింపఁబడియున్నది. ఒక కాలమున ప్రతాపరుద్రునితండ్రి పురుషోత్తమగజపతి తనసేనతో బళ్లారిజిల్లాలోనున్న విజయనగరపట్టణమును ముట్టడించెనని విజయనగరరాజులలో నొకఁడైన మల్లికార్జునరాయల విషయము వ్రాయు సందర్భమున గంగాధరుఁడనుకవి వ్రాసిన "గంగాదాసప్రతాప విలాసమున" నున్నది. ప్రతాపరుద్రుఁడు గొప్పకవియు ననేకకవుల కాశ్రయభూతుఁడు నని తెలియుచున్నది. షడ్దర్శనము లన్నిటిపైని గ్రంథము లొనర్చిన లొల్ల లక్ష్మీధరయజ్వ యీ ప్రతాపరుద్రుని యాస్థానకవిగాఁ గొండవీటియం దుండెను. ప్రతాపరుద్రుఁడును 'సరస్వతీవిలాస' మను స్మృతిగ్రంథమునకు కర్తయని ప్రసిద్ధము. లొల్ల లక్ష్మీధరుఁడునుఁ, గ్రంథము లొల్లయార్యుఁడను నింకొక విద్వాంసుఁడునుగూడ కొండవీటిరాజ్యమున 'దైవజ్ఞ విలాసము', 'జ్యోతిషదర్పణము' అను అతివిస్తారములైన గ్రంథముల రచించియున్నారు. ఓఢ్రదేశమునందుఁ గొందఱుకవులును ప్రతాపరుద్రుని యాస్థానమున నుండిరి.

వంగదేశమునఁ బ్రసిద్ధ వైష్ణవాచార్యుఁ డైన చైతన్యులు ప్రతాపరుద్రునిచేఁ జాల గౌరవింపఁబడిరి. చైతన్యుఁడు ప్రతాపరుద్రుని యాస్థానమున నుండిన కాలమున వారిద్దఱిని వ్రాసిన చిత్రలేఖనమొకటి యిప్పటికి నున్నది. ప్రతాపరుద్రుని తండ్రి పురుషోత్తమగజపతి వ్రాసినదే కదా 'త్రికాండశేష' మను సంస్కృతనిఘంటువు. ఇట్లు అనేకపండితకవుల కాశ్రయమగు పండితకవివంశమునఁ బుట్టి సంస్కృతమందు నాంధ్రమునందు ననేకగ్రంథములు వ్రాసియు గ్రంథకర్తలకధిపతియునై ఆంధ్రభోజుఁడని పేరుగన్న కృష్ణరాయలకు భార్యయైన తుక్కాదేవి యీ యైదుశ్లోకములను రచించియుండ దనుట యెంతటిసాహసము?

ఇఁక నీతుక్కాదేవికిని, కంభస్థలమందలి తటాకమునకు సంబంధ మెట్టిది? ఈతటాకనిర్మాణవిషయకమైన శిలాశాసన మొకటి దానియొడ్డుననే యున్నదని ప్రతీతి. అయిన నింతవఱకు శాసనప్రతిబింబము శాసనశోధకులచే నెత్తఁబడినట్లు కనుపడదు. ఆశాసనమం దది వరదాజమ్మచే నిర్మింపఁబడినదని యున్నదో లేదో? అట్లుండిన యెడల నది తుక్కాదేవిచే నిర్మితముకాకపోవునేమో? వరదాజమ్మ (సరియైన రూపము వరదాజిఅమ్మ) అను పేరుగలవారు విజయనగరరాజవంశమందు కలరు. వారిలో ప్రసిద్ధురాలు కృష్ణరాయలకుఁదమ్ముఁడును, నతని వెనుక రాజ్యమేలినవాఁడును నగు అచ్యుతరాయలకు భార్య. ఈమె సలకరాజుయొక్క కూఁతురును, అచ్యుతరాయల మంత్రియు సేనాధిపతియునగు సలకము తిమ్మరాజు తోఁబుట్టువును; ఈమె పేరిటనే విజయనగరము సమీపమున వరదాజమ్మనపేటయను గ్రామము నిర్మింపఁబడినది. ఓదువ (విద్యార్థి) తిరుమలమ్మయను కవయిత్రి అచ్యుతరాయలకును, వరదాంబకునైన వివాహమునే 'వరదాంబికాపరిణయ' మని చంపూకావ్యముగా రచియించియున్నది. కంభము తటాక మామెచే నిర్మితమేమో యను సందేహము కలుగుచున్నది.

ప్రేమతత్త్వము

నల్లాది సూర్యనారాయణశాస్త్రి గారు

(ఉత్తరభాగము)

(గతసంచిక తరువాయి)

నిష్కామ సాత్త్వికప్రేమ

నిరీశ్వరసాంఖ్యము :—

ఆరయఁ బ్రధానమెల్ల వియదాది వికారములొంది యీచరా
చరజగమయ్యె నియ్యదియు, సాజమటంచును దెల్పు తన్నిరీ
శ్వరమతసాంఖ్యమున్ బ్రకృతిఁ బాసి సుఖింపఁగోరి తెల్విమైఁ
బురుషుఁడు కేవలత్వమును బొందునటం చనురక్తిఁ జూపదే?

గీ. దీని నిట్లుంచి యిఁకమీఁదఁ దెలియఁ బఱతు, సద్వయప్రేమవైచిత్రి సగుణమగుచు
ద్వైతమను పేరఁబరఁగు మతంబునందుఁ, దనరు నియ్యది వివిధభేదములతోడ.

సద్వయప్రేమ

క. జీవేశ్వర భేదంబును, భావించెడి మతములెల్ల ద్వైతంబులగున్
జీవుఁడు తనుఁదా నీశ్వరు, భావించుటఁ జేసి యిదియు ద్వైతం బయ్యెన్.

[1] రామానుజమతము :—

గీ. భోగ్యమైనట్టి దృశ్యంబు భోక్తయైన, జీవుఁడును దన్నియంతయై చెలఁగు సకల
జగదుపాదాన భూతుఁ డీశ్వరుఁడు ననుచు, నింక మూఁడు పదార్థంబు లేర్పరించి.

ఉ. నేరిమితోడ నిత్యము ననిత్య మెఱింగి విరాగియౌచు సం
సారముఁ రోసి జీవి మనసార విముక్తిని గోరి దేవునిం
జేరి యుపాసనంబున భజించుచు జ్ఞానమునొందె నేని యా
కారుణికోత్తముండు దయగల్గి స్వధామముఁ జేర్చు నాతనిన్.

గీ. దేవగృహమార్జనంబును దివ్యగంధ, పుష్పసంపాదనము దేవపూజ దేవ
తాస్తవము దేవతానుసంధానమనఁగఁ, బంచవిధముగఁ బరఁగు నుపాసనంబు.

గీ. దాన జనియించు విజ్ఞానధార, దాన నగు నిదిధ్యాసనాత్మకమైన భక్తి
కలరి హరి సుప్రసన్నుఁడై యాత్మ భక్తు, నావరించు నవిద్యను బోవఁద్రోచి
మహితమై పునరావృత్తి రహితమైన, యాత్మపద మిచ్చునదె ముక్తి యనఁగఁబరఁగు

1 ఇదియే శ్రీవైష్ణవమనియు, విశిష్టాద్వైతమనియుఁ బేర్లు గాంచెను.

మోహనకృష్ణుడు

Lakshmi Art Printing Works, 8.

శ్లో. శ్రీమద్బర్హిశిఖణ్డమణ్డనజుషే శ్యామాభిరామత్విషే, లావణ్యైక రసావసిక్తవపుషే లక్ష్మీసరః ప్రావృషే;

జరాసంధ వధ